తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఒంగోలు
epaper.vaartha.com WWW.VAARTHA.COM : fb.com/vaartha Digital
Published from Ongole, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
14-12-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 313 పేజీలు: 12 వెల: 8.00

# క్వాంటం వ్యాలీకి అడ్రస్ ఏపి



## నాలెడ్జ్ ఎకానమీ, టెక్నాలజీకి కేంద్రంగా విశాఖ

## అమరావతి, విశాఖతో అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

## రైతుల సమస్యలు నేనే పరిష్కరిస్తా: సిఎం చంద్రబాబు

**విజయవాడ, డిసెంబరు 13, ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో అమరావతి,విశాఖలతో పాటు అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు.ఏ రంగంలోనైనా ఏపీనే ముందంజన ఉంచుతామన్నారు.రాజధాని పరిధిలో నిర్మాణాల పూర్తికి సమయాన్ని నిర్ధేశించుకుని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సీఆర్డీఏ పనులు పనుల పురోగతిపై ఆయన అధికారిక అప్డేట్ నివేదికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత నివేదికలపై అధికారులకు పలు సూచనలు చేస్తూ మార్గదర్శనం చేశారు. సీఎంఓ కార్యాలయం ద్వారా అందిన సమాచారాన్ని అనుసరించి రాజధాని నిర్మాణ పనులు ప్రారంభించిన చోట కన్స్ట్రక్షన్ కోసం మౌలిక సదుపాయాల కల్పన, ఇతర అంశాలపై సీఎం తెలుసుకున్నారు. పనులకు ఎలాంటి ఇబ్బంది కలగని విధంగా నిర్మాణాల వద్ద మౌలిక సదుపాయాలను కల్పించామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల కారణంగా నిర్మాణ పనులకు ఏమైనా ఇబ్బందులు వచ్చినా వర్షాకాలం పూర్తి >>2




## హైదరాబాద్‌లో మెస్సీ హోరు

### ఫైబర్‌నెట్ వ్యవహారం

# సిఎం చంద్రబాబుపై సిఐడి కేసు కొట్టివేత

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ అధికారంలో ఉండగా ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌లో అవినీతి జరిగిందంటూ అప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడుపై నమోదు చేసిన సీఐడీ కేసును విజయవాడ ఏసీబీ కోర్టు కొట్టివేసింది. ఈ కేసులో ఆయనతోపాటు మిగిలిన నిందితులకు క్లీన్‌చిట్ ఇచ్చింది. 2014-19 నడుమ ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌లో నిబంధనలను ఉల్లంఘించి వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు టెండర్లను కట్టబెట్టారని, దానివల్ల కార్పొరేషన్‌కు రూ.114 కోట్ల వరకు ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లిందని అప్పటి ఎండీ మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదుతో సీఐడీ కేసు నమోదు చేసింది. నాటి ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి హరికృష్ణ, ఎండీ కె.సాంబశివరావు, టెర్రాసాఫ్ట్ డైరెక్టర్ తుమ్మల గోపాలకృష్ణ, చంద్ర బాబు (ఏ25), ముంబై, ఢిల్లీకి చెందిన >>2







**Vijayawada: Varun Motors**: **Ring Road**: 9885701729 **Enikepadu:** 9885104222, 9885706831 | **Kanuru: Santosh Auto**: 7799787967 | **Eluru:** Reddy & Reddy Motors: 9533290285 | **Bhimavaram:** Novelty Reddy & Reddy Motors: 9948424555 | **Guntur: Jayalakshmi Automotives**: 7396669031 | **Nellore: Vishnu Cars**: 7995088876 | **Bhargavi Automobiles**: 9848357778 | **Ongole: Jayalakshmi Automotives**: 9949033433.

14-12pg2exHMNWJQE 2_14-12pg2exHMNWJQE.qxd 14/Dec/25 12:14 AM Page 1





శనివారం కడప యరముక్కపల్లి కూడలిలో వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

# కడపలో వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

## పాల్గొన్న కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ రాష్ట్రమంత్రులు సత్యకుమార్, సవిత

**కడప కార్పొరేషన్, డిసెంబరు 13 ప్రభాతవార్త:** మాజీ ప్రధాని, భారతరత్న వాజపేయి హయాంలో వచ్చిన స్వర్ణ చతుర్భుజి హైవే ప్రాజెక్టు దేశం దశదిశ మార్చిందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు సత్యకుమార్, సవిత, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిన్.మాధవ్‌లు గుర్తుచేశారు. వాజపేయి స్ఫూర్తిని యువతలో నింపేలా అటల్ సందేశ్ మోదీ సుపరిపాలన యాత్ర తలపెట్టిన భాజపా కార్యవర్గం తలపెట్టిందన్నారు. వాజపేయి శత జయంతి సందర్భంగా ఈ నెల 11నుంచి 25 వరకు అటల్ సందేశ్ మోదీ సుపరిపాలన యాత్రలో భాగంగా కడప యరముక్కపల్లి కూడలిలో బిజెపి, టిడిపి, జనసేన మూడు పార్టీల నేతలూ కలిసి భారతరత్న వాజపేయి విగ్రహం ఆవిష్కరణ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. దేశంలో సుపరిపాలనకు వాజపేయి నాంది పలికారని, ఆయన తీసుకొచ్చిన పాలసీలు దేశాభివృద్ధికి మంచి పునాది వేశాయని గుర్తుచేశారు. అజాత శత్రువు, ప్రతి భారతీయుడు గర్వపడే నాయకత్వాన్ని దేశానికి ఇచ్చారని కొనియాడారు. ఒక సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన స్వశక్తితో పదిగి దేశానికి నాయకత్వం వహించారన్నారు. 9సార్లు లోక్‌సభకు, రెండుసార్లు రాజ్యసభకు ఎన్నికయ్యారంటేనే ఆయన గొప్పతనం తెలుస్తోం దన్నారు. పద్దెనిమిదేళ్ల వయసలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారని, 1998లో పోఖ్రాన్ 2 అణు పరీక్షలు జరిపి భారతదేశ శక్తి చాటారన్నారు. కార్గిల్ యుద్ధంలో శత్రువులకు తిరుగులేని సమా ధానం ఇచ్చారని గుర్తు చేశారు. నాడు అణు పరీక్షలైనా, నేడు సింధూర్ అయినా, నాడు చతుర్భుజి అయినా నేడు సాగరమాల అయినా అవి పన్డీయే పాలనలో విజయవంతమైన కార్యక్రమాలని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా దేశాన్ని 2047నాటిక నంబర్ వన్ చేసేందుకు పని చేస్తున్నారన్నారు. యువతరానికి మోదీ స్ఫూర్తిని స్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆదినారాయణ రెడ్డి, మాధవి రెడ్డి, వరదల్ రెడ్డి, కృష్ణ చైతన్య రెడ్డి, ఎమ్మెల్సీ బీటెక్ రవి, బిజెపి జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, టిడిపి నాయకులు శ్రీనివాసులు రెడ్డి, రితేష్ రెడ్డి, హరి ప్రసాద్, బిజెపి నాయకులు శశిభూషణ్ రెడ్డి, బాలకృష్ణ యాదవ్, నాగోతు రమేష్ నాయుడు, వేణు వర్ధన్ రెడ్డి, దయాకర్ రెడ్డి, ప్రవీణ్ నాయుడు, చలపతి, బొమ్మన విజయ్, భాను ప్రకాష్, మనసుల సురేష్, లక్ష్మీ నారా యణ రెడ్డి, దేవానంద్, సతీష్ చంద్ర, జనసేన నేత సుంకర శ్రీనివాస్, కూటమి నేతలు బిజెపి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 21న రాష్ట్రమంతా పల్స్ పోలియో

## మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 21న పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకమార్ యాదవ్ నేడొక ప్రకటనలో తెలిపారు. 5 ఏళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కల్ని తప్పకుండా వేయించాలని, కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని రాష్ట్రాల్లో నిర్వహిస్తారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 54,07,663 మంది 5ఏళ్ల లోపు పిల్లలకు 38,267 బూత్ లలో పోలియో చుక్కలు వేసేందుకు ఇప్పటికే జిల్లాలకు 61,26,120 డోస్‌లను రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు పంపించారని తెలిపారు. డిసెంబరు 21 పోలియో దినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా బూత్ స్థాయిలో పిల్లలకు పోలియో చుక్కల్ని వేస్తారని, ఆరోజు పలు కారణాలవల్ల పోలియో చుక్కలు వేసుకోలేకపోయిన పిల్లలకు తిరిగి ఈనెల 22, 23 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి 76,534 బృందాలు పరిశీలిస్తాయని మంత్రి పేర్కొన్నారు. 1704 మెడికల్ అధికారులు, 39,494 ఇతరులు (ఫార్మసిస్టులు, నర్సింగ్ విద్యార్థులు, ఇతర సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు), 4206 మంది పర్యవేక్షకులు నేషనల్ ఇమ్యునైజేషన్ డే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఏర్పాట్ల గురించి ఆయా జిల్లాల కలెక్టర్లకు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ లేఖలు రాశారని మంత్రి పేర్కొన్నారు.

# క్వాంటం వ్యాలీకి అడ్రస్ ఎపి

>> అయిన తర్వాత పూర్తిస్థాయిలో పనులు పరుగులు పెట్టించాలి. ఆర్థిక పరమైన ఇబ్బందులు లేవు. ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఆర్థిక శాఖకు కూడా చెబుతాను." అని ముఖ్యమంత్రి చెప్పారు. రాజధాని అభివృద్ధి యాత్ర ఆరంభమైందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విభజన తర్వాత రాజధాని లేకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. రాజధాని ఎక్కడ పెట్టాలనే అంశాన్ని కూడా చెప్పకుండా విభజన చేశారు. రాజధాని కోసం జాగా కూడా లేని పరిస్థితుల్లో రాష్ట్ర విభజన చేశారు. రాజధాని విషయంలో నాటి యూపీఏ ప్రభుత్వం లేనిపోని పంచాయితీ పెట్టింది. రాష్ట్రం మధ్యలో రాజధాని పెడితే అందరికీ బాగుంటుందని అమరావతిలో ఏర్పాటు చేశాం. రాజధాని నిర్మాణానికి భూమి కావాలి అన్నారు.ప్రణాళికలకు అనుగుణంగా రాజధాని నిర్మించగలరా అని అనుమానపడ్డారు. రెండవ విడుత ల్యాండ్ పూలింగ్‌కు రైతుల అండగా నిలిచారు.ఇప్పుడు ఆ పనిలో ఉన్నామన్నారు.రైతులు స్వచ్ఛంధంగా తమ సమ్మతి పత్రాలు అందిస్తున్నారు.సైబరాబాద్ నిర్మించిన అనుభవంతో అమరావతి నిర్మాణం ప్రారంభించాం. భూమి కోసం ఎదురుచూస్తున్న సమయంలో అమరావతి రైతులు నాకు దారి చూపారు. రాజధాని నిర్మాణానికి భూ సమీకరణ అనే కొత్త విధానాన్ని తెచ్చాం. సమీకరణ విధానాన్ని విజయవంతం చేసిన చరిత్ర అమరావతి రైతులదే. ప్రపంచంలో ఎక్కడా ల్యాండ్ పూలింగ్ విధానం లేదు...మనమే ఈ విధానాన్ని తెచ్చాం... సక్సెస్ చేశాం. అమరావతి పనుల రీస్టార్ట్ తర్వాత మొదటిగా సీఆర్డీఏ బిల్డింగ్ ప్రారంభమైంది.. నాకు సంతోషంగా ఉంది. సీఆర్డీఏ భవన ప్రారంభం రాజధాని అభివృద్ధి యాత్రకు ఆరంభం."అని ముఖ్యమంత్రి వివరించారు.రాజధాని కోసం అమరావతి మహిళా రైతులు రోడ్డెక్కి పోరాడారు...గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేశారు. రైతుల ఉద్యమానికి మద్ధతుగా నేను కూడా జోలె పట్టాను...ఉద్యమానికి అండగా నిలిచాను. కష్టాలు మరిచిపోవద్దు... రైతులు చేసిన త్యాగాల ఫలితాలను రైతులే అనుభవించాలి.. నేను దానికి పూర్తిగా కట్టుబడి ఉన్నాను. ఫేజ్1లో ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చారు. భూములిచ్చినందుకు గత పాలకులు మిమ్మల్ని నానా హింసలు పెట్టారు. రాజధాని ఎడారి అన్నారు.అమరావతినివేశ్యల రాజధాని అన్నారు. ఎంతో అపహాస్యం చేశారు. రైతులకు రెట్టింపు గౌరవం దక్కేలా... రెట్టింపు ఫలాలు అనుభవించేలా చేస్తాం. అమరావతి ఓ మునిసిపాలిటీగా మిగిలిపోకూడదంటే అందుకు తగ్గ మౌలిక సదుపాయాలు అవసరం. అమరావతి పరిపాలనకు కేంద్ర బిందువుగా ఉంటుంది. రైతులు వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుంటే అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. ఇంటికో పారిశ్రామికవేత్త విధానం అమరావతి నుంచే ప్రారంభం కావాలి. అమరావతి అభివృద్ధికి ఆటంకాలు లేవు. అమరావతిని క్వాంటం వ్యాలీ చేస్తున్నాం...

**ఎకనమిక్ రీజియన్ కింద విశాఖను అభివృద్ధి చేస్తున్నాం:** ఒకప్పుడు ఐటీ.. ఇప్పుడు క్వాంటం, డేటా సెంటర్, ఏఐ వంటి టెక్నో రంగాలదే హవా. అమరావతి రైతుల అభివృద్ధికి అండగా ఉంటాం... చేయూతనిస్తాం. రాజధాని అమరావతి పునాదులు చాలా బలంగా ఉన్నాయి. పవన్ కళ్యాణ్, బీజేపీలతో కలిసి ముందుకెళ్తున్నాం. విశాఖ కూడా అద్భుతంగా అభివృద్ధి అవుతోంది. దేశానికి వచ్చిన అతి పెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి విశాఖకు వస్తోంది. నా ఆలోచన ఎప్పుడూ ప్రజల కోసమే... వారి భవిష్యత్ కోసమే అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నెట్ జీరో కాన్సెప్ట్ తీసుకొచ్చి విశాఖను కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దుతాం. ఇటీవల విశాఖ పెట్టుబడుల సదస్సులో 613 ఎంవోయూలు జరిగాయి. ఏడాదిలో ఇన్ని సంస్థలు పెట్టుబడులకు వచ్చాయంటే గేమ్ ఛేంజర్‌గా మారింది. ఇవన్నీ పూర్తయితే 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. నాలెడ్జ్ ఎకానమీకి విశాఖ చిరునామాగా తయారవుతుంది. అమెరికాకు సిలికాన్ వ్యాలీ ఉంది, భారత్‌కు క్వాంటం వ్యాలీ ప్రారంభమైంది. క్వాంటం వ్యాలీకి చిరునామాగా ఆంధ్రప్రదేశ్ కాబోతోంది. ప్రశాంతమైన, అందమైన ప్రాంతం విశాఖ. నాలెడ్జ్ ఎకానమీ, టెక్నాలజీకి కేంద్రంగా విశాఖ మారబోతోంది. త్వరలోనే విశాఖలో మెట్రో వస్తుంది. టెక్ తమ్మిన, నాన్‌రెల్ టెక్నాలజీస్, ఏసీఎన్ ఇన్ఫోటెక్‌కు భూమిపూజ చేసుకున్నాం. ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్, ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్‌కు శంకుస్థాపన చేసుకున్నాం. మదర్సన్ టెక్నాలజీ, క్వార్బ్జ టెక్నోసాఫ్ట్ సంస్థలకు భూమిపూజ చేసుకున్నామన్నారు.

# మాట నిలుపుకున్న డిసిఎం పవన్

## ఉపముఖ్యమంత్రికి దీపిక కృతజ్ఞతలు



డిసిఎం పవన్, అంధుల క్రికెటర్ దీపిక

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** అడిగిన వెంటనే తమ ఊరికి రహదారి మంజూరు చేసిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు భారత మహిళా అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక కృతజ్ఞతలు తెలిపారు. అంధుల క్రికెట్ జట్టు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ని కలిశారు. ప్రపంచ కప్ విజేతగా నిలిచిన భారతమహిళల అంధుల క్రికెట్ జట్టును డిసెంబర్ 12వ తేదీ ఉదయం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభినందిం చారు. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలంలోని మారుమూల గ్రామం తంబాళ హట్టికిచెందిన జట్టు కెప్టెన్ దీపిక తన గ్రామం రోడ్ల పరిస్థితి వివరించి, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పవన్ కళ్యాణ్‌కు తెలిపారు. గ్రామానికి రోడ్డు వేయాలని వినతి చేశారు. అయితే, తాను వెంటనే చర్యలు తీసుకుంటానని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దీపిక తమ గ్రామానికి రోడ్డు లేదని మట్టిరోడ్డే దిక్కని, రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. సరైన రోడ్డు లేని కారణంగా సత్యసాయి జిల్లాలోని తమ తాండా వాసులు పడుతున్న ఇబ్బందుల్ని దీపిక పవన్ దృష్టికి తెచ్చారు. స్పందించిన పవన్‌కల్యాణ్ రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఉపముఖ్యమంత్రి ఆదేశాలతో సత్యసాయి జిల్లా అధికారులు దీపిక స్వగ్రామమైన మడకశిర నియోజకవర్గంలోని అమరాపురం మండలం హేమవతి పంచాయతీ పరిధిలోని తంబాల హట్టి తండా రోడ్డును పరిశీలించారు. హేమావతి నుంచి తంబలహెట్టి వరకూ రోడ్డు నిర్మాణానికి రూ.3.2 కోట్లు, గున్నేహళ్లి నుంచి తంబలహెట్టీ వరకూ 5కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.3కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. తర్వాత కలెక్టర్ శుక్రవారం సాయంత్రానికల్లాపరిపాలనాపరమైన ఆదేశాలు జారీ చేశారు. పవన్‌కల్యాణ్ సత్వర స్పందనపై దీపిక సంతోషం వ్యక్తం అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక ఓ వీడియో విడుదల చేశారు.

# 70 అడుగుల మెస్సీ విగ్రహం ఆవిష్కరణ

**కోల్‌కత్తా, డిసెంబరు 13:** ప్రపంచ దిగ్గజ ఆటగాడు లియోనెల్ మెస్సీ 70 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని కోల్‌కత్తా సాల్ట్‌లేక్ స్టేడియంవద్ద ఆవిష్కరించారు. భారీ భద్రత కారణంగా విగ్రహాన్ని మెస్సీ వర్చువల్‌గా ప్రారంభించారు. అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ ప్లేయర్ భారత్ చేరుకున్నారు. శనివారం తెల్లవారుజామున పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ల్యాండ్ అయ్యారు. గోట్ ఇండియా టూరులో భాగంగా మెస్సి భారత్‌కు వచ్చాడు. కోల్‌కతా ఎయిర్‌పోర్టులో స్టార్ ప్లేయర్‌కి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా సాల్ట్ లేక్ స్టేడియంలో ఏర్పాటు చేసిన70 అడుగుల ఎత్తైన తన విగ్రహాన్ని మెస్సీ ప్రారంభించారు. బాలీవుడ్ స్టార్ షారుఖ్ ఖాన్, పశ్చిమబెంగాల్ మంత్రి సుజిత్ బోస్‌తో కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షారుఖ్ తనయుడు అబ్రామ్ కూడా పాల్గొన్నాడు. ఈ



పర్యటనలో భాగంగా దాదాపు 72 గంటల పాటు మెస్సి ఇండియాలోనే గడపనున్నారు. కోల్‌కతాతో పాటు హైదరాబాద్, ముంబై, ఢిల్లీల్లోనూ మెస్సి టూర్ చేయనున్నాడు. సోమవారం రోజు ప్రధాని నరేంద్ర మోదీని అర్జెంటీనా ప్లేయర్ మెస్సి కలవనున్నారు.

# చింతూరు- మారేడుమిల్లి ఘాట్ రోడ్డుపై ప్రభుత్వం ఆంక్షలు

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** చింతూరు టూ మారేడుమిల్లి ఘాట్ రోడ్డు ప్రయాణంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. రాత్రి వేళ ఘాట్ రోడ్డుపై ప్రయాణం చేయకుండా ఆంక్షల ఉత్తర్వులు జారీ చేశారు చింతూరు ఐటీడీఏపీవో శుభం నోక్‌వాల్. భద్రాచలం నుంచి రాత్రి వేళ ఆంధ్రప్రదేశ్ వెళ్లే వాహనదారులకు ఆంక్షలపై ప్రభుత్వం ఈ విజ్ఞప్తి చేసింది. ప్రజా భద్రత కోసం ఆంక్షలు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయని ఏపీ ప్రభుత్వం తెలిపింది. అల్లూరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం నేపథ్యలో ప్రభుత్వం ఈ ఆంక్షలు విధించింది. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఈ ప్రయాణంపై ఆంక్షలు ఉండనున్నాయి. వాహనదారులు ఈ విషయాన్ని గమనించాలని ఏపీ సర్కార్ సూచించింది. కాగా, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం తులసి పాకలు ఘాట్ రోడ్‌లో నిన్న(శుక్రవారం) తెల్లవారు జామున బస్సు ప్రమాదం జరిగిందిజఈ ప్రమాదంలో 10 మంది మృతిచెందగా, 20మందికి తీవ్ర గాయాలయ్యాయి.

# సిఎం చంద్రబాబుపై సిఐడి కేసు కొట్టివేత

>> సాఫ్ట్‌వేర్ కంపెనీలు, వాటి ఉన్నతాధికారులను నిందితుల జాబితాలో చేర్చారు. మొత్తం 99 మందిని సాక్షులుగా పేర్కొన్నారు. కేసులో దర్యాప్తు పూర్తయినట్లు కొద్దిరోజుల క్రితం సీఐడీ అధికారులు విజయవాడ ఏసీబీ కోర్టుకు నివేదిక ఇచ్చారు. ఖజానాకు ఎలాంటి నష్టమూ వాటిల్లలేదని కేసును ఉపసంహరించుకుంటున్నట్లు అప్పటి ఎండీ మధుసూదన్‌రెడ్డి గత నెల 24న కోర్టులో అఫిడవిట్ దాఖలుచేశారు. ఇందుకు అభ్యంతరం లేదని ప్రస్తుత ఎండీ గీతాంజలి శర్మ కూడా అఫిడవిట్ ఇచ్చారు. కోర్టు తీర్పు వెలువడుతుందనే సమయానికి ఆ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైసీపీ నేత గౌతంరెడ్డి రంగప్రవేశం చేశారు. తీర్పు ఇచ్చే ముందు తన వాదనలను వినాలని ప్రొటెస్ట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనికి విచారణార్హత లేదంటూ న్యాయాధికారి పి.భాస్కరరావు పిటిషన్‌ను గురువారం కొట్టివేశారు. ఆ క్రమంలోనే ఫైబర్ నెట్ కేసును కూడా కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు. రాజకీయ కుట్రతోనే ఫైబర్‌నెట్ కేసులో చంద్రబాబుపై దర్యాప్తు చేపట్టిన సీఐడి అభియోగాలను నిరూపించలేకపోయింది. అక్రమాలు జరిగలేదని స్పష్టం చేసింది. ఆయనపై అవినీతి ముద్ర వేసి గత ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న రాజకీయ కుట్రతోనే ఈ కేసు పెట్టారని తేలిపోయింది.



పుస్తక ప్రదర్శనకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

# జనవరి 2 నుండి విజయవాడలో పుస్తకాల పండుగ

**విజయవాడ, డిసెంబరు 13, ప్రభాతవార్త:** జనవరి 2నుండి 12వరకు విజయవాడ ఇంధిరాగాంధి స్టేడియంలో జరిగే పుస్తకాల పండుగలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని విజయవాడ బుక్‌ఫెస్టివల్‌సొసైటీ అధ్యక్షుడు టి. మనోహర్ నాయుడు కోరారు. శనివారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ 36వ పుస్తక ప్రాంగణానికి వడ్లమూడి విమలాదేవి పేరు, ప్రధాన వేదికకు డా బివి పట్టాభిరాం పేరు, విద్యార్థుల కార్యక్రమాల వేదికకు జయంత్ వాగ్లేకర్ పేరు పెడుతున్నామన్నారు. 2వ తేదీ సాయంత్రం 5 గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లను ప్రారంభోత్సవానికి ఆహ్వానిస్తున్నామని, 5వ తేదీ సిద్దార్ధ కాలేజ్ నుండి పుస్తకమహోత్సవంవరకు పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కె లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు జె ప్రసాద్, సహాయ కార్యదర్శి ఎబిఎస్ సాయిరాం, ట్రెజరర్ కె రవి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యతోపాటు విలువలూ ముఖ్యమే

## మంగళగిరి డాన్‌బోస్కో ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవంలో మంత్రి లోకేష్

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్త ప్రతినిధి:** జీవితంలో విద్య కంటే విలువలు ఎంతో ముఖ్యమని, వాటిని విద్యార్థులు ఆచరించాలని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఎర్రపాలెం గ్రామంలో ఉన్న డాన్ బాస్కో పాఠశాల స్వర్ణోత్సవాలకు ఆయన హాజరయ్యారు. పాఠశాలను స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన సైన్స్ ప్రయోగ శాలను ప్రారంభించారు. డాన్ బాస్కో పాఠశాల వ్యవస్థాపక ఛైర్మన్ చిన్నప్ప విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ, తాను ఈ స్థాయిలో ఉండటానికి ఉపాధ్యాయురాలు మంజుల, అధ్యాపకులు, మంత్రి నారాయణ, ప్రొఫెసర్ రాజిరెడ్డి కారణమన్నారు. విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నా తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను ఎప్పటికీ మరువకూడదని సూచించారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ఫాదర్లను సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలల్లో విద్యార్థులకు నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులోభాగంగా ఒకటి నుంచి



పదో తరగతి చదివే విద్యార్థులకు 202627 విద్యా సంవత్సరంలో కిట్లను పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. రూ. 830.04 కోట్ల నిధుల విడుదలకు ప్రభుత్వం అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సర్వేపల్లి రాధా కృష్ణన్ విద్యార్థి మిత్ర పేరిట రాష్ట్ర ప్రభుత్వం కిట్లను పంపిణీ చేస్తోంది. నోట్ బుక్‌లు, బెల్ట్, షూలు, బ్యాగ్, డిక్షనరీలు, పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్‌లు, 3 జతల యూనిఫాం క్లాత్‌లను ఇవ్వనుంది. కిట్ల సేకరణ, పంపిణీ కోసం రూ. 157.20 కోట్లు నిధులను కేంద్ర ప్రభుత్వం ఇవ్వనుంది. టెండర్ల ప్రక్రియ ద్వారా కిట్ల సరఫరా, పంపిణీదారులను నిర్ణయించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రకాశం జిల్లా కొండపి మండలం జార్లపాలెం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బయాలజీ స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్న మంచికంటి వెంకటేష్‌ను మంత్రి లోకేశ్ అభినందించారు.

ఆ మాస్టారు పిల్లల వికాసానికి బడినే కేంద్రంగా చేసుకొని అమలు చేస్తున్న బోధనా పద్ధతి స్ఫూర్తిదాయకమన్నారు. పాఠశాల విరామ సమయంలో విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, తెలుగులో కథలు, కవితలు, వ్యాసాలు రాయించేలా తీర్చిదిద్దడం ప్రశంసనీయమని తెలిపారు. సెలవు రోజుల్లో విద్యార్థులను సమీప ప్రాంతాలలో విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్తూ ప్రకృతి, పర్యావరణం, చరిత్రపై అవగాహన కల్పించడం విద్యా వికాసానికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. విద్యాలయాల్లో గ్రంథాలయాల ఆవశ్యకత వివరిస్తూ సెలవు రోజుల్లో మంచికంటి మాస్టారు చేపట్టిన ప్రచారం చాలా మంచి కార్యక్రమమని మంత్రి అభినందించారు.

## వారం - వర్జ్యం

14-12-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం
దశమి సా.6.52
హస్త ఉ.8.18, జ్యేష్ఠ కార్తె
వర్జ్యం : సా.5.15-రా.7.09
దు.సా.4.04-4.49
శుభసమయం : ఉ.6.30-7.15
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** సంతానము మీ అభిప్రాయమ లలో ఏకీభవించడం మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**వృషభం:**టెండర్స్ అతి కష్టము మీద మీకు అనుకూలముగా వస్తాయి. వివాదాస్పద వ్యవహారములు పరిష్కారమౌతాయి.

**మిథునం:**పెట్టుబడి పెట్టిన వారికి ఏకకాలంలో భాగములను ఇవ్వవలసి వస్తుంది. ప్రయాణాలు లభిస్తాయి.

**కర్కాటకం :**వ్యాపారములో అధునాతన సాంప్రదాయములను, సంస్కరణలను ప్రవేశపెడతారు. మిత్రుల కలయిక.

**సింహం:** అనేక నూతన కార్యక్రమములకు శ్రీకారం చుడతారు. ఆర్థికాభివృద్ధిని సాధిస్తారు.వస్తువులను కొనుగోలుచేస్తారు.

**కన్య :**సకుటుంబ సమేతముగా విహార యాత్రలు చేస్తారు. సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.మిత్రుల కలయిక.

**తుల :** ఆరోగ్యమును గురించి వైద్యుని సంప్రదించవలసి వస్తుంది. బదిలీకి చేసే ప్రయత్నములు ఫలిస్తాయి. వస్త్రలాభం.

**వృశ్చికం:** మీరు చేయని పొరపాటుకు మిమ్ములను దోషులుగా నిర్ణయించే విషయములో తగు జాగ్రత్తలను పాటించండి.

**ధనుస్సు:** ఆధాత్మిక కార్యక్రమములకు, శుభకార్యములకు, ధనమును బాగా ఖర్చుచేస్తారు. వస్తు కొనుగోలు.

**మకరం:**నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. నూతన భాషలను అభ్యసించే ప్రయత్నాలు చేస్తారు. బంధువుల కలయిక.

**కుంభం:** వృత్తియందు బాధ్యతలు పెరగుటంలో సమయమునకు విశ్రాంతిని తీసు కోలేరు. చర్చాగోష్ఠులలో చురుకుగా పాల్గొంటారు.

**మీనం :** వ్యాపారములో చేసిన మార్పులు, ప్రచారము సత్ఫలితములనిస్తాయి. వాహన యోగం. స్వల్ప ధనలాభం పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్







శనివారం ఉప్పల్ స్టేడియంలో ఫుట్‌బాల్ ఆడుతున్న తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, మెస్సీతో రాహుల్ తదితరులు

# హైదరాబాద్‌లో మెస్సీ హోరు

## మెస్సీ జట్టుపై తెలంగాణ సిఎం రేవంత్ జట్టు విజయం

## మ్యాచ్‌ను తిలకించిన రాహుల్ గాంధీ

## అసంఖ్యాకంగా హాజరైన అభిమానులతో ఉర్రూతలూగిన ఉప్పల్ స్టేడియం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,డిసెంబర్13:** కోట్లాది అభిమానులను సొంతం చేసుకున్న ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సికి హైదరాబాద్‌లో ఘనస్వాగతం లభించింది. హైదరాబాద్ రావడంతో అభిమానులు ఉర్రూతలూగారు. అర్జెంటీనా దిగ్గజాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు ఉప్పల్ స్టేడియానికి అభిమానులు భారీగా తరలివచ్చారు. మెస్సి మెస్సి అనే నివాదాలతో ఉప్పల్ మైదానం మారుమోగింది. సాయంత్రం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న మెస్సి బృందానికి ఘనస్వాగతం లభించింది. క్రీడాభిమానులు పలువురు కాంగ్రెస్ నేతలు అయనకు అడుగడున స్వాగతం పలికారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాభిమానులు బ్యానర్లు పట్టుకొని ఫుట్ బాల్ దిగ్గజానికి స్వాగతం పలికారు.శంషాబాద్ విమానాశ్రయం నుంచి నేరుగా మెస్సి బృందం ఫలక్‌నుమా ప్యాలెస్‌కు వెళ్లింది. అక్కడ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెస్సికి స్వాగతం పలికారు. అనంతరం ఫలక్‌నుమా ప్యాలెస్‌లో 100 మందితో ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో మెస్సి పాల్గొన్నారు. ఇందుకు ఒక్కొక్కరు పది లక్షల వెచ్చించి మెస్సి అభిమానులు టికెట్లు బుక్ చేసుకున్నారు. అనంతరం ఫలక్‌నుమా ప్యాలెస్ నుంచి మెస్సి ఉప్పల్ స్టేడియానికి చేరుకున్నారు. తొలుత 30 మంది చిన్నారులకు మెస్సి ఫుట్‌బాల్‌ట్రైనింగ్ ఇచ్చారు. అనంతరం అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి గోట్ టూర్ ఆఫ్ ఇండియా కొనసాగింది. గోట్ కప్ పేరుతో ఉప్పల్ స్టేడియంలో ఎగ్జిబిషన్ ఫుట్‌బాల్ మ్యాచ్ జరిగింది. ఈ సందర్భంగా మెస్సి, సీఎం రేవంత్ రెడ్డి జట్ల మధ్య ఫ్రెండ్లీ మ్యాచ్ జరిగింది. సింగరేణి ఆర్ఆర్ టీమ్ తరపున మైదానంలో దిగిన రేవంత్ రెడ్డి గోల్ కొట్టారు. మెస్సి రెండో గోల్స్ రాబట్టారు. మెస్సీ జట్టుపై 3-0 గోల్స్‌తో సింగరేణి ఆర్ఆర్ జట్టు విజయం సాధించింది. సింగరేణి ఆర్ఆర్ జట్టు తరఫున సీఎం రేవంత్‌రెడ్డి ఆడారు. విన్నర్, రన్నరప్ జట్ల సభ్యులకు మెస్సి, రేవంత్‌రెడ్డి ట్రోఫీలు అందించారు. అనంతరం మెస్సి మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి వచ్చి తెలుగు ప్రజలను కలవడం సంతోషంగా ఉంది, తెలుగు ప్రజలు చూపించిన అభిమానం నాకు ఎంతో శక్తిని ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు అని పేర్కొన్నారు.ఫ్రెండ్లీ మ్యాచ్ ప్రారంభానికి ముందు ఇరు జట్లతో కలిసి మెస్సి, రేవంత్ ఫోటోలు దిగారు. గ్యాలరీలో ఉన్న అభిమానులకు మెస్సి ఫుట్‌బాల్ కిక్ చేసి గిఫ్ట్‌గా ఇచ్చారు. రాహుల్ గాంధీతో పాటు ప్రియాంకగాంధీ కుమారుడు, కుమార్తె ఫుట్‌బాల్ మ్యాచ్‌ను వీక్షించారు. మ్యాచ్ టైమ్‌లో చివరి 5 నిమిషాలు రేవంత్‌రెడ్డి మెస్సితో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. మ్యాచ్ పూర్తయిన తర్వాత మెస్సి ఆల్ టైమ్ గ్రేటెస్ట్ అయిన పెనాల్టీ షూట్ అవుట్ చేశారు. మెస్సి ఉప్పల్ స్టేడియానికి రాకముందు అక్కడ ఏర్పాటు చేసిన లేజర్ షో అలరించింది. రాహుల్ సిప్లిగంజ్ మ్యూజికల్ ఈవెంట్, సింగర్ మంగ్లి బృందం పాటలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి.

**సిఎం రేవంత్ మనుమడితో మెస్సీ ఫుట్‌బాల్:** ఉప్పల్ స్టేడియంలో ఫుట్‌బాల్ స్టార్ మెస్సీ మేనియా కొనసాగింది. ఆయన మైదానం అంతా తిరిగి పిల్లతో ఫుట్‌బాల్ ఆడారు. రేవంత్ తన మనవడిని పరిచయం చేసి ఫుట్‌బాల్ ఆడించారు.అనంతరం ముగ్గురూ కలిసి ఫోటో దిగారు. ఉప్పల్ స్టేడియం అంతా మెస్సీ... మెస్సీ నినాదాలతో మారుమోగింది. మెస్సీ... మెస్సీ అంటూ సిఎం రేవంత్ నినాదాలు ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్ ముగిసిన అనంతరం ప్రభుత్వం తరఫున మెస్సీకి సిఎం రేవంత్‌రెడ్డి మెమొంటోను అందజేశారు. తర్వాత మైక్ అందుకున్న సిఎం రేవంత్‌రెడ్డి మెస్సీకి తెలంగాణ స్వాగతం తెలుపుతోంది. ఇప్పుడు తెలంగాణ వృద్ధి చెందుతోంది రండి, ఇందులో భాగస్వాములు కండి అని సిఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం సిఎం స్వయంగా మెస్సీ,మెస్సీ అంటూ నినాదాలు చేసి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. దీంతో మెస్సీ చిరునవ్వులు చిందించారు.

**మెస్సీ కిక్... స్టేడియంపై పడ్డ బాల్:** మెస్సీ అంటే మామూలుగా ఉండదు మరి. ఉప్పల్ స్టేడియంలో సరాదాగా ఫుట్‌బాల్ ఆడి సందడి చేశారు. ఈ సందర్భంగా అభిమానుల్లోకి బంతులను పంపించారు.మెస్సీ కిక్‌కు ఓ బంతి ఏకంగా స్టేడియం రూఫ్‌పై పడి మళ్లీ అభిమానుల్లోకి చేరింది. దీంతో ఫ్యాన్స్ కేరింతలతో స్టేడియం దద్దరిల్లింది.

**మెస్సీ ఈవెంట్ గ్రాండ్ సక్సెస్**

హైదరాబాద్‌లో మెస్సీ ఈవెంట్ గ్రాండ్ సక్సెస్ అయింది. మధ్యాహ్నం కోల్‌కత్తాలో అభిమానులు స్టేడియంలో రచ్చ చేయడంతో హైదరాబాద్ పోలీసులు అలర్ట్ అయ్యారు. అధికారిక కార్యక్రమం కాకపోయినప్పటికీ ఈవెంట్ తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం కూడా పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. మెస్సీ హైదరాబాద్‌లో ల్యాండ్ అయినప్పటి నుంచి ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్ ముగిసేవరకు ఎలాంటి ఘటనలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంది. మెస్సీని తనివితీరా చూసిన అభిమానులు హ్యాపీగా ఫీలయ్యారు. ఉప్పల్ స్టేడియంలో ఫుట్‌బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ ముగిసిన అనంతరం మెస్సీ తన నంబర్ 10 జెర్సీలపై సంతకంచేసి రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డికి అందించారు.

# రాష్ట్రంలో దేవాలయాలకు పూర్వ వైభవం

## 1058 ఆలయాల పునర్నిర్మాణానికి రూ.846 కోట్లు మంజూరు

### - కర్నూలు జోన్ పరిపాలనా కార్యాలయ భవన సముదాయాన్ని ప్రారంభించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**కర్నూలు, డిసెంబర్ 13 ప్రభాతవార్త ప్రతినిధి :** అభివృద్ధి, సంక్షేమం, పారిశ్రామికం, ఆధ్యాత్మికం అన్నింటిలో రాష్ట్రాన్ని అగ్రగామి గా ఉంచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖామాత్యులు ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం కర్నూలు నగరంలో రూ. 4.25 కోట్ల వ్యయంతో నిర్మించిన దేవాదాయ శాఖ కర్నూలు జోన్ పరిపాలనా కార్యాలయ భవన సముదాయాన్ని ప్రారంభించిన రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి వర్యులు టి.జి భరత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖామాత్యులు మాట్లాడుతూ రాష్ట్ర దేవాదాయ శాఖ హెడ్ ఆఫీస్ విజయవాడలో గొల్లపూడిలో ఉన్నట్లు గానే, రాయలసీమకు కర్నూలులో ఈ ఆధ్యాత్మిక భవనం ఏర్పాటు చేయడం అత్యంత సంతోషదాయకం అని పేర్కొన్నారు. ఈ కార్యాలయ సముదాయంలో డిప్యూటీ కమిషనర్ కార్యాలయం తో పాటు ఇంజనీరింగ్, తదితర కార్యాలయాలు సముదాయాలు కూడా ఉన్నాయని, నూతన కార్యాలయం కర్నూలు నుండి కాణిపాకం పనిచేస్తుందన్నారు.. ఆలయాల్లో పూజా కైంకర్యాలు, ఉత్సవాలు ఆగమ శాస్త్రం ప్రకారం పూజారులు, వేద పండితుల నిర్ణయాల మేరకే జరుగుతాయన్నారు.. పురాతన ఆలయాలు, వాటి కట్టడాలను సంరక్షించే విధంగా ఈ శాఖ పని చేస్తుందని మంత్రి తెలిపారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన హామీల్లో దేవాదాయ శాఖలో 98 శాతం నెరవేర్చాం అని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు 2372 మంది అర్చకులకు కనీస వేతనం కింద ప్రతి నెల రూ.15వేలు ఇస్తున్నామన్నారు. వేద విద్య నేర్చుకున్న 599 మంది అర్హులైన వేద పండితులకు సంభావన కింద నెలకు రూ.3 వేలు ఇవ్వడం జరుగుతోందన్నారు.. ఆలయాల్లో పని చేస్తున్న నాయీ బ్రాహ్మణులకు రూ. 25 వేల చొప్పున వేతనం ఇస్తున్న ప్రభుత్వం తమది అని మంత్రి పేర్కొన్నారు. ఆలయాల ట్రస్ట్ బోర్డులో పాలకవర్గంలో బ్రాహ్మణుల్లో ఒకరిని, నాయీ బ్రాహ్మణుల్లో ఒకరిని సభ్యులుగా చేర్చేందుకు చట్టం తెచ్చామన్నారు. రాష్ట్రంలో ఉన్న పెద్ద పెద్ద ఆలయాలన్నింటిని టూరిజం సర్క్యూట్ కింద చేర్చి, టెంపుల్ టూరిజం ను రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు... డిప్యూటీ సీఎం, టూరిజం శాఖామంత్రి, దేవాదాయ శాఖ మంత్రుల ఆధ్వర్యంలో టెంపుల్ టూరిజం ను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.. దేవాదాయ ఆస్తులను, ఆలయ భూములను పరిరక్షించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటుచేసి ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు రాష్ట్రంలో 21 ఆలయాల్లో ప్రతినిత్యం అన్నప్రసాద వితరణ జరుగుతోందని, 74 ఆలయాల్లో వారానికి ఒకరోజు, రెండు రోజులు అన్నప్రసాద వితరణ చేస్తున్నామని మంత్రి తెలిపారు. 11 ఆలయాల్లో రాష్ట్ర పండుగలు నిర్వహిస్తున్నామని, ఇందులో వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాన్ని చేర్చి రాష్ట్ర పండుగలు నిర్వహిస్తున్నామన్నారు. 20 ఆలయాల్లో 3700 గోవులను సంరక్షిస్తున్నామని, మూడు వేద పాఠశాలలు, ఏడు ఆగమ పాఠశాలల్లో 400 మంది విద్యార్థులకు వేదం నేర్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ధూపదీప నైవేద్యం కింద 2021 నుండి రూ.5వేల నుండి 10 వేలకు పెంచి రూ.70 కోట్లు ఖర్చు చేస్తున్నామని, 5821 ఆలయాల్లో ప్రతినెల రూ.10 వేల చొప్పున పూజారి అకౌంట్లో ఈ మొత్తాన్ని జమ చేస్తున్నామని మంత్రి వివరించారు.

# తిరుమల మ్యూజియంలో మోగిన అలారం

### - అప్రమత్తమైన సిబ్బంది

**తిరుమల,డిసెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యం భక్తుల సందడిగా ఉండే తిరుమలలోని ఎస్వీమ్యూజియంలో శనివారం ఉదయం ఉన్నఫళంగా అలారం మోగడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. అక్కడే ఉన్న భక్తులు పరుగులుతీయగా స్థానికులు తిరుమల పోలీసులకు సమాచారం అందించారు. టిటిడి విజిలెన్స్ సిబ్బంది, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని హుటాహుటిన మ్యూజియంలోకి వెళ్ళారు. తీరా లోపల గమనించగా సాంకేతిక లోపంతో అలారం మోగినట్లు తెలుసుకున్నారు. మ్యూజియంలో అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో ఇలా అలారం మోగడం, సాంకేతిక లోపం గుర్తించడంతో మ్యూజియం సిబ్బంది, భక్తులు అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

# మాజీ ఎంపి కుసుమ కృష్ణమూర్తి మృతి

**అమలాపురం, డిసెంబర్ 13 ,ప్రభాతవార్త.** అమలాపురం మాజీ ఎంపీ కుసుమ కృష్ణమూర్తి శనివారం కన్ను మూశారు. ఢీల్లీ నుంచి స్వగ్రామం విలస గ్రామంలో భౌతిక కాయాన్ని సదర్శనం నిమిత్తం తీసుకువస్తున్నారు. మూడు సార్లు అమలాపురం పార్లమెంట్ సభ్యులుగా పని చేశారు. కుసుమ కృష్ణమూర్తి 1940 సెప్టెంబర్ 11న విలస గ్రామంలో జన్మించారు. ఆంధ్రా, నాగ్‌పూర్ యూనివర్సిటీలలో ఉన్నత చదువులు చదివారు. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరపున కీలక నేతగా వ్యవహరించారు. అమలాపురం లోక్‌సభ నియోజకవర్గం నుండి మూడుసార్లు ఎంపీగా గెలుపొందారు. 6వ లోక్‌సభ (1977 1980), 7వ లోక్‌సభ (1980 1984), 9వ లోక్‌సభ (1989 1991) సభ్యులుగా ప్రాతినిధ్యం వహించారు. షెడ్యూల్డ్ కులాలు, తెగల సంక్షేమ కమిటీ కన్వీనర్‌గా సేవలు అందించారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) జాయింట్ సెక్రటరీగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు.

# ముఖ్యమంత్రికి ప్రత్యేక ప్రతిభావంతుల కృతజ్ఞతలు

**చంద్రగిరి, డిసెంబర్ 13 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక ప్రతిభావంతులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. బాధ్యతలకు, భరోసాలకు పేరు గాంచిన ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు ప్రజా ప్రతినిధిగా, ప్రతిపక్ష నాయకుడుగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా దూర దృష్టితో తీసుకున్న అనేక నిర్ణయాలతో నేడు తెలంగాణ ప్రజలు సుఖ సంతోషాల నడుమ ఆస్వాదిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ విభజనతో ఏర్పడిన ఆర్థిక అగాథాన్ని పూడ్చడంలో 75 ఏళ్ళ వయస్సులో ఆయన చేస్తున్న అవిరళ కృషి నేటితరానికి స్ఫూర్తిదాయకంగా, భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగానూ నిలుస్తున్నది. 2014-2019 మధ్య కాలంలో సాగించిన పాలనలోని లోపాలను, 2019-2024 మధ్యన సాగిన వైసిపి పాలనలోని దోషాలను శుద్ధి చేయడంలో ఆయన చొరవ యావత్ ప్రపంచాన్ని అబ్బురపరుస్తున్నది.


HINDUJA HOUSING FINANCE

HINDUJA HOUSING FINANCE LIMITED

నమోదు కార్యాలయం 27-A, డెవలప్డ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032, తమిళనాడు, ఇ-మెయిల్: auction@hindujahousingfinance.com

అనుబంధం-IV-A (నిబంధన 8 (6)కు ఏర్పాటు చూడండి)

ఇ-వేలం-కమ్-విక్రయం కొరకు బహిరంగ ప్రకటన (అనుబంధం - IV A) (నిబంధన 8(6))

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (HHF) దాని కార్పొరేట్ కార్యాలయం 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సైదాపేట, చెన్నై - 600 015 వద్ద కలిగి మరియు శాఖా కార్యాలయం హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ సర్వే నం. 174-175, బి-బ్లాక్, షాప్ నం.8, 3వ అంతస్తు, గుప్తాస్ స్క్వేర్ 60 అడుగుల రోడ్డు, సత్యం థియేటర్ పక్కన, సత్యనారాయణపురం, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523002, ...

ఆస్తి తనిఖీ తేదీ: 05-01-2026 - 1100 గం.లు - 1400 గం.లు | బయానా దాఖలు తేదీ: 20-01-2026 గం. సా.5.00 వరకు | ఇ-వేలం తేదీ/సమయం: 22-01-2026 - 1100 గం.లు - 1300 గం.లు | బిడ్ పెంపు మొత్తం: రూ.10,000/-

| క్ర.సం. | రుణ ఖాతా నం. / రుణగ్రహీతలు | స్వాధీనతా తేదీ / డిమాండ్ నోటీస్ తేదీ మరియు మొత్తం | రిజర్వు ధర / బయానా (EMD) | 03-12-2025 తేదీ నాటికి బకాయి మొత్తం |
|---|---|---|---|---|
| 1 | AP/ONG/ONGL/A000000091 | 08-04-2025 / 28-11-2024 రూ.724621/- | రూ.1461750/- / రూ.146175/- | రూ.888552/- |
| 2 | AP/ONG/ONGL/A000000022 | 07-04-2025 / 27-11-2024 రూ.790380/- | రూ.2097400/ / రూ.209740/- | రూ.959026/- |
| 3 | AP/ONG/ONGL/A000000136 | 07-12-2024 / 27-07-2024 రూ.346067/- | రూ.1035300/ / రూ.103530/- | రూ.394490/- |
| 4 | AP/ONG/ONGL/A000000021 | 14-04-2025 / 27-11-2024 రూ.590442/- | రూ.1200220/ / రూ.120022/- | రూ.657177/- |
| 5 | AP/ONG/ONGL/A000000120 | 07-12-2025 / 27-07-2024 రూ.722387/- | రూ.1090500/ / రూ.109050/- | రూ.922968/- |
| 6 | AP/ONG/ONGL/A000000344 | 28-05-2025 / 02-01-2025 రూ.834750/- | రూ.1735300/ / రూ.173530/- | రూ.938132/- |
| 7 | AP/ONG/ONGL/A000000285 | 27-05-2025 / 02-01-2025 రూ.627286/- | రూ.1272000/ / రూ.127200/- | రూ.725172/- |
| 8 | AP/ONG/ONGL/A000000202 | 10-04-2025 / 28-11-2024 రూ.495365/- | రూ.1086000/ / రూ.108600/- | రూ.571575/- |
| 9 | AP/ONG/ONGL/A000000128 | 08-04-2025 / 10-10-2024 రూ.803779/- | రూ.1498400/ / రూ.149840/- | రూ.1004927/- |
| 10 | AP/ONG/ONGL/A000000280 | 10-04-2025 / 28-11-2024 రూ.619172/- | రూ.1151557/ / రూ.115155/- | రూ.675444/- |
| 11 | AP/ONG/ONGL/A000000045 | 14-04-2025 / 30-12-2024 రూ.519263/- | రూ.1013550/ / రూ.101355/- | రూ.510447/- |
| 12 | AP/ONG/ONGL/A000000249 | 27-05-2025 / 02-01-2025 రూ.856087/- | రూ.1684800/ / రూ.168480/- | రూ.920191/- |
| 13 | AP/ONG/ONGL/A000000189 | 08-04-2025 / 30-10-2024 రూ.558425/- | రూ.1029600/ / రూ.102960/- | రూ.705574/- |

Place: Andhra Pradesh Date: 14.12.2025. Sd/- Authorised Officer - Hinduja Housing Finance Limited


# తిరుపతి సమాచారం


## 16నుండి శ్రీవారికి తిరుప్పావై ప్రవచనాలు



**తిరుమల,డిసెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** వైఖానస ఆగమోక్తంగా పూజలందుకుంటున్న తిరుమల శ్రీవేంకటేశ్వం స్వామికి వేకువజామున నిర్వహించే సుప్రభాతసేవ ఈనెల 16వతేదీ నుండి రద్దుచేశారు. ఆ స్థానంలో ధనుర్మాసం సందర్భంగా నెలరోజులపాటు గోదాదేవి తిరుప్పావై పాశురాలను వేదపండితులు ,ఆలయ అర్చకులు పారాయణం చేసి శ్రీవారిని మేల్కొలుపుతారు. ప్రతి ఏడాది ధనుర్మాసంలో సుప్రభాతసేవ స్థానంలో తిరుప్పావై పాశురాలు పఠించడం ఆనవాయితీ. తిరుమల, తిరుపతితో పాటు దేశవ్యాప్తంగా 233 కేంద్రాలలో తిరుప్పావై పారాయణం జరుగుతుంది. ఈనెల 16 నుండి 2026 జనవరి 14వ తేదీ వరకు పండితులు తిరుప్పావై ప్రవచనాలు చేయనున్నారు. టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఇందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తిరుపతితో పాటు ఆంధ్రప్రదేశ్ 76 కేంద్రాలు, తెలంగాణ 57కేంద్రాలు, తమిళనాడు 73, కర్ణాటక 21, పాండిచ్చేరి 4, న్యూఢిల్లీ, ఒడిశాలో ఒకొక్క కేంద్రంలో తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించనున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంలోనూ ధనుర్మాసంలో సుప్రభాతం బదులు తిరుప్పావై నివేదించడం విశేషం. తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరం, కెటి రోడ్డులోని శ్రీ వరదరాజస్వామివారి ఆలయంలో తిరుప్పావై ప్రవచనాలు పారాయణం చేస్తారు. 12 మంది ఆళ్వారులలో ఒకరైన గోదాదేవి ధనుర్మాసం వ్రతం చేశారు. ఈ వ్రతం చేయడం వల్ల దేశం సమృద్ధిగా, సుభిక్షంగా ఉంటుంది. ద్వాపరయుగంలో గోపికలు ఈ వ్రతాన్ని ఆచరించి శ్రీకృష్ణుని కృపకు పాత్రులయ్యారని భాగవతం దశమ స్కందంలో పేర్కొనబడింది. ఈ తిరుప్పావై సారాంశం భగవంతునికి కైంకర్యం చేయడమే. దేశవ్యాప్తంగా గల అన్ని వైష్ణవ దేవాలయాలలో తిరుప్పావై శాత్తుమొర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

## ఆ మూడురోజులు టోకెన్లు ఉంటేనే వైకుంఠ దర్శనం!

### -జనవరి 2నుండి టిక్కెట్ లేకున్నా తిరుమలకు వస్తే సర్వదర్శనం



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి ఈనెల 30,31తేదీలతోబాటు 2026 జనవరి 1వతేదీకి ఆన్‌లైన్‌లో దర్శన టోకెన్లు 1+3 విధానంలో కలిగిన భక్తులను మాత్రమే ఆలయంలోనికి అనుమతించేలా టిటిడి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రోజుకు 70 వేల మంది భక్తులు లెక్కన మూడురోజులకు 1.75లక్షల వరకు ఇ డిప్‌లో వైకుంఠ దర్శన టోకెన్లు జారీచేసిన విషయం తెలిసిందే. ఆ మూడురోజులు ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులు స్వయంగా వస్తేనే తిరుమలలో వైకుంఠ దర్శనాలు కల్పిస్తారు. ఆ పదిరోజులు ఎటువంటి సిఫార్సు లేఖలు అనుమతించరు. ఇదిలా ఉండగా ఈ దఫా పదిరోజుల వైకుంఠద్వార దర్శనాల్లో జనవరి 2వతేదీ నుండి 8వతేదీ వరకు ఏడురోజులు మాత్రం సామాన్యభక్తులకు దర్శన టోకన్లు ,టిక్కెట్లు లేకున్నా నేరుగా తిరుమలకు చేరుకుని వైకుంఠమ్ 2 ద్వారా దర్శనాలకు రావచ్చని టిటిడి విజ్ఞప్తి చేసింది. ఏడురోజులు సామాన్యులకు సాఫీగా ప్రశాంతంగా వైకుంఠ ద్వార దర్శనాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. పదిరోజుల వైకుంఠద్వార దర్శనాల్లో 182 గంటల్లో 164గంటలు సామాన్యభక్తులకు కేటాయించారు.

## పూర్ణాహుతితో ముగిసిన షోడశదిన సుందరకాండ

**తిరుమల,డిసెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచశాంతి, లోకక్షేమం ఆకాంక్షిస్తూ కలియుగవైకుంఠం తిరుమలలోని వసంతమండపంలో జరిగిన షోడశదిన సుందరకాండ పారాయణం శనివారం మహాపూర్ణాహుతితో ముగిసింది. గతనెల28వతేదీ తిరుమలలో శ్రీవారి ఆలయానికి వెనుకవైపు వసంతమం డపంలో శాస్త్రోక్తంగా పారాయణం చేపట్టారు. ప్రతిరోజూ వేదపండితులు వైఖానస ఆగమోక్తంగా సుందరకాండ పారాయణం చేపట్టి భక్తిభావాన్ని చాటారు. ఇదే సమయంలో ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠంలో తొలిరోజు ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఆరాధన, అభిషేకం,హోమం ,అనుష్టానం నిర్వహించారు. చివరగా శనివారం మహాపూర్ణాహుతితో ముగింపుకుచేరుకుంది. వేదపాఠశాల ప్రిన్సిపాల్ శివసుబ్రమణ్యఅవధాని పర్యవేక్షణలో వేద పండితులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు.టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

## రాష్ట్రం అన్నివిధాలా మరింత అభివృద్ధిచెందాలని వేడుకున్నా : మంత్రి సవిత



**తిరుమల,డిసెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం అన్ని విధాలా మరింత అభజవృద్ధి చెందే దిశగా ఆశీస్సులందించాలని శ్రీవారిని వేడుకున్నట్లు రాష్ట్రమంత్రి సవిత తెలిపారు. పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు శుభాలు కలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. శనివారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆమె స్వామివారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తిరుమలేశుని సన్నిధిలో తలైవా భగవంతుని ఆశీస్సులందరిపై ఉండాలి



**తిరుమల,డిసెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** సినీనటుడు, సూపర్‌స్టార్ రజనీకాంత్ తలైవా కుటుంబంతో కలసి కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆనందనిలయంలోనికి చేరుకుని వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. శేషవస్త్రంతో సత్కరించారు.

## వారాంతం రద్దీతో కొండ కిటకిట

**తిరుమల,డిసెంబర్ 13 ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం వరుసగా రెండవశని,ఆదివారాలు సెలవులు కావడంతో తిరుమ ల భక్తజనసంద్రంగా మారింది. వెంకన్న దర్శనానికి భక్తులు శనివారం ఉదయం నుండే భారీగా చేరారు.

దేశంలో కాదేదీ కల్తీ(నకిలీ)కి అనర్హం అనే వందంగా ఎంతో పవిత్రంగా విశ్వాసంతో భావించే వేదపండితుల వేదాశీర్వచనం సత్కారా శాలువాల్లోనూ నకిలీ పట్టును వాడి పాలిస్టర్‌తో తయారైన శాలువాలతో కుంభకోణం జరిగిందనే దుమారం టిటిడిలో మరింతగా కలవరేపేస్తోంది. శ్రీవారి దర్శనానంతరం వివిధ పిలు, విఐపిలతోపాటు దాతలకు,ఆర్జితసేవల భక్తులను ఆలయ మర్యాదలతో సత్కరించే సంప్రదాయం కొనసాగుతోంది. ఇలా రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనంపొందే భక్తులకు అందజేసేపట్టుశాలువాలు(శేషవస్త్రం) టెండర్లలో నకిలీలు చోటుచేసుకుని భారీ కుంభకోణం జరిగిందనే టిటిడి ధర్మకర్తలమండలి తాజాగా బయటపెట్టిన గుట్టు. వేదాశీర్వచనం కోసం అవసరమైన పట్టుశాలువాలు సరఫరా చేయాల్సిన బిడ్డరుదారులు ఆ స్థానంలో పాలిస్టర్‌శాలువాలను సరఫరాచేశారని,పైగా ధర కూడా విపరీతంగా కోట్‌చేసి ముడింతలు అధికంగా టిటిడి సొమ్మును వెచ్చింపచేసున్నారనేది స్వయంగా ఛైర్మన్ ఏసిబితోవిచారణ చేయించాలని చెప్పడం ఇందుకుబలాన్ని చేకూరుస్తోంది. స్వచ్ఛమైనపట్టు శాలువాలు 'ఓంనమోవేంకటేశ శాయ నామంతో శంఖుచక్రం తిరునామం' ముద్రించిన వాటిని అందజేస్తుంది. అయితే గత ఆరేడుసంవత్సరాలుగా సరఫరా అయిన పట్టుశాలువాలు నకిలీవని, టిటిడి విజిలెన్స్ గుర్తించిన స్కామ్. రూ.400 విలువ చేసే టెండర్ దారుడు మూడురెట్లు అధికంగా ధర కోట్‌చేసి టిటిడికి సరఫరాచేసి మోసానికి పాల్పడినట్లు టిటిడి అధికారులు గుర్తించారు. ఈశాలువాలను బెంగుళూరు, ధర్మవరంలోని సిల్క్‌బోర్డు పరిశోధనశాలలకు పంపించి తనిఖీ చేయించగా పాలిస్టర్‌వేనని నివేదికలు అందడంతో శేషవస్త్రాల అవినీతిపై ఏసిబితో విచారణకు టిటిడి ధర్మకర్తలమండలి సిద్ధమైంది.దేవుని చెంత భక్తిభావంతో, సేవా నిరతితో సేవచేయాల్సిన ప్రతి అంశంలోనూ అవినీతి నీడలుకమ్ముకోవడం మాత్రం శ్రీవారి భక్తులను విస్మయానికి గురిచేస్తోంది.

# ధార్మిక సంస్థలో విస్తరిస్తున్న అవినీతి జాడలు!

**పావులూరు పద్మనాభమ్**

ఆధ్యాత్మికత..పవిత్రత ఉట్టిపడే తిరుమల తిరుపతి దేవస్థానంలో అడుగడుగునా భక్తిభావంతో,నిజాయితీతో మెలగాల్సిన అధికారులు, ఉద్యోగుల తీరు అవినీతిమయంలో చిక్కుకుపోవడం ఇప్పుడు ప్రపంచంలోని కోట్లాది మంది భక్తులను విస్మయపరుస్తోంది. నిత్యం లక్షలాదివరకు వస్తున్న భక్తుల విశ్వాసంతో టిటిడి ఆదాయం పరిగణిస్తారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో వరుసగా అవినీతి మబ్బులు కమ్మేస్తున్నాయి. కోట్లాదిమంది భక్తులు ఎంతో విశ్వాసంతో నమ్ముకొలుస్తున్న కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి పవిత్రతకు భంగం కలిగించేలా ఈ దుమారం ఐదేళ్ల కాలంలో వరుసగా పలు విషయాల్లో వెలుగుచూస్తున్న అవినీతి ఆక్రమాలు భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా తయారవుతున్నాయి. 'ఏడుకొండలవాడా గోవిందా..ఆపదమొక్కులవాడా గోవింద' నామస్మరణతో భక్తితో మొక్కుబడుల రూపంలో హుండీ సమర్పించుకునే కానుకల నుండి తమ కష్టాలు తీరితే ముడుపు చెల్లించుకుంటామని వేసే తులాభారం చివరకు అభిలాంద కోట్లుభక్తులపొందాయకుని దివ్యమంగళ రూపం దర్శనంతో పులకించే పోయే భక్తలోకం ఎంతో ప్రీతిపాత్రంగా స్వీకరించే లడ్డూప్రసాదాలు కూడా అవినీతితో కల్తీమయమై కలకలం రేపడం వరకు తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. చివరకు ఆనందనిలయంలోని కలియుగ వైకుంఠవాసున్ని క్షణకాలం దర్శనం చేసుకుని వేదపండితుల వేదాశీర్వచనం అందుకోవడంలో ప్రముఖులు, దాతలు, ఆర్జిత సేవల భక్తులు స్వీకరించే శేషవస్త్రం (పట్టుతోనేసిన దుప్పట) 'శంఖుచక్రనామంతో ఓమ్‌నమోవేంకటేశాయ'అని అచ్చొసిన వస్త్రం కూడా నకిలీది సరఫరా కావడం భక్తుల మనోభావాల్ని దెబ్బతీసేలా అవినీతిమయంగా మారింది. ఇలా వరుసగా వెలుగుచూస్తున్న అవినీతి నీడలతో తిరుమలతిరుపతిదేవస్థానం పవిత్రత మసకబారేలా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు. తిరుమల లడ్డూలకు 310 ఏళ్ల సుదీర్ఘచరిత్ర ఉంది. గోవిందుని ప్రసాదాల్లో లడ్డూకు ఉన్న ప్రాధాన్యత ఎంతో విశిష్టత కలిగింది. దేశవిదేశాల నుండి ప్రతిరోజూ తిరుమల కొండకు వచ్చే భక్తులు స్వామివారి దివ్యమంగళరూపం దర్శనం ముగించుకున్న తరువాత తమ జన్మధన్యమైందనిభావించి ప్రసాదంగా లడ్డూలను తమవెంట పవిత్రంగా తీసుకెళతారు. అంతటి పవిత్రంగా భక్తకోటి భావించే లడ్డూప్రసాదాల తయారీకి కల్తీనెయ్యి సరఫరా జరిగిందనే ఉదంతంతో టిటిడిలో దుమారం మొదలైంది. కొన్ని దశాబ్దాలకాలం నుండి 2019వ సంవత్సరంవరకు తిరుమలలోని పోటులో లడ్డూల తయారీ



సమయంలో కొండంత నెయ్యిసువాసనలు గుబాళించేవి. 2019వ సంవత్సరం నుండి 2024వరకు అలయ బూంది పోటులో రోజుకు సరాసరి మూడులక్షల నుండి 3.50లక్షల వరకు లడ్డూలు తయారయ్యేవి. ఇందుకుగాను రోజుకు 150 కిలోల వరకు ఆవునెయ్యి వినియోగించేవారు.2019- 2024 మధ్య కాలంలో పలు డెయిరీలకు టిటిడి ధర్మకర్తల మండలి, టిటిడి అధికారులు నెయ్యిసరఫరాను అప్పగించారు.స్వచ్ఛమైన ఆవునెయ్యి సరఫరా చేయాల్సిన డెయిరీలు పలు రకాలుగా కల్తీచేయడంతోనే లడ్డూల నాణ్యత,రుచి లేదనేది వెలుగుచూసిన మొదటి అవినీతి. కల్తీనెయ్యి దుమారంపై 2024 జులైలో రాష్ట్రప్రభుత్వం ఈ ఉదంతంపై విచారణకు ఆదేశించింది. అప్పట్లో గత ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం హయాంలోని టిటిడి ధర్మకర్తలమండలి పెద్దలు, టిటిడి ఉన్నతాధికారి,కొనుగోలు కమిటీ ఏమేరకు నిబంధనలు పాటించి నెయ్యిసరఫరాకు టెండర్లు పిలిచారు, టెండర్లలో పాల్గొన్న ఐదుసంస్థలు, కాంట్రాక్టర్ల వివరాలపై నియామక మైన సిట్ అధికారులు సమాచారం రాబట్టారు. కీలక వివరాలతో పలు డెయిరీల నిర్వాహకులను, చివరకు నెయ్యి ట్యాంకర్ డ్రైవర్లను కూడా సిట్ లోతుగా విచారణ చేసింది. ఆవునెయ్యి సరఫరా చేయడానికి టెండర్లు అర్హత సాధించిన డెయిరీ స్థానంలో మరికొన్ని డెయిరీలు కలవడం, నిర్దేశిత కాంట్రాక్టర్ల స్థానంలో ఇతరులు సరఫరా చేశారనేది సిట్ కీలకంగా సేకరించిన సమాచారం.2024జులై నెలలోనే మూడుసార్లు కల్తీనెయ్యి సరఫరా జరిగిందని గుర్తించిన టిటిడి ఆ ట్యాంకర్లను తిరుమలలో నెయ్యి తీసుకోకుండా వెనక్కుపంపింది. ఆ ట్యాంకర్లలో నెయ్యి కల్తీ జరిగిందనేది ముందుగానే తేల్చేసిన టిటిడి అధికారులు తిప్పిపంపడం సంచలనంగా మారింది.అయితే కల్తీనెయ్యి అవినీతిపై 2024 సెప్టెంబర్ 20న తిరుపతిలో తూర్పు పోలీసులకు టిటిడి ఫిర్యాదుతో మరింతగా బలాన్ని చేకూర్చింది. లడ్డూల తయారీలో కల్తీనెయ్యి వాడారనే అంశంపై గుజరాత్‌లోని ఎన్‌డిడిబి ల్యాబ్ పరీక్షల నివేదికల ఆధారంగా జంతువుల కొవ్వునూనె కల్తీజరిగిందని నిర్ధారణకు వచ్చారు. నెయ్యి నాణ్యత లేదని దీనివల్లే లడ్డూలు రుచిగా లేవనే సమాచారం పోటు కార్మికుల వాదనలతో ఏకీభవించాల్సి వచ్చింది.గతఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలో లడ్డూల నాణ్యత లేదనే విషయంపై పెద్ద సంఖ్యలో భక్తుల నుండి ఫిర్యాదులు,విమర్శలు వచ్చాయి. ఏడుకొండల వెంకటేశ్వరస్వామికి భక్తుల హుండికి కానుకలుగా చెల్లించుకునే కానుకల పరకామణిలో లెక్కిస్తారు. రోజువారీగా సరాసరి 3.50కోట్లరూపాయలు నుండి 4కోట్లరూపాయలు ఆదాయం లభిస్తుంది. ఈ లెక్కింపుల్లో గుమస్తాగా ఉన్న సివి రవికుమార్ అనే వ్యక్తి 2023 ఏప్రిల్29న, 920 అమెరికన్ డాలర్లు రూ. 70లక్షలువిలువైనవి చోరీ చేయడం ఇప్పటికీ సంచలనం రేపుతోంది. ఈ వ్యవహారం కాక పుట్టించింది. 1980వ సంవత్సరం నుండి తిరుమల పెద్దజీయర్ మఠంలో సివి రవికుమార్ గుమస్తాగా పనిచేస్తూ పరకామణి విధులు చూస్తున్నారు. ఆయన 2023 ఏప్రిల్‌లో డాలర్లు చోరీ చేయడం ,విజిలెన్స్ ఏవిఎస్ఒ పట్టుకోవడం తదనంతరం తిరుమల వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కేసులో చట్టపరంగా వ్యవహరించాల్సిన పోలీసులు ,టిటిడి అధికారులు ఏకంగా ఆతనిని కేసులో నుండి తప్పించేలా న్యాయస్థానంలో ఒప్పించి కేసు ఉపసంహరణ, ఆపై లోక్ అదాలత్‌లో మధ్యవర్తిత్వం ద్వారా రాజీచేసుకోవడం దుమారాన్ని రేపింది. అయితే ఈ కేసు లోక్‌అదాలత్ ద్వారా రాజీ చెల్లదనేది హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులో అతని నుండి శ్రీవారికానుకల క్రింద 2023లో గత టిటిడి బోర్డు 14కోట్ల రూపాయలు విలువైన గిఫ్ట్ డీడ్‌గా ఆస్తులు స్వీకరించడం సంచలనమే.వీటి విలువ మార్కెట్లో 40కోట్ల రూపాయల మేర ఉంటుందనేది సిఐడి వెల్లడించిన విషయం. ఆదాయపుపన్ను శాఖ (ఐటి), ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ (ఇడి)కూడా కేసు వివరాల సమాచారాన్ని ఇవ్వాలని సూచించింది. వడ్డీకాసుల వెంకటేశ్వర స్వామికి భక్తుల ప్రియంగా చెల్లించే తులాభారం మొక్కుల కానుకలు కూడా పక్కదారి పట్టాయంటూ తిరుమల తిరుపతి దేవస్థానంలో సంచలనంగా మారింది. చిన్నపిల్లల నుండి వయోవృద్ధుల వరకు తమ కోరికలు నెరవేరిన వెంటనే తులాభారం త్రాసులో ఒకవైపు భక్తుడు,మరో వైపు నాణేలు, చక్కెర, బెల్లం,కలకండ, డ్రైఫ్రూట్స్ ,బియ్యం ఇలా ఏదైనా వారి బరువుకు తగ్గట్లు తూకంలో తీర్చుకుంటారు. అంతే బరువుకు సరిపడే నగదును టిటిడికి అందిస్తారు.అక్కడ రెండు, ఐదురూపాయల నాణేలు ఉంచి బరువు తూకం వేస్తారు. భక్తుడు ఎంత బరువుంటే అంత సొమ్ము నగదు రూపంలో అక్కడ సిబ్బందికి అప్పగించి మొక్కులు తీర్చుకోవడం జరుగుతుంది.రోజుకు సరాసరి శ్రీవారిని 70వేల మంది వరకు భక్తులు దర్శనం చేసుకుంటుండగా 30వేలమంది భక్తులు తలనీలాలు సమర్పిస్తుంటారు.ఆలయం లోపల మహాద్వారం దాటగానే ధ్వజస్తంభానికి కుడి పక్కన తులాభారం ఉంది. తులాభారంద్వారా రోజువారీగా ఐదులక్షల రూపాయల నుండి10లక్షల రూపాయల వరకు భక్తుల కానుకలతో ఆదాయం సమకూరుతుందనేది టిటిడి వర్గాల సమాచారం. తులాభారం త్రాసులోనూ మ్యాజిక్ చేశారనే విమర్శలకు తోడు రోజుకు వందమంది వరకు తులాభారం వేసిన భక్తుల సంఖ్య కూడా తగ్గించి లెక్కలు చూపి నిధులు స్వాహా చేశారనేది ప్రధాన ఆరోపణ. ఇక్కడ జమ అయిన మొత్తాన్ని ఏరోజుకారోజు దేవుని ఆదాయం లెక్కల్లో చూపాలి. ●

తమిళనాడు

# గెలుపు దారి లోకి!

**ఎ.వి.వి ప్రసాద్**

చలి కాలంలోనూ తమిళ రాజకీయాలు వేడెక్కి చుర్రుమంటున్నాయి. టివికె పార్టీని నడిపిస్తున్న ప్రముఖ నటుడు విజయ్ గతవారం తన రాజకీయ కార్యాచరణను ముమ్మరం చేయడంతో ఇతర పార్టీలు కూడా 'చురుకు'గా కదలడం మొదలు పెట్టాయి. ముఖ్యంగా కాంగ్రెస్,అన్నాడిఎంకె పార్టీలకు విజయ్ టివికె పార్టీ ప్రస్తుతం ఒక ఆశారేఖలా కనిపిస్తోంది. ఆ రెండు పార్టీలతో పాటు బిజెపి కూడా ఈసారి సీట్లు, ఓట్ల శాతం పెంచుకునే దిశలో పావులు కదుపుతోంది. ఈ పార్టీలన్నీ డిఎంకెకు వ్యతిరేకంగా విజయ్ టివికెతో చేతులు కలిపే ప్రయత్నాలు ఆరంభించాయి. అన్నాడిఎంకె నుంచి బయటకు వచ్చిన సీనియర్ నేత కెఎ సెంగొట్టియన్ పది రోజుల క్రితం టివికెలో చేరడంతో మరి కొందరు సీనియర్ నేతల చూపు కూడా ఇప్పుడు టివికె పైనే పడుతోంది.ఆయా పార్టీలలోని 'అసమ్మతి'నేతలు, తగిన ప్రాధాన్యం లభించని నేతలు టివికెలో చేరడానికి ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. తాము ఎవరితోనూ చేతులు కలపబోమనీ, అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామనీ తొలుత ప్రకటించిన విజయ్ తన వైఖరిని కొంత సడలించినట్లు కనిపించడం కూడా ఇతర పార్టీలుఆయన వైపు చూడడానికి మరో కారణం.ఎన్నికల పొత్తులపై నిర్ణయం తీసుకునే అధికారం విజయ్‌కి అప్పగిస్తూ గతవారం టివికె నేతలు తీర్మానించడంతో ఇక ఆ దిశగా పార్టీ కార్యకలాపాలు సాగే సూచనలు కనిపిస్తున్నాయి. పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థి విజయ్ మాత్రమేననీ, ముందు ముందు పార్టీలోకి ఎటువంటి సీనియర్లు వచ్చినా ఈ నిర్ణయంలో మార్పు ఉండదనీ నాయకత్వం స్పష్టం చేసింది. అలాగే ఇతర పార్టీలతో పొత్తుల విషయం పరిశీలించేందుకు ఒకప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు కూడా కార్యవర్గ సమావేశం ప్రకటించింది.డిఎంకె అవినీతి పాలనను అంతమొందించడానికి ఇతర పార్టీలు టివికెతో చేతులు కలపవలసిన అవసరం ఉన్నదనీ, అటువంటి ప్రయత్నాలను తాము స్వాగతిస్తామనీ సమావేశం స్పష్టం చేసింది. పార్టీ ఆమోదించిన నాలుగు తీర్మానాలలో మేనిఫెస్టో కమిటీ ఏర్పాటు కూడా ఉంది.ప్రచార వ్యూహం రూపొందించడానికికూడా త్వరలో ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు కానుంది.

గత యేడాది పార్టీ ఆవిర్భవించిన తర్వాత ఇటువంటి కీలకమైన తీర్మానాలు ఆమోదించడం ఇదే మొదటిసారి.సెంగొట్టియన్ టివికెలో చేరినతర్వాత విజయ్ ఆలోచనా ధోరణిలో కూడా చాలా మార్పు వచ్చినట్లు కనిపిస్తోంది. ఒంటరిగానే బరిలోకి దిగాలనే నిర్ణయం నుంచి భావసారూప్యత గలవారినందరినీ కలుపుకొని వెళ్లాలనే అభిప్రాయానికి ఆయన రావడమే అందుకు ఉదాహరణ. పళనిసామి నాయకత్వంలో ఉన్న అన్నాడిఎంకెలో 'అసంతృప్త నేతలు' అధికంగానే ఉన్నారు.వచ్చే సంవత్సరం ఆరంభంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేలో భాగంగా బరిలోకి దిగాలనేఅన్నాడిఎంకె భావిస్తోంది. అయితే ఆ పార్టీ చీలిక వర్గం నాయకుడైన మాజీముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం విజయ్ పార్టీతో జత కట్టడానికి ప్రయత్నిస్తుండడంతో ముందు ముందు అన్నాడిఎంకె రాజకీయాలు మరింత ఆసక్తికరం కానున్నాయి.డిఎంకె, అన్నాడిఎంకె లోని అసమ్మతి నేతలు తమ పార్టీలోకి వస్తే టివికె విజయం నల్లేరుపై నడకలా సాగుతుందనే అభిప్రాయంతో విజయ్ ఉన్నట్లుగా కనిపిస్తోంది. కరూర్ తొక్కిసలాట ఘటన తర్వాత విజయ్ తన వ్యూహాన్ని మార్చుకొన్నట్లుగా చెబుతున్నారు. డిఎంకె వ్యతిరేక ఓట్లు చీలకుండా తన గుప్పెట్లో ఉండడానికి అవసరమైన అన్ని ప్రయత్నాలను ఆయన సాగిస్తున్నట్లు కనిపిస్తోంది. చాలా కాలం నుంచి తమిళనాడులో కాంగ్రెస్‌కు ఆక్సిజన్అంది స్తున్నది డిఎంకె పార్టీయే అయినా అధికారంలో భాగస్వామ్యం లేకపోవడంతో ఆ పార్టీలోని కొందరు సీనియర్లు చాలా అసంతృప్తితో కనిపిస్తున్నారు. జికె మూపనార్ తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ చాలా బలహీనపడడంతో పూర్తిగా డిఎంకె దయాదాక్షిణ్యాలపైనే ఎన్నికల్లో నెట్టుకు వస్తోంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుతో అధికారంచేపట్టిన స్టాలిన్ ఆ పార్టీకి ఎటువంటి మంత్రి పదవులు ఇవ్వకపోవడం పలువురు సీనియర్లలో అసంతృప్తిని పెంచింది. అటువంటి వారందరికీ ఇప్పుడు టివికె పార్టీ ఆపద్బాంధవుడులా కనిపిస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమకు 40సీట్లు కేటాయించాలని టిఎన్ సిసి అధ్యక్షుడు సెల్వపెరుందగై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి గిరీష్ శోడంకర్ గతవారం స్టాలిన్‌ను కలిసి కోరారు. అందుకు స్టాలిన్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో వారు విజయ్‌తో సంప్రదింపులు మొదలుపెట్టినట్లుగా తెలుస్తోంది.అయితే టివికె, కాంగ్రెస్‌మధ్య పొత్తు కుదిరినా విజయ్ 40 సీట్లు ఇస్తారా? అన్నది సందేహమే. 2021 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 18సీట్లు మాత్రమే వచ్చాయి. బిజెపికి అంతకంటే తక్కువగా 4 సీట్లు మాత్రమే వచ్చాయి. ఈ పరిస్థితిలో అటు కాంగ్రెస్‌తో కలిసినా, ఇటు బిజెపితో కలిసినా టివికెకు పెద్దగా ప్రయోజనం ఉండదనే పరిశీలకులు భావిస్తున్నారు.ఇక అన్నాడిఎంకెలోని చీలిక వర్గాలలో ముఖ్యంగా దినకరన్ కు ఓట్లు ఆకర్షించగల శక్తి ఎక్కువే ఉంది. ప్రస్తుతం ఆయన కూడా విజయ్ వైపు చూస్తున్నట్లుగా చెబుతున్నారు. సెంగొట్టియన్ టివికెలో చేరిన తర్వాత అన్నాడిఎంకె చీలిక వర్గాల నుంచి చాలామంది సీనియర్లు వచ్చి చేరవచ్చనే అభిప్రాయం వినిపిస్తోంది. అయితే ఎవరెవర్ని చేర్చుకోవాలో, ఎవరెవరు వద్దో విజయ్ జాగ్రత్తగా పరిశీలించవలసి ఉంది. ముందు ముందు వలసలు మరింత ఎక్కువగా ఉండవచ్చు. ఏదిఏమైనా వచ్చే ఎన్నికల్లో డిఎంకె కూటమిని ఎదుర్కొనేందుకు అన్నాడిఎంకె బిజెపి కూటమి, విజయ్ కూటమి ప్రధానంగా కృషి చేస్తాయి. ఈత్రిముఖ పోటీలో డిఎంకె తిరిగి అధికారంలోకివస్తుందా, లేక ప్రత్యర్థి పక్షాలు బలపడతాయా అన్నది కొద్ది నెలల్లోనే తెలుతుంది. అన్నాడిఎంకెలో తిరిగి ఐక్యత సాధ్యమైతే ఎన్నికల రణం మరింత ఆసక్తి దాయకంగా కనిపిస్తుంది. ●



విజయ్

బల్గేరియా

# ఐరోపాకూ 'జెన్‌జడ్' ఉద్యమం!


**గన్ని మోహన్**

అవినీతి ఆరోపణలు, ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోకపోవడం, ప్రజావ్యతిరేక ధోరణులతో ఏకపక్ష వాదం అనుసరించే ప్రభుత్వాలన్నీ కాలక్రమంలో కుప్పకూలుతున్నాయి. మొన్నటి శ్రీలంకనుంచి నిన్నటి బంగ్లాదేశ్,ఇప్పుడు వెనిజులా ఇలా ఎన్నెన్నో దేశాలు ఇదేకోవలోకి వస్తాయి. తాజాగా ఆగ్నేయయూరోప్ దేశమైన బల్గేరియా కూడా ఈ జెన్‌జడ్ ఆందోళనల జాబితాలో చేరింది. ప్రజల ఒత్తిడి, నిరసనలకు తలొగ్గి ప్రధాని రోసెన్ జెల్యాజ్‌కోవ్ సంకీర్ణ ప్రభుత్వం మొత్తం రాజీనామాను ఆమోదించారు. ఈ వారాంతంలో ఆ దేశంలో జరిగిన తాజా పరిణామాలకు కారణాలు అనేకం ఉన్నప్పటికీ ప్రజల నిర్ణయమే శిరోధార్యమని చెపుతూ జెల్యాజ్‌కోవ్ ప్రభుత్వ రాజీనామాను ప్రకటించారు. బల్గేరియాలోని యువత మొత్తం రాజధాని సోఫియాతోపాటు ఇతర నగరాలన్నింటిలోను ప్రభుత్వవ్యతిరేక నిరసనలు, ర్యాలీలతో హోరెత్తించారు. నిర్బంధకాండను అమలు చేసినా యువత ఎక్కడా మడమతిప్పకపోవడంతో చివరకు ప్రభుత్వనేతలు తలవంచాల్సి వచ్చింది. వచ్చే ఏడాది బడ్జెట్‌లో పన్నులు పెంచడం ద్వారా సామాజిక భద్రతకు కేటాయింపులు పెంచడం, ప్రభుత్వ వ్యయం మరింత పెంచాలన్న ప్రతిపాదనలున్నాయి. దీనికితోడు రాజకీయంగా ఉన్నతస్థాయి నేతల్లో అవినీతి పెరిగిపోవడం కూడా ఇందుకు కారణం అయిందనే చెప్పాలి. అలాగే సామాన్య మధ్యతరగతి పౌరులకు దేశంలో ఎక్కడా న్యాయం అందడంలేదన్న ఆక్రోశం కూడా యువతలో పెరిగిపోయింది. జెన్‌జడ్ ఆందోళనలే ఇందుకు కారణమైందని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఐదేళ్లలోనే తొమ్మిదో ప్రభుత్వం కుప్పకూలిందంటే ప్రజల్లో చైతన్యం ఏ స్థాయిలో ఉందో తెలుస్తోంది. నిజానికి వచ్చే ఏడాది జనవరిలోనే యూరోపియన్ యూనియన్‌లో చేరాల్సి ఉంది.ఐరోపా సమిష్టి కరెన్సీ యూరోను కూడా తమ కరెన్సీగా చేసుకోవాలని నిర్ణయించిన తరుణంలో ప్రభుత్వం ఒక్కసారిగా కుప్పకూలింది. 240సీట్ల ఛాంబర్‌లో 227మంది రాజీనామాకే ఆమోదం తెలిపారు. కొత్తప్రభుత్వం ఏర్పడేంతవరకూ మాత్రమే ప్రస్తుత కేబినెట్ పని చేస్తుంది.గత జనవరిలోనే జెల్యాజ్‌కోవ్ ప్రభుత్వం ఏర్పాటుచేసింది. కేవలం ఆరువోట్ల మెజార్టీతో అవిశ్వాసతీర్మానాన్ని నెగ్గు కొచ్చిన ప్రస్తుతప్రధాని భారీస్థాయిలో నిరసన లతో గద్దెదిగిపోవాల్సి వచ్చింది. కేవలం ప్రజా ఒత్తిడితోనే తాము ప్రభుత్వం నుంచి దిగిపోతున్నామని, అందుకే రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. లాటిన్‌భాషలో ప్రధాని స్పందిస్తూ వోక్స్‌పాపులీ, వోక్స్ డీ అని వ్యాఖ్యానించారు. ప్రజలవాణి ఆ దేవుడి వాణి అని దీనికి అర్థం. ఇక అధ్యక్షుడు రెమెన్ రాదేవ్ పార్లమెంటులో అతిపెద్ద గ్రూపునకు ప్రభుత్వం ఏర్పాటుచేసే అవకాశం కల్పించాల్సి ఉంటుంది. రెండో అతిపెద్దరాజకీయ పార్టీ అధ్యక్షుడిముందు అభ్యర్థిని ఎంపికచేసుకుంటుంది. ప్రయత్నాలన్నీ విఫలం అయితే అధ్యక్షుడు రాదేవ్ కేర్‌టేకర్ కేబినెట్‌ను ఏర్పాటుచేసి ఎన్నికలునిర్వహణకు వెళ్లాల్సి ఉంటుంది. 2021నుంచి చూస్తే మరోసారి ఎన్నికలకు వచ్చే సూచనలున్నాయి. అదే జరిగితే ఐదేళ్లలోనే ఎనిమిదిసార్లు ఎన్నికలు జరిగిన దేశంగా ఈబాల్కన్ ద్వీపకల్ప దేశం రికార్డుల్లో నిలిచిపోతుంది. కేవలం ఏడుమిలియన్లు కూడా పూర్తిగాలేని ఈ చిన్న ఆగ్నేయ యూరప్ దేశంలో నెలకొన్న రాజకీయ అనిశ్చితికి కారణం ప్రభుత్వంలో నెలకొన్న అవినీతి, నాయకుల ధోరణులేనని చెప్పాలి. ఎలాంటి ఒడిదొడుకులులేని ప్రభుత్వంగా నిలవాలని భావించే యూరోపియన్ కమిషన్ పరిధిలోని యూరో కరెన్సీనే తమ దేశ కరెన్సీగా అమలుచేయాలని కూడా నిర్ణయించింది.ప్రస్తుతం ఉన్న కరెన్సీ లెవ్‌స్థానంలో జనవరి ఒకటో తేదీ నుంచి అమలుచేయాల్సి ఉన్నప్పటికీ ప్రస్తుత అస్థిరత కారణంగా ఈ దేశం అటు ఎన్నికలకు వెళ్లలేనిస్థితిలోనూ, ఇటు కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయలేని పరిస్థితిలోనుఉంది. 2007లో ఐరోపా కూటమిలో చేరినఈ బాల్కన్ దేశం యూరోజోన్‌లో 21వ సభ్యదేశంగా నిలుస్తోంది. దేశవ్యాప్తంగా ఉవ్వెత్తున ఎగిసి పడిన హక్కులు ఉద్యమంతో ప్రభుత్వ పెద్దలే దిగిరావాల్సి వచ్చింది. స్వేచ్ఛాయుత జీవనంవైపు వెంపర్లాడుతున్న యువతకు దారిచూపేప్రభుత్వం కావాలని వారు కోరుకుంటున్నారు. తదుపరి ప్రభుత్వంలో ఎన్నికైతే డెల్యాన్ పీవ్‌స్కీ లేదా జిఇఆర్‌బి యుడిఎఫ్ నేత బోయికో బోరిస్సోవ్‌లకు అవకాశం ఉండవచ్చని అంచనా. అయితే బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ తరహాలో అక్కడ హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోకపోవడం కొంత ఊరటనిస్తోంది. ప్రైవేటు రంగంపై అధిక పన్నులు విదించడం,ప్రభుత్వ రంగానికి మరిన్ని నిధులు కేటాయించాలన్న ప్రతిపాదనలతోనే ఈ నిరసన మొదలైంది. అందులోనూ ప్రభుత్వ పనితీరుపై తీవ్రస్థాయిలో అసంతృప్తి పేరుకుని పోయింది. వీటితోపాటు బడ్జెట్ ప్రతిపాదనలు కూడా పౌరులకు ఎంతమాత్రం రుచించలేదు. అందుకే బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు కూడా ప్రభుత్వం వెనకడుగు వేసింది. ప్రభుత్వంలోబాధ్యతాయుత వైఖరి, పారదర్శకత ఉండాలని, అందుకే కొత్త నాయకత్వం రావాలని యువత, వృద్ధ జనాభా ఎక్కువ కోరుతోంది. ఈ పరిస్థితుల దృష్ట్యానే గత నవంబరులో జెల్యాజ్‌కోవ్ 2026 బడ్జెట్ ప్యాకేజిని ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించారు. ట్రేడ్ యూనియన్లు, ఉద్యోగులసంఘాలు సుతరాము ఇష్టంలేదు. మూలధన లబ్ధిపై పన్నులు పెంచడాన్ని పారిశ్రామికరంగంనుంచి తీవ్రనిరసన వ్యక్తం అయింది. పరిశ్రమలు మూసేస్తే ఉపాధి కొరవడుతుందన్న భయం యువతలో నెలకొనడంతో ఉద్యమానికి బీజం వేసింది. డివిడెండ్లపై విధించే పన్ను కూడా రెండు రెట్లు పెంచింది. బిజినెస్ వర్గాలకు ప్రత్యేక ఎలక్ట్రానిక్ అకౌంటింగ్ పరికరాలు ఏర్పాటు చేయడం ఉద్యమానికి దారితీసింది. ఐదేళ్లలోనే ఎనిమిది ప్రభుత్వాలు మార్చిన ఈ బల్గేరియా దేశంలో ఏర్పాటయ్యే కొత్త ప్రభుత్వం ఎంతమేర సుస్థిరతను తెస్తుందన్నది కూడా ప్రశ్నార్థకమే. ●



జెల్యాజ్‌కోవ్

# బయో ఫ్యూయెల్‌కు కరవైన ప్రోత్సాహం



రామ కిష్టయ్య సంగనభట్ల

మండించినపుడు శక్తిని ఉత్పత్తి చేసే పదార్థాన్ని ఇంధనం అంటారు. ఇంధన వాడకం నిత్యకృత్యం. వాహనాలు నడవడానికి, విద్యుత్ ఉత్పత్తి చేయడానికి, వంట చేయడానికి ఇలాఇంధనం ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్నది. మనం ప్రతిక్షణం ఎన్నోరకాల ఇంధనాలపై ఆధారపడి జీవిస్తున్నాం. నీరు, పెట్రోల్, డీజిల్, బొగ్గు, విద్యుత్, కట్టెపుల్లలు సహా ఎన్నోరకాల ఘన, ద్రవ, వాయు ఇంధనాలు, యురేనియం, థోరియం వంటి అణు రసాయన ఇంధనాలు నిత్య జీవితంతో పెనవేసుకుని పోయాయి. నిత్య జీవితంలో ఇంధనాలుగా ఉపయోగపడుతున్నాయి. సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, పెట్రోల్, డీజిల్, అణుఇంధనాలు ప్రకృతిలో పరిమితంగా మాత్రమే లభిస్తాయి. వాటిని ప్రస్తుతం వినియోగిస్తున్నట్లుగా విపరీతంగా వినియోగిస్తే ప్రమాదం తప్పదు.అవసరాలకు మించి వినియోగం చేస్తూపోతే, భవిష్యత్తు అంధకారమే. అందుకే సంప్రదాయేతర ఇంధన వినియోగం ప్రత్యామ్నాయ మార్గంగా చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. పెట్రోల్ డీజిల్ గ్యాసులకు బదులుగా బయో ఇంధన వనరులను, బయోడీజిల్, బయో గ్యాస్ వంటి ఇంధన వనరులపై ఆధారపడడం వల్ల భవిష్యత్తు తరాలకు మేలు చేసినవారం అవుతాం. కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భూమి అంతర్భాగంలో చేరి, భూమి లోపల విపరీతమైన ఉష్ణం, పీడనం కారణంగా మృత జీవజాలం నుండి శిలాజ నూనెలు/బొగ్గు ఏర్పడినవి. శిలాజ నూనెలు లేదా శిలాజ ఘన పదార్థాలను (నేల బొగ్గు వంటివి) తిరిగి సులభంగా పునరుత్పత్తి కావించుటకు సాధ్యం కాదు. అలా తిరిగి శిలాజ ద్రవ్యా లు ఏర్పడాలంటే మళ్లీ కొన్ని లక్షల సంవ త్సరాలు పడుతుంది. అంటే శిలాజ ఇంధ నాలను వాడే కొలది వాడి నిల్వలు తగ్గు తాయి కాని పెరగవు. 19వ శతాబ్దినుండి శిలాజ ఇంధన వాడకం ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోయింది.పరిశ్రమల్లో బాయిలర్లలో, థెర్మోపవరు ప్లాంటు బాయిలరులో బొగ్గు వాడకం ఎక్కువ. పెట్రోలు, డీజిల్‌ను ఇంధనంగా వాడు వాహనాలు విపరీతంగా పెరిగిపోయాయి.అందువలన శిలాజ ఇంధ నాల నిల్వలు త్వరగా కరిగి,తరిగిపోతున్నాయి. ఇలాగే శిలాజ ఇంధనాల వాడకం కొనసాగితే కొన్ని వందల సంవత్సరాల తరువాత శిలాజ నిల్వలు తరిగిపోతూ, బైకులు, కార్లు, బస్సులు, ట్రక్కులు, విమానాలు, ఓడలు ఏవి కదలవు. మళ్లీ మానవుడు ఎద్దుల బండ్లను, గుర్రపు బళ్ళను, సైకిళ్ళను వాడవలసి వుంటుంది. కనుక కొంత మేరకు పెట్రోలియం ఇంధనాల వాడకం తగ్గించే నేపథ్యంలో ఈ జీవ ఇంధనాల వైపు ప్రపంచ దృష్టి మళ్ళింది. చెట్లగింజల నుండి తీసిన కొన్ని నూనెలు ఆహార యోగ్యం కాదు. ఉదాహరణకు వేప, కానుగ, జట్రోఫా (అడవి ఆముదం, నేపాళం) వంటి అనేక నూనెలుఆహార యోగ్యం కాదు. ఈ నూనెలను అల్కహోలసిస్ అనబడు ఎస్టరిఫికేసన్ రసాయన చర్య ద్వారా బయోడీజిల్‌గా పరివర్తించి, 10 వరకు డీజిల్‌లో కలిపి డిజిల్‌ను ఇంధనంగా వాహనాల్లో వాడటం వలన డీజిల్ వాడకాన్ని చాలావరకుతగ్గించవచ్చు.




డీజిల్‌తో నడిచే వాహనాల్లోని అంతర్గత దహన యంత్రం, కార్బోరేటరులో తగు మార్పులు చేసిన నేరుగా బయోడిజిల్‌ను వాడవచ్చును. అలాగే డీజల్‌తో నడిచే రైలుఇంజనులలో బయోడిజిల్‌ను వాడవటం వలన కూడా డీజల్ వాడకాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. పశువుల పేడ, మూత్రాలను ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి కొన్ని దశాబ్దాలుగా ఉత్పత్తి చేస్తున్న విషయం తెలిసినదే. అలాగే ఏదైన జీవద్రవ్య ఘన ఇంధనాన్ని తక్కువ ఆక్సిజన్ అందేలా/లేదా ఆక్సిజన్ రహిత వాతావరణంలో 450వద్ద మండించడం వలన జీవ వాయు ఇంధనం ఏర్పడుతుంది. ఘనజీవ ద్రవ్య పదార్థాలను తాపవిచ్ఛేదన, ఉష్ణవిచ్ఛేదన కావించిన హైడ్రోజన్,కార్బన్ మోనాక్సైడ్,మిథేన్, ఈథేను, ఇథైలిన్ వాయువులు ఏర్పడుతాయి. ఈ వాయువులను కండెన్సరు/ద్రవీకరణకారిలోద్రవీకరించిన ద్రవ ఇంధనం/బయోడీజిల్ ఏర్పడుతుంది. గత యూపీఏ ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి వ్యయంతగ్గించడం, వాతావరణ కాలుష్య నివారణకు, విలువైన విదేశీ మారక ద్రవ్యం మదింపుకోసం జీవ ఇంధనాల ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి నిలిపింది.ఇంధన భద్రతే విదేశాంగ విధానాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తున్న ప్రస్తుత కాలంలో శిలాజ ఇంధనాల నిల్వలు రోజురోజుకూ అడుగంటిపోతున్న కారణంగా కాక, భూ ఉష్ణోగ్రత వ్యాకోచానికి దారి తీస్తున్న, బొగ్గు పులుసు వాయువుల విడుదలను అరికట్టడానికి, ప్రత్యామ్నాయఇంధన వనరులను అభివృద్ధి చేయడం అనివార్యంగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భావించింది. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా జీవ ఇంధనాలు (బయో ఫ్యూయెల్) అన్ని విధాలా లాభసాటిగా గుర్తించారు.శిలాజ ఇంధనం పెట్రోలు స్థానంలో, కర్బనం తక్కువగా ఉండే బయోడీజిల్ ప్రత్యామ్నాయ రవాణా ఇంధనంగా అభివృద్ధి చేసే దిశలో, ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, బయో ఇంధన ఉత్పత్తులపై దృష్టి నిలిపింది. బయో డీజిల్ విపణి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భావించి, నిర్ధారించి, చమురు ధరలు పెరిగిపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని భారత దేశంలో బయో డీజిల్ అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించే దిశగా కృషి చేసింది. బయో డీజిల్ అనగా కానుగ (శాస్త్రీయ నామం:పెన్నేటి) గింజలు లేదా పెద్ద నేపాళం (జట్రోటా)గింజల నుండి తీసే నూనె. బయోడీజిల్ రెండు దశాబ్దాల క్రితమే గుర్తించినా,అదికార్యరూపం దాల్చడానికి చాలా సమయం పడుతున్నది. సస్టైనెబుల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆఫ్ రూరల్ ఏరియాస్ (సూత్ర) అనే సంస్థ బెంగళూరులో బయో డీజిల్ తయారీ, వినియోగంపై విస్తృత పరిశోధన జరిపింది. బంజరు భూములు అధికంగా గల భారతావనిలో జీవఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి పలు పెద్ద సంస్థలు ప్రయత్నించాయి. కానుగ సాగుకు ఎంతో సాంకేతిక పరిజ్ఞానం అక్కరలేదు. కానుగ చెట్లు నెలకు ఒకటి, రెండు తడులతో మామిడి చెట్లంత పెరుగుతాయి. గృహావరణాల్లో, రోడ్ల కిరువైపులా కానుగ నాటితే ఆహ్లాదకరమైన నీడతోపాటు, వేడినీళ్లకు చన్నీళ్లు తోడులాగా ఆదాయం పెరుగుతుంది. ఈ చెట్లు 5 సంవత్సరాలు కాపు ప్రారంభించి, 30 ఏళ్లవరకు పంట నిస్తాయి. కానుగ స్వయంగా చీడపీడల నివారణి అయినందున దానిపై ఎటు వంటి చీడ పీడలుండవు. ప్రధాని నరేంద్ర మోడీ గత ప్రభుత్వం ఇటీవలి కాలంలో పునరుత్పాదక ఇంధన పథకాలకు విశేష కృషిచేసింది. స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి, అవి అందుబాటు యోగ్యంగా ఉండేలా చూడటానికి ప్రాధాన్యం ఇచ్చింది. దేశం లో సులభతర వాణిజ్య నిర్వహణకు ఎంతో చేయూత అందిస్తున్నది. స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు సదుపాయంగా ఉండేలా, అన్ని మంత్రిత్వ శాఖల్లో ప్రాజెక్ట్ అభివృద్ధి విభాగాలను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విభాగాలను ఏర్పాటు చేసింది. ఇంధన పేదరికాన్ని అంతంచేసే దిశగా, స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణహితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి మార్గనిర్దేశం చేసింది. స్వచ్ఛందంగా శిలాజ ఇంధన వినియోగం, స్వదేశీ ఇంధనాలపై మరింత ఎక్కువగా ఆధార పడటం, విద్యుత్ సేవలను పెంచడం, అన్ని ఇంధన వ్యవస్థల్లో డిజిటల్ సృజనాత్మక పరి జ్ఞానాన్ని ప్రోత్సహించడం తదితర అంశాలపై ప్రభుత్వ దృష్టి కేంద్రీకృతం చేసింది. ●

ong-5_ong-5.qxd 12/13/2025 11:59 PM Page 1



## జాతీయ లోక్‌అదాలత్‌లో దాదాపుగా 19,500 కేసులు పరిష్కారం

**- జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్పర్సన్ రాజ్యలక్ష్మీ**

**ఒంగోలు, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లావ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ నందు దాదాపుగా 19,500 కేసులు పరిష్కారం జరిగినట్టు ఇన్చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్పర్సన్ రాజ్యలక్ష్మీ అన్నారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 29 బెంచీల్లో న్యాయమూర్తులు, న్యాయవాదులు కలిసి 19240 క్రిమినల్ కేసులు పది ఫ్రీ లిటిగేషన్ కేసులు 240 సివిల్ కేసులు కేసులు పరిష్కరించామని, వివిధ కేసులతో కక్షిదారులకు దాదాపుగా ఐదు కోట్ల రూపాయలు పరిష్కారం రూపంలో కక్షిదారులకు అందజేయబడిందని తెలిపారు. వివిధ బ్యాంకులైన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కెనరా బ్యాంకు బ్యాంక్ ఆఫ్ బరోడా వర్గాలకు సంబంధించిన కేసులు పరిష్కరింప బడ్డాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు రాజా వెంకటాద్రి పూర్ణిమ లలిత, సీనియర్ సివిల్ న్యాయమూర్తులు హేమలత, జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ కార్యదర్శి, జూనియర్స్ న్యాయమూర్తులు కేసులు పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు.

## కొండపి నియోజకవర్గం ఏర్పాటుకు కామ్రేడ్ రాములు కృషి కీలకం

**కొండపి, ప్రభాతవార్త**



కొండపి అసెంబ్లీ నియోజకవర్గ ఏర్పాటుకు సిపిఐ నాయకులు కామ్రేడ్ కూనంనేని రాములు ఎంతో కృషి చేశారని సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి, కూనంనేని అరుణ అన్నారు. శనివారం కూనం నేని రాములు 26వ వర్ధంతి సందర్భంగా బస్టాండ్ సెంటర్లోని రాములు స్మారక కస్తూపం వద్ద వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని అరుణ మాట్లాడుతూ వనం నేను రాములు ఎన్నో ప్రజా పోరాటాలు చేసి ప్రజల పక్షాన నిలిచిన నిజమైన నాయకుడని ఆమె అన్నారు. పార్టీ ఎమర్జెన్సీ సమయంలో అజ్ఞాతంలోకి తన సతీమణితో వెళ్లి పార్టీ కార్యకలాపాలు నిర్వహించి ప్రజల పక్షాన నిలిచిన మహోన్నత వ్యక్తి అన్నారు. కొండేపి నియోజకవర్గం కందుకూరు ఏరియాలో పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారన్నారు. అటువంటి మహోన్నత ప్రజా నాయకుని ఆశయ సాధనకు కృషి చేయటమే మనమిచ్చే ఘనమైన నివాడని అన్నారు. ఈ కార్యక్రమంకొండేపి నియోజకవర్గ కార్యదర్శి లక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. కామ్రేడ్ రజనీ మాట్లాడుతూ ఎన్నో కష్టనష్టాలు కూర్చి ప్రజల పక్షాన నిలిచి నిలిచిన నాయకులం త్యాగాలను ఎప్పటికీ మరవకూడదని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కూనంనేని రాములు కుటుంబ సభ్యులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ ఈశ్వరి దేవి 236వ ఆరాధన ఉత్సవములు

**జె.పంగులూరు డిసెంబర్ 13 ప్రభాతవార్త**



అమ్మదయ ఉంటే లేనిది ఏదీ లేదని, అమ్మ కరుణాకటాక్షాలు అందరి మీద ఉండాలని పంగులూరు మండల సంఘం అధ్యక్షులు మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవస్థానంలో వేంచేసి ఉన్న శ్రీ జగన్మాత ఈశ్వరీ దేవి 236 వ ఆరాధనోత్సవాని పంగులూరు మండల విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షులు మచ్చ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి ఓంకార్ శర్మ అమ్మవారికి ప్రభాత సేవ, అష్టోత్తర శతనామ స్తోత్రంలతో పూజ కార్యం కార్యక్రమం నిర్వహించి, పంచామృతాలతో అభిషేకం చేసి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. మహిళలందరూ భక్తిశ్రద్ధలతో మణిద్వీప వర్ణన, లలితా సహస్రనామాలు చదివారు. అనంతరం ఆలయ ప్రధాన పూజారి మురికిపూడి ఓంకార శర్మ ని పంగులూరు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మచ్చా వెంకటేశ్వర్లు, సంఘ పెద్దలు దుశ్యాలు వాళ్ళతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు టి. రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి తక్కెళ్ళ పాటి నాగేంద్రప్రసాద్, సంఘ ఉపాధ్యక్షులు మేడూరి శ్రీహర్ష, పెద్దలు మచ్చ షాక్రామాంజనేయులు, కోటపాటి శ్రీనివాసులు, తక్కెలపాటి సుబ్రహ్మణ్య చారి, కోటపాటి అవినాష్, భక్తులు పాల్గొన్నారు.

## ఎంపి మాగుంట..ఎమ్మెల్యే బియన్ మర్యాదపూర్వక కలయిక

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలులోని మంగమూరు రోడ్డులో సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి , బెజవాడ సురేష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బెల్లం సత్యం, ఆళ్ళ శ్రీనివాసులురెడ్డిలు.

## పదివేల మందితో భారీ ర్యాలీ

**కొత్తపట్నం, డిసెంబర్ 13, ప్రభాతవార్త**



వైయస్సార్ సిపి ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ ప్రకాశం జిల్లా లో ఉన్న అన్ని నియోజకవర్గాల కలుపుకొని పదివేల మందితో భారీ ర్యాలీ జరుగుతుందని ఒంగోలు నియోజకవర్గ ఇన్చార్జి చుండూరి రవిబాబు అన్నారు. కొత్తపట్నం కళామందిరం ఆవరణలో పార్టీ కార్యకర్త లతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ ను వ్యతిరేకిస్తూ ఇప్పటికే అనేక కార్యక్రమాలు చేశామని అందులో భాగంగా కోటి సంతకాలు సేకరణ చేయడం జరిగిందన్నారు అన్ని నియోజకవర్గాల నుంచి ఒంగోలు పార్టీ ఆఫీసు కోటి సంతకాల బండిల్స్ అన్ని ఈనెల 15న ర్యాలీతో జరుగుతుందన్నారు, వైద్య కళాశాలను ప్రైవేటీకరణను విరమించుకోవడానికి భారీ స్థాయిలో ఈ ర్యాలీ చేపడుతున్నామన్నారు ఒంగోలు నియోజకవర్గ స్థాయిలో 3వేల మంది కొత్తపట్నం మండలం స్థాయిలో 1000 మంది జిల్లా స్థాయిలో కలుపుకొని పదివేల మందితో ఒంగోలు కలెక్టర్ ఆఫీసు నుండి భారీ ర్యాలీ జరుగుతుందని తెలియజేశారు. మండలంలో ఉన్న కార్యకర్తలు అభిమానులు సర్పంచులు ఎంపిటీసీలు సర్పంచులు మాజీ ఎంపిటీసీలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి మరియు సర్పంచులు ఎంపిటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ ప్రవేశపరీక్షకు 3504 హాజరు

**ఒంగోలు, ప్రభాతవార్త**

జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-2027 విద్యా సంవత్సరానికి ఆరోతరగతిలో ప్రవేశ పరీక్షను ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొత్తం 25 కేంద్రాల్లో అభ్యర్థులు 5502కు కాను పరీక్షకు 3504 హాజరు అయినట్లు జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ సి.శివరామ్ వెల్లడించారు.

ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## అభివృద్ధి పనులు.. సమస్యలపై కలెక్టర్‌తో ఎంపి మాగుంట చర్చ

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలులోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజాబాబుని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అభివృద్ధి పనులు, సమస్యల గురించి, పలు అంశాలపై వారితో చర్చించారు.

# జేఈఈ మెయిన్స్ పరీక్షలకు ప్రతిష్ఠాత్మక ఏర్పాట్లు: కలెక్టర్







**ఒంగోలు, ప్రభాతవార్త**

జిల్లాలో త్వరలో జరగనున్న ప్రతిష్ఠాత్మకమైన జేఈఈ మెయిన్స్ పరీక్షా కేంద్రాల్లో మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ అవసరమైన ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజుతో కలిసి జిల్లాలో జేఈఈ మెయిన్స్ పరీక్షకు సంబంధించి ఏర్పాటు చేయనున్న పరీక్షా కేంద్రాలు ఒంగోలు నేషనల్ కౌన్సిల్ ఫర్ చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా కేంద్రాన్ని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల, రైస్ కృష్ణ సాయి ప్రకాశం గ్రూపు ఆఫ్ ఇనిస్టిట్యూషన్, రైజ్ కృష్ణ సాయి గాంధీ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్, పేస్ ఇంజనీరింగ్ కళాశాల, బ్రిలియంట్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్‌లను సందర్శించి చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఒంగోలు నేషనల్ కౌన్సిల్ ఫర్ చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా సెంటర్ నందు జరుగుతున్న ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్షను, అలాగే డీఆర్ఆర్ఎం స్కూల్‌లో జరుగుతున్న నవోదయ ఎంట్రన్స్ టెస్ట్ కేంద్రాన్ని తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జేఈఈ మెయిన్స్ పరీక్షకు సంబంధించి జిల్లాలో 6 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ ఆరు కేంద్రాలను జిల్లా ఎస్పీతో కలిసి సందర్శించి జేఈఈ మెయిన్స్ పరీక్షల నిర్వహణకు సంబంధించి అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాట్లను పరిశీలించడం జరిగిందన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి జారీ చేసిన మార్గదర్శకాల మేరకు పరిశీలించినట్లు కలెక్టర్ తెలిపారు. గతంలో కూడా జేఈఈ మెయిన్స్ పరీక్ష ఇవే కేంద్ఆల్లో నిర్వహించడం జరిగిందన్నారు. అయినప్పటికిని ఏర్పాట్లు ఎలా ఉన్నాయని పరిశీలన నిమిత్తం రావడం జరిగిందన్నారు. భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ చూడటం జరుగుతుందన్నారు. బ్రిలియర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్‌పై గతంలో ఏసీ, తాగునీటి నిర్వహణపై కొన్ని ఫిర్యాదులు రావడం జరిగిందని, వాటిని పునరావృతం కాకుండా చూడాలని సంబంధిత మేనేజ్‌మెంట్ వారిని ఆదేశించడం జరిగిందన్నారు. జేఈఈ మెయిన్స్ పరీక్ష ప్రతిష్ఠాత్మకమైన పరీక్ష కాబట్టి, దానికి పరీక్షకు సంబంధించి మార్గదర్శకాలు పాటిస్తూ పటిష్టంగా చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ జిల్లాలో జరగనున్న జేఈఈ మెయిన్స్ పరీక్షకు సంబంధించి 6 పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ వారితో కలిసి సందర్శించి పరీక్షా నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించడం జరిగిందన్నారు. పరీక్షా నిర్వహణకు సబంధించి జారీ అయిన మార్గదర్శకాల మేర ఏర్పాట్లను పరిశీలించడం జరిగిందని, ముఖ్యంగా భద్రతా ఏర్పాట్లను పరిశీలించడం జరిగిందన్నారు. పరీక్ష జరుగు సమయంలో అవసరమైన బందోబస్తు ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, విద్యాశాఖ అధికారులు, పరీక్షల నిర్వహణకు సబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జెండర్ సమానత్వంపై అవగాహన ర్యాలీ..

**- మహిళా సాధికారిత ద్వారానే సమాజంలో నిజమైన అభివృద్ధి: ఏపిఎం పిచ్చయ్య**

**మార్కాపురం రూరల్, డిసెంబర్ 13, ప్రభాతవార్త**



మండలంలోని నాయుడు పల్లి గ్రామంలో డిఆర్డిఏ-వెలుగు ఏపీఎం పిచ్చయ్య ఆధ్వర్యంలో జెండర్ సమానత్వంపై జాతీయ ప్రచారంలో భాగంగా శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించి డ్వాక్రా మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మహిళలతో కలిసి జెండర్ సమానత్వ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం పిచ్చయ్య మాట్లాడుతూ బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని, ఆడపిల్లలపై ఎలాంటి వివక్ష చూపకుండా వారికి సమాన అవకాశాలు కల్పిస్తూ విద్యనందించాలని పిలుపునిచ్చారు. మహిళల సాధికారత ద్వారానే సమాజంలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, మార్కాపురం పీఏసీఎస్ అధ్యక్షులు జవ్వాజి రామాంజుల రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు కాకర్ల శ్రీనివాసులు, గ్రామ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వెలుగు ఎల్‌సీకే నాగభూషణరావు, వివోఏలు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## బాలుర వసతి గృహాన్ని డిఆర్‌ఓ ఆకస్మిక తనిఖీ

**ఒంగోలు, ప్రభాతవార్త**





ఒంగోలు అన్నవర్పాడులోని సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలుర వసతి గృహంను శనివారం రాత్రి జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు గురించి ఆరాతీశారు. ఈ సందర్భంగా వంట గదిని, తాగునీటి వసతులను, మరుగుదొడ్లను, స్టోర్ గదిని పరిశీలించారు. వసతి గృహంలో ఉన్న విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా, ప్రతి నెలా వైద్యులు వస్తున్నారా లేదా, వారి ఆరోగ్య పరిస్థితులు, కల్పిస్తున్న వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు మాకు వసతులు బాగున్నాయని, ప్రతినెలా వైద్యులు వచ్చి పరీక్షలు చేసి వెళతారని డిఆర్‌ఓకు చెప్పడం జరిగింది. జిల్లా రెవెన్యూ అధికారి విద్యార్థులతో కలసి భోజనం చేయడం జరిగింది. విద్యార్థులకు వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహించరాదని వసతి గృహం సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం బాలుర వసతి గృహంను పరిశీలించడం జరిగిందన్నారు. వసతులు, భోజనం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వసతి గృహంలో మొత్తం 95 మంది విద్యార్థులు ఉన్నారు. ఆయన వెంట సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్, ఎఎస్‌డబ్ల్యూఓ టి లింగయ్య, హెచ్‌డబ్ల్యూఓ డి అంకబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సేకరించిన పత్రాల తరలింపు కార్యక్రమాన్ని వియవంతం చేయండి

**ఒంగోలు, ప్రభాతవార్త**



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా పార్టీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని నియోజకవర్గ ఇన్‌చార్జిల సహకారంతో సోమవారం ఉదయం 10గంటలకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా సేకరించిన 5,26,148 పత్రాలను ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలులో చర్చి సెంటర్ నందు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించి అనంతరం జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించనున్నారు. కావున జిల్లాలోని అన్ని నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజాప్రతినిధులు వివిధ హోదా పదవుల్లో ఉన్న వారు, పార్టీ శ్రేణులు విధిగా పాల్గొని విజయవంతం చేద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆదెన్న, ఒంగోలు పార్లమెంట్ రాష్ట్ర సెక్రటరీ బొట్ల రామారావు, చింతలచెరువు సతయనారాయణరెడ్డి, దుంపా చెంచిరెడ్డి, ఉప్పలపాటి ఏడుకొండలు(వేణు), గోనుగుంట రజిని, కూనం గౌతమ్, రాయని వెంకటరావు, పెట్లూరు ప్రసాద్, బాలినేని శ్రీనివాసరెడ్డి, సయ్యద్ అప్సర్, షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాధర్బార్‌లో ప్రజల సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే దామచర్ల

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలు నందు ప్రజాధర్బార్ నిర్వహించిన ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు ప్రజల సమస్యలు తెలుసుకొని, వారి నుండి నేరుగా వినతులు స్వీకరించారు. ఒంగోలు నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని దామచర్ల జనార్ధన్ పేర్కొన్నారు. శనివారం శాసనసభ్యులు నివాసం నందు ప్రజా ధర్బార్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలు, వినతులను ఎమ్మెల్యేకి తెలియజేశారు. పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, రుణాల మంజూరు, వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు, గ్రామాభివృద్ధికి సంబంధించి ఎదురవుతున్న ఇబ్బందులపై వచ్చిన విజ్ఞప్తులను ఎమ్మెల్యే స్వయంగా స్వీకరించి వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులను పిలిచి ప్రత్యక్షంగా ఆదేశాలు జారీ చేసి, ప్రజలకు త్వరితగతిన పరిష్కారం అందేలా చర్యలు తీసుకున్నారు.

## ప్రభుత్వ భూముల ఆక్రమణలను అడ్డుకున్న ఆర్డివో

**ఒంగోలు, ప్రభాతవార్త**






ఒంగోలు మండల పరిధిలోని ముక్తినూతలపాడు, 186 సర్వే నెంబర్‌లో సిపిఐ నాయకులు, కొందరు ప్రజలు అనధికారికంగా గుడిసెలు వేస్తున్నారన్న సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకొని ఆక్రమణలను ఆపడం జరిగిందని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న తెలిపారు. ఒంగోలులోని తహసిల్దార్ కార్యాలయం నందు తహసిల్దార్ పిన్నిక మధుసూదన్‌రావు, సర్వేయర్ నాళం వెంకటేశ్వర్లు తో కలిసి ఆర్డీవో లక్ష్మీప్రసన్న మీడియా సమావేశం నిర్వహించారు. సిపిఐ నాయకులతో మాట్లాడడం జరిగిందని ఆ స్థలం ఎన్ఎస్‌పికి చెందిన ప్రభుత్వ భూమి అని ఆర్డిఓ పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించే అధికారం ఎవరికి లేదని తెలిపారు. 16వ తేదీ బుధవారం ఒంగోలు ఆర్డిఓ కార్యాలయంలో వారితో సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వారితో చర్చలు జరిపి, ప్రభుత్వ నియమాల ప్రకారం వారికి ఇళ్ల స్థలాలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా సరే ప్రభుత్వ భూములను ఆక్రమించినట్లయితే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ప్రజలకు నివేశ స్థలాలు లేవని సిపిఐ నాయకులు తమ దృష్టికి తీసుకొని వచ్చారని వారికి ప్రభుత్వం ద్వారా నివేశ స్థలాలు అందే విధంగా చూస్తామన్నారు.

## సుందరం ఫైనాన్స్ 25 ఏళ్ళ వార్షికోత్సవ సంబరాలు

**ఒంగోలు, ప్రభాతవార్త**

సుందరం ఫైనాన్స్ 25 ఏళ్ళ వార్షికోవత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. ఒంగోలులోని బ్రాంచ్‌లో ఈ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సుందరం ఫైనాన్స్‌లో మాకు నిలబెట్టేది కేవలం దీర్ఘకాలం కావు, నిజాయితీ, న్యాయం, సేవ, నిబద్ధతో సేవలు అందించడంతోనే ఈ బ్రాంచ్ నిలబడిందని ఫైనాన్స్ ఆంధ్రా ప్రాంత ఉపాధ్యక్షలు, హెడ్ ఎస్ బాలసుబ్రహ్మణియన్ అన్నారు. 1997లో స్థాపించబడిన ఒంగోలు బ్రాంచ్ ఒంగోలులో ఆర్థిక ప్రాప్తిని విస్తరించడంలో కీలకపాత్ర పోషించిందని ఒంగోలు బ్రాంచ్ సీనియర్ మేనేజర్ ప్రసాద్ వివిఎస్ఆర్‌కె అన్నారు. భవిష్యత్తులో కూడా సుందరం ఫైనాన్స్ ప్రజలకు ఇంకా చేరువ చేసేందుకు అనునిత్యం కృషి చేస్తామని తెలిపారు.



6_6.qxd 12/14/2025 12:45 AM Page 1



## పాతమాగులూరులో విద్యుత్ అంతరాయాల సమస్యలకు పరిష్కారం



**సంతమాగులూరు, డిసెంబర్ 13, ప్రభాతవార్త**
ఆరీనడ ఎస్ ఎస్ స్కీం ద్వారా సంతమాగులూరు మండలం పాతమాగులూరు గ్రామంలో ఎత్తు తక్కువ,శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్థాంబాలను తొలగించి నూతన స్థంబాలను ఏర్పాటుచేసే ప్రక్రియకు శనివారం గ్రామసర్పంచ్ జిర్రా విజయబాబు ఆధ్వర్యంలో కూటమి నాయకులు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ స్థంబాల పునరుద్ధరణకు సహకరించిన రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ రాష్ట్ర నాయకులు అట్లా.చిన్న వెంకటరెడ్డి, సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ తేలప్రోలు రమేష్, సంతమాగులూరు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు చేవూరివాసు రెడ్డి, పాతమాగులూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు అట్లా.పెద్ద వెంకట రెడ్డిలను గ్రామసర్పంచ్ విజయబాబు గ్రామప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీనాయకులు చల్లా బ్రహ్మారావు, జనసేన జిల్లా నాయకులు చల్లా వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## టీచర్స్ గేమ్స్ చీరాల డివిజన్ త్రో బాల్ విజేత సంతమాగులూరు



**సంతమాగులూరు ,డిసెంబర్ 13 ,ప్రభాతవార్త**
ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన టీచర్స్ డివిజనల్ ఆటోల పోటీలలో సంతమాగులూరు మహిళల టీచర్ల త్రో బాల్ జట్టు డివిజనల్ స్థాయి విజేతగా నిలచింది. ఉదయం నుండి సాగిన ఈ క్రీడలో వరుసగా జె పంగులూరు, ఇంకొల్లు, పర్చూరు, బల్లికురవ మండలాల జట్లపై విజయం సాధించి చీరాల డివిజన్ విజేతగా సంతమాగులూరు మహిళా టీచర్స్ జట్టు నేలచింది.విజేతలైన ఉపాధ్యాయునీలు మాట్లాడుతూ తమ విజయం వెనుక సంతమాగులూరు మండల విద్యాశాఖ అధికారులు వి. కోటేశ్వరరావు, దినేష్‌ల సంపూర్ణ సహకారం ఉందన్నారు. తాము క్రీడా నైపుణ్యం పొందేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు పేరం శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి,వెంకట్రావు, వీరేంద్ర,నజీమాలు ప్రత్యేక శిక్షణ ఇచ్చారన్నారు. వీరందరి పర్యవేక్షణలో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎంఈఓ శ్రీనివాసరావు, స్థానిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, జిల్లా స్కూల్ గేం సెక్రటరీ ప్రతిమ,చీరాల డివిజన్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నాగేశ్వరావు, పాల్గొన్నారు.

## బాల మహోత్సవం అండర్ 17 చెస్‌లో రాష్ట్రస్థాయి విజేతగా

### మన బాల భారతి విద్యార్థి సత్య మహేశ్ రెడ్డి



**సంతమాగులూరు డిసెంబర్ 13 ప్రభాతవార్త**
పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట డాక్టర్ కోడెల శివ ప్రసాద్ స్టేడియంలో శనివారం నిర్వహించిన "బాల మహోత్సవం" పోటీలలో అండర్ 17 చెస్ పోటీలో సంతమాగులూరు మండలం పుట్ట వారి పాలెం పంచాయితీ పరిధిలోని మన బాల భారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కి చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థి గడ్డం సత్య మహేష్‌రెడ్డి రాష్ట్రస్థాయి విజేతగా నిలిచారు. ఉత్కంఠగా సాగిన ఈ పోటీలో తమ పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి విజేతగా నిలవడం పట్ల పాఠశాల అకడమిక్ డైరెక్టర్ ఒంటెద్దు అంజిరెడ్డి, కరస్పాండెంట్ ముప్పాళ్ళ వెంకటేశ్వర్లు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ దుగ్గెంపూడి పవన్ కుమార్ ఉపాధ్యాయులు బోధనేతర సిబ్బంది విద్యార్థులు అభినందనలు తెలిపారు.

## ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

- మంత్రి గొట్టిపాటికి కృతజ్ఞతలు
- మండల సమావేశంలో అధికార యంత్రాంగం హర్షధ్వానాలు



**బల్లికురవ, డిసెంబర్ 13, ప్రభాతవార్త**
అద్దంకి నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో భాగం చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కు మండలంలోని అధికార యంత్రాంగం కృతజ్ఞతలు తెలుపుతూ ధన్యవాదాల తీర్మాణాన్ని ఆమోదించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో తహసీల్దార్ రవి నాయక్, ఎంపీడీవో కుసుమకుమారిలు ఈ మేరకు ధనయవాదాల తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల అధికార యంత్రాంగం మొత్తం హర్షధాన్వాలతో కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ రవి నాయక్ మాట్లాడుతూ 2026 డిసెంబర్ కల్లా మండలంలో రీ సర్వే పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 8 గ్రామాలలో సర్వే పూర్తి చేశామని, ప్రభుత్వం నిర్దేశించిన విధంగా లక్ష్యాలను పూర్తి చేస్తామన్నారు. అదే విధంగా వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో వేమవరం నాలుగు రోడ్ల కూడలిలో పారిశ్రామిక వాడలో రెండు రోజుల వ్యవధిలో ప్రత్యేక తనిఖీ కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. సైడు కాలువల నిర్మాణం, గ్రానైట్ వ్యర్థాల తొలగింపు, రహదారులపై నీటి ట్యాంకర్ల ద్వారా దుమ్ము లేవకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. గ్రానైట్ సంఘ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయడం ద్వారా విధి విధానాలను వెల్లడిస్తామన్నారు. ఎంపీడీవో కుసుమకుమారి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు సాగుతున్నాయని అన్నారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో అన్ని గ్రామ పంచాయతీలలోను మంచినీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ ప్రణాళికలు రూపొందించాలన్నారు. పంచాయతీ ఆజ్ ఏఈ మాధవ్, వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఏఈ గిరి నాయక్, తదితరులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న ప్రగతిని వివరించారు.

## కొలుకుల సెంటర్‌లో పేలిన ట్రాన్స్‌పార్మర్

- భయంతో చుట్టుపక్కల ప్రజలు పరుగులు



**యర్రగొండపాలెం, డిసెంబర్ 13, ప్రభాతవార్త**
యర్రగొండపాలెం పట్టణంలోని కొలుకుల సెంటర్ ప్రభుత్వం పాఠశాల వద్ద విద్యుత్ ప్రమాదం జరిగింది. ఒక ట్రాన్స్‌పార్మర్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి పేలిపోయింది. దీంతో ఆ ట్రాన్స్‌పార్మర్ ఉన్న ప్రాంతంలో పెద్దగా మంటలు ఎగసి వెలుగులు విరజిమ్మాయి. దాంతో యర్రగొండపాలెం పట్టణంలో పెను ప్రమాదం తప్పింది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ పేలింది. ఒక్క సారిగాకరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అక్కడి పాఠశాలలోని విద్యార్థులు భయపడి పరుగులు తీశారు. రద్దీగా ఉండే ప్రాంతం కావడం ముందు వెనుక పాఠశాలలు ఉండడంతో పాటు చిన్న పిల్లలు స్కూల్‌కి పోతున్న సమయంలో ఒక్క సారిగా ట్రాన్స్‌పార్మర్స్ పేలి మంటలు రావడంతో చుట్టు పక్కల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సబ్ స్టేషన్‌లో ప్రమాదం జరిగినట్లు తొలుత అందరు భావించారు. కాని ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయిందని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. అయితే విద్యుత్ శాఖ అధికారులు సకాలంలో స్పందించి విద్యుత్ సరఫరాను నిలిపివేసి మంటలను అర్పడంతో పెను ప్రమాదం తప్పిందని తెలుస్తుంది. ప్రజలు నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో పైగా ఇక్కడే రెండు పాఠశాలలు ఉన్న విషయం తెలిసిన విద్యుత్ అధికారులు ఇలా చీటికి మాటికి పేలిపోయే భారీ ట్రాన్స్‌ఫార్మర్స్‌లను ఉంచటం ఎంటని పలువురు నిలదీస్తున్నారు. ఈ ఘటన శనివారం ఉదయం 9గంటల ప్రాంతంలో జరిగింది. ఓవర్ లోడ్ కారణంగా ఇలాంటి ప్రమాదాలు జరుగుతుంటాయని ఇది మామూలు విషయంలా విద్యుత్‌శాఖ అధికారులు చెబుతుండడంపై ఆ పరిసరాల ప్రజలు మండిపడుతున్నారు.

### రామగోపాలపురంలో జలసురక్ష కార్యక్రమం



**వెలిగండ్ల, డిసెంబర్ 13, ప్రభాతవార్త**
కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి స్ఫూర్తితో వెలిగండ్ల మండలంలోని రామగోపాలపురం గ్రామ పంచాయతీలో జల సురక్ష కార్యక్రమంలో భాగంగా ఓవర్ హెడ్ ట్యాంక్ లోపల భాగం బ్లీచింగ్ ఫాడర్‌తో శుభ్రపరచడమైంది. అలాగే కింద ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి బ్లీచింగ్ స్ప్రే చేపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొబ్బ తిరుపతమ్మ, మండల తెలుగు యువత అధ్యఓఉలు బొబ్బా రమణారెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్.గంగాధర్, డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి జనార్ధన్‌రాజు, పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిలను ఢీకొన్న లారీ తృటిలో తప్పిన ప్రమాదం



**బల్లికురవ, డిసెంబర్ 13, ప్రభాతవార్త**
అద్దంకి,నార్కట్‌పల్లి రాష్ట్రీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ తృటిలో ప్రాణాపాయం నుండి బయటపడింది. రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో గ్రామానికి చెందిన ఏటి సంపూర్ణ రోడ్డు దాటే క్రమంలో రాజస్థాన్‌కు చెందిన కంటైనర్ లారీ ఢీకొట్టింది. సంఘటన సమయంలో తృటిలో ప్రాణాపాయం నుండి క్షతగాత్రురాలు తప్పించుకున్నారు. సంఘటన స్థలంలోని గ్రామస్తులు రహదారి భద్రత అంబులెన్స్‌లో గాయపడ్డ మహిళను నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో రహదారి పైకి చేరి ఆందోళన చేపట్టారు.

## సర్వేయర్‌కు తహశీల్దార్ పరామర్శ

**బల్లికురవ, డిసెంబర్ 13, ప్రభాతవార్త**
మండలంలోని వల్లాపల్లి గ్రామానికి చెందిన సర్వేయర్ రాజశేఖర్‌రెడ్డి తండ్రి సుబ్బారెడ్డి, అనారోగ్యంతో శనివారం మరణించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ రవి నాయక్ వల్లాపల్లిలోని రాజశేఖర్ రెడ్డి నివాసానికి వెళ్లి సుబ్బారెడ్డికి నివాళులర్పించి రాజశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజశేఖర్‌రెడ్డి కూకట్ల గ్రామ సర్వేయర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మండలంలోని పలువురు గ్రామ సర్వేయర్లు రాజశేఖర్‌రెడ్డిని పరామర్శించారు.

### ఎంపీని కలిసిన జిల్లా గ్రంధాలయం పరిషత్ చైర్మన్ సుచిత్ర వీరయ్య చౌదరి



**నాగులుప్పలపాడు, డిసెంబర్ 13, ప్రభాతవార్త**
ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డిని జిల్లా గ్రంధాలయం పరిషత్ చైర్మన్ సుచిత్ర వీరయ్య చౌదరి శనివార మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గ రైతు అధ్యక్షులు ఇంటూరి శ్రీనివాసరావు ఉన్నారు.

### ఎమ్మెల్యే దామచర్లను కలిసిన జిల్లా గ్రంధాలయ పరిషత్ చైర్మన్ సుచిత్ర వీరయ్య చౌదరి



**నాగులుప్పలపాడు, డిసెంబర్ 13, ప్రభాతవార్త**
ఒంగోలు నియోజకవర్గ శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌ని వారి స్వగృహం నందు జిల్లా గ్రంధాలయ పరిషత్ చైర్మన్ సుచిత్ర వీరయ్య చౌదరి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గం రైతు అధ్యక్షులు ఇంటూరి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



**దర్శి, డిసెంబర్ 13, ప్రభాతవార్త**
దర్శి రీజియన్ పాస్టర్స్ ఫెల్లోషిప్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కురిచేడు రోడ్డులోని కవనెంట్ చర్చిలో గ్రాండ్ క్రిస్మస్ సెలబ్రేషన్ ఘనంగా నిర్వహించారు. రీజియన్ అధ్యక్షులు గల్లెపోగు ఏసుదాసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీస్ గాస్పెల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బిషప్ బి.శాంసన్ క్రిస్మస్ సందేశం అందించారు. శాంసన్ మాట్లాడుతూ యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రపంచ మానవాళి జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అన్నారు. క్రీస్తు ప్రేమను క్రియల్లో చూపడమే నిజమైన క్రిస్మస్ అన్నారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు. 60 మంది పాస్టర్లకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు గాలిమూటి దేవప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి చిలక ఇశ్రాయేలు, ఫాస్టర్స్ ఫెల్లోషిప్ దర్శి, దొనకొండ, కురిచేడు, తాళ్లూరు మండలాల అధ్యక్షులు పాస్టర్ బి.అనిల్, పాస్టర్ జి.యోషయా, పాస్టర్ గండి సుందర్‌రావు, పాస్టర్ రమణారెడ్డి, దర్శి మండల ట్రెజరర్ నిరీక్షణకుమార్, పాస్టర్లు మోషే, జక్రయ్య తదితరులు పాల్గొన్నారు.

### పంచాయతీ కార్మికుని మృతి.. బహుజన నాయకులు శ్రద్ధాంజలి



**దర్శి, డిసెంబర్ 13, ప్రభాతవార్త**
మండలంలోని తూర్పువీరాయపాలెం పంచాయతీలో స్వీపర్‌గా పని చేస్తున్న గుండాల ప్రసాద్(52) గుండె పోటుతో మరణించారు. బహుజన దళిత నాయకులు అట్లూరి రామారావు జనరాజుపల్లి యలమంద ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనకు ప్రభుత్వం తరుపున రావాల్సిన రాయితీలను త్వరగా వర్తింపచేయాలని సచివాలయ అధికారులను, మండల అభివృద్ధి అధికారులను కోరారు.

## గుండెపోటుతో విద్యుత్ లైన్‌మెన్ మధుబాబు మృతి



**ముండ్లమూరు, డిసెంబర్ 13, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన ముండ్లమూరు లైన్‌మెన్‌గా పని చేస్తున్న పూసపాటి మధుబాబు(46) శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. మండలంలోని స్వగ్రామమైన మారెళ్ళ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.మృతి చెందిన మధుబాబుకు భార్య సుజాత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.మధుబాబు గుండెపోటుతో అకాల మరణం చెందడంతో భార్యపిల్లలు,బంధువులు బోరున విలపిస్తున్నారు. మధుబాబు మృతదేహానికి యూనియన్ అధ్యక్షులు పీపీ వెంకటరెడ్డి, సెక్రటరి బి.శ్రీనివాసరావు,ఎల్ఐ ఎస్.సాంబయ్య,లైన్‌మెన్‌లు పీవీఆర్ ఆంజనేయులు, సోమ్లానాయక్, కోటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## లోక్‌అదాలత్‌లో 90 కేసులు పరిష్కారం

- రూ.2,38,965 అపరాద రుసుం ప్రభుత్వ ఖజానాకు జమ



**దర్శి, డిసెంబర్ 13, ప్రభాతవార్త**
ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం దర్శి పట్టణంలోని జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు నందు జరిగిన మెగా లోక్ అదాలత్ నందు దర్శి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుకున్న మొత్తం 90 కేసులు అక్రమంగా మద్యం అమ్ముతున్న 62 మంది వ్యక్తులపై పెట్టిన(బెల్టు) కేసులను బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వ్యక్తులపై పెట్టిన(28) కేసులను సదరు కేసులలో పట్టుబడిన వ్యక్తుల వద్ద నుండి ప్రభుత్వ నిబంధనల ప్రకారం మొత్తం రూ.2,38,965 అపరాధ రుసుముగా నిర్ణయించి ప్రభుత్వ ఖజానాకు కట్టించి సదరు కేసులను పరిష్కారం చేయడమైంది. ఈ మెగా లోక్‌అదాలత్ కార్యక్రమంలో దర్శి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కే.శ్రీనివాసరావు, దర్శి ఎక్సైజ్ స్టేషన్ ఎస్సైలు రఘు సత్యనారాయణ, యూసఫ్ షరీఫ్‌లు, సిబ్బంది కే.శ్రీనివాసులు, సాయిబాబా, కాశీం పీరా పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో 60 ఎక్సైజ్ కేసులు పరిష్కారం



**సింగరాయకొండ, డిసెంబర్ 13, ప్రభాతవార్త**
మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్లో సింగరాయకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 60 పెండింగ్ కేసులును విజయవంతంగా పరిష్కరించినట్లు సీఐ ఎం. శివకుమారి తెలిపారు.వీటిలో 50 బెల్టు కేసులు మరియు 10 ఓపెన్ కన్స్యూమప్షన్ కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ పరిష్కారం ద్వారా 1,96,056 రూపాయలు ప్రభుత్వ ఖజానాకు చెల్లింపుగా జమ చేసినట్లు తెలిపారు.

## అత్యంత వైభవంగా శ్రీ నాగవరపమ్మ తల్లి కొలుపులు



**ముండ్లమూరు, డిసెంబర్ 13, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన ముండ్లమూరులో బేతపూడి వంశస్థులు, దద్దాల వంశస్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ నాగవరపమ్మ తల్లి కొలుపులు శనివారం రెండవ రోజు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్ట వద్దకు ఊరేగింపుగా బయలుదేరిన అమ్మవారికి భక్తులు పసుపు నీటితో వారు పోసి నమస్కరించుకున్నారు. తప్పెట్లు, సన్నాయి మేళాలు, భారీగా బాణసంచాలతో అమ్మవారి ఆలయం నుండి శివాలయం సమీపంలో ఉన్న పుట్ట వద్దకు ఊరేగింపుగా వెళ్లి పుట్టకు భక్తులు నీరు, పాలు పోసి పసుపు కుంకుమాలతో పూజించి టెంకాయలు కొట్టి నమస్కరించుకున్నారు. అనంతరం శ్రీనాగరపమ్మ తల్లి ఆలయంలో బేతపూడి వంశస్థులు, దొద్దాల వంశస్థులు ఇంటి గోత్రనామాలతో పూజారి ప్రత్యేక పూజలు నిర్వహించి దిష్టి తీసి, పున్నీళ్లు చల్లి ఆశీర్వదించారు. రాత్రి 8గంటలకు ఊరేగింపుగా వెళ్లి పుట్ట బంగారంతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయం తీసుకొచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పోలేరమ్మ తల్లి, శ్రీషిర్డీ సాయిబాబా, శివాలయాలలో టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించారు.కొలుపులు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు మధ్యాహ్నం, రాత్రి అన్న వితరణ చేశారు. కొలుపులు సందర్భంగా ఆలయాన్ని, వీధులను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

## పరస్పర సమ్మతితో కేసుల శాశ్వత పరిష్కారం

- జాతీయ లోక్ అదాలత్ విజయవంతం



**సింగరాయకొండ, డిసెంబర్ 13, ప్రభాతవార్త**
పరస్పర సమ్మతితో వివాదాలను వేగంగా పరిష్కరించుకునేందుకు లోక్‌అదాలత్ ఉత్తమ వేదికగా ఉపయోగపడుతుందని జూనియర్ సివిల్ జడ్జి వి.లీలా శ్యాం సుందరి తెలిపారు.దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ప్రకాశం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం సింగరాయకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సింగరాయకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు అధ్యక్షత వహించగా, జూనియర్ సివిల్ జడ్జి డా. వి. లీలా శ్యాం సుందరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కక్షిదారులు పరస్పర అవగాహనతో వివాదాలను పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ఖర్చు ఆదా అవుతుందని పేర్కొన్నారు. లోక్ అదాలత్ ద్వారా న్యాయపరమైన సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు.అనంతరం అల్పాహార విందు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో సింగరాయకొండ సీఐ చావా హాజరతయ్య, కొండపి సీఐ సోమశేఖర్, న్యాయవాదులు బక్కమంతుల వెంకటేశ్వర్లు, కొల్లూరి నరసింహరావు, పాలవల్లి సంజీవరెడ్డి, మహిళా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత సురేష్ తల్లి నాగరత్నంకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ తదితరులు ఘన నివాళులు



**సంతనూతలపాడు, డిసెంబర్ 13, ప్రభాతవార్త**
సంతనూతలపాడులో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రావులపల్లి వెంకట సురేష్ బాబు తల్లి వెంకటనాగరత్నం(65)కు శనివారం నాడు సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు, మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు తదితరులు ఘన నివాళులర్పించారు. నాగరత్నం మృతదేహాన్ని ఎమ్మెల్యే విజయ్ కుమార్ సందర్శించి వారి కుమారుడు సురేష్ బాబుకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, గ్రామ టీడీపీ అధ్యక్షులు బొడ్డు శంకర్‌బాబు, మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు ఎన్.మాధవిలత, గుమ్మలంపాడు టీడీపీ అధ్యక్షులు బొడ్డపాటి చంద్రశేఖర్, మాజీ సొసైటీ అధ్యక్షులు సాదినేని శ్రీరామమూర్తి, బి.యల్లమంద, చిట్టెంశెట్టి శ్రీనివాసరావు, కొప్పోలు శ్రీనివాసరావు, మార్పుడి జనార్ధన్, ఎం.వెంకటరావు, నల్లగట్ల సుబ్బారావు, చెరుకూరి వెంకట సుబ్బయ్య, బొడ్డు వెంకటరావు, తదితరులు పలువురు యాదవ సంఘం నేతలు నాగరత్నం మృతదేహాన్ని సందర్శించి ఘన నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

### ఒంగోలు ఎంపీ మాగుంటను సత్కరించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్



**సంతనూతలపాడు, డిసెంబర్ 13, ప్రభాతవార్త**
ఒంగోలులోని సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ కార్యాలయంలో శనివారం నాడు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి స్థానిక ఎమ్మెల్యే విజయ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. తదుపరి ఎమ్మెల్యే విజయ్ కుమార్ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని సత్కరించారు.ఈ సందర్భంగా ఒకరినొకరు పలురంగాలపై సమీక్షించుకున్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమైక్య అధ్యక్షులు మండవ జయంతి బాబు, మద్దిపాడు మండల టీడీపీ అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు అన్నీ రంగాలలో రాణించాలి



**సింగరాయకొండ, 13 డిసెంబర్, ప్రభాతవార్త**
విద్యార్థులు అన్నీ రంగాలలో రాణించి, సమగ్ర అభివృద్ధి సాదించాలని కందుకూరు మున్సిపల్ కమీషనర్ కొర్రపాటి అనురాధ ప్రోత్సహించారు. మలినేని సుశీలమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగు రోజుల పాటు సైబర్ సెక్యూరిటీ వర్క్‌షాప్ మరియు 24 గంటల హ్యాకథాన్ సుప్రజా టెక్నాలజీస్ సహకారంతో శనివారం విజయవంతంగా ముగించారు.ఈ కార్యక్రమానికి కందుకూరు మున్సిపల్ కమిషనర్ కొర్రపాటి అనూష ముఖ్య అతిథిగా పాల్గొని,ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకుంటే మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ వంటి కీలక రంగాల్లో శిక్షణ అందించడం అభినందనీయం అన్నారు. అనంతరం మలినేని పెరుమాళ్ళు, కన్వీనర్ ప్రొఫెసర్ కోటేశ్వరరావును అభినందించి, విద్యార్థులు సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాలతో ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్ష వ్యక్తపరిచారు.సుప్రజా టెక్నాలజీస్ సీఈవో చలువాది సతీష్ స్టార్టప్‌లు ప్రారంభించమని విద్యార్థులను ప్రోత్సహించారు. వర్క్‌షాప్ విజేతలకు సర్టిఫికెట్లును చైర్మన్ పెరుమాళ్ళు చేతులు మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో CSC HoD జ్యోతి, CSC HoD వసుమతి, తివీ వెంకటేశ్వర్లు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

## నేడు సంతనూతలపాడులో మెగా గుండె వైద్య శిబిరం



**సంతనూతలపాడు, డిసెంబర్ 13, ప్రభాతవార్త**
సంతనూతలపాడులోని పోలీసు స్టేషన్ సమీపంలో గల సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో విజయవాడ స్వర సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఒంగోలు శ్రీరామ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్,ఒంగోలుహెచ్‌సీజీఎమ్మెన్నార్ క్యాన్సం సెంటర్ ఒంగోలు వార్లఆధ్వర్యంలో ఈనెల 14న ఆదివారం మెగా ఉచిత గుండె వైద్య శిబిరం జరగనున్నట్లు సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శనగల వెంకటరమణ,ట్రస్టు వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరిలు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు ఈ మెగా ఉచిత గుండె వైద్య శిబిరం జరగనున్నట్లు వారు పేర్కొన్నారు. గుండె స్కానింగ్, గుండె ఈసీజీ, గుండె ఎకో, షుగర్, బీపీ పరీక్షలు, క్యాన్సర్ ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు వారు వెల్లడించారు.అదే విధంగా బీపీ, షుగర్, వ్యాధిగ్రస్తులకు సంబంధించి ఒక నెలకు సరిపడి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు. క్యాన్సర్ ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు కూడా ఉచితంగా చేయనున్నట్లు వారు వెల్లడించారు. మెగా ఉచిత గుండె వైద్య శిబిరానికి వచ్చే ప్రజలు తమ ఆధార్,రేషన్ కార్డులను కూడా తెచ్చుకోవాలని వారు కోరారు.ఈ మెగా వైద్య శిబిరంను ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని రమణ చౌదరిలు కోరారు.

## బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిని కలిసిన సత్యనారాయణరెడ్డి



**కనిగిరి, డిసెంబర్ 13, ప్రభాతవార్త**
చీమకుర్తిలో శనివారం ప్రకాశం జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను, ప్రకాశం జిల్లా పార్టీ అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని వారి నివాసంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్(సీఈసీ) సభ్యులు చింతల చెరువు సత్యనారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పలు రాజకీయ, అభివృద్ధి అంశాలపై చర్చించినట్లు సమాచారం.

7_7.qxd 12/14/2025 12:47 AM Page 1



## రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు జెడ్ పిహెచ్‌ఎస్ గణపవరం విద్యార్థిని ఎంపిక

### - హర్షం వ్యక్తం చేసిన ఉపాధ్యాయ బృందం



**త్రిపురాంతకం, డిసెంబర్ 13, ప్రభాతవార్త**

ఈ నెల 12వ తేదిన జిల్లా స్థాయి ఖోఖో సెలెక్షన్స్ 44వ బాలికల మరియు మహిళల ఖోఖో పోటీలు ప్రకాశం జిల్లా ఖోఖో అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో చీమకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగినవి. ఈ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణపవరంలో 9వ తరగతి చదువుతున్న తిరుపతి శాంతి మంచి ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనది. ఈ రాష్ట్ర స్థాయి పోటీలు ప్రకాశం జిల్లాలో ఈనెల 19,20,21వ తేదీలలో జరుగనున్నాయి. రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు పాఠశాల విద్యార్థిని ఎంపికపట్ల ప్రధానోపాధ్యాయులు జె ఆనందరావు శనివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. స్టాఫ్ రఘురామ్ రెడ్డి, లింకన్, బాల వెంకట కుమార్, బాల శేషు కుమారి, బాల కోటయ్య, నాగభూషణం, మరియబాబు, ప్రసాద్ రావు, సుభాని మరియు పాఠశాల ఎస్ఎంఎస్ చైర్మన్, తల్లితండ్రులు, గ్రామస్తులు మరియు పాఠశాల పీడీ దొండపాటి బాలరాజు విద్యార్థినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు పాల్గొని శాంతిని అభినందించి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## మార్కాపురంలో ఘనంగా శ్రీశ్రీ శ్రీ ఈశ్వరమ్మ ఆరాధన మహోత్సవం



**మార్కాపురం, డిసెంబరు 13, ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణంలోని పూల సుబ్బయ్య వీధిలో శనివారం శ్రీశ్రీశ్రీ ఈశ్వరమ్మ ఆరాధన మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కీర్తిశేషులు రాగుల్ల సుబ్బయ్య గురువు గారి కృషితో నిర్మించబడిన ఈ ఆలయంలో గత 30 సంవత్సరాలుగా ఎంతో వైభవంగా ఈశ్వరమ్మ ఆరాధన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. లోక కళ్యాణి జగన్మాత తనను శరణు కోరిన భక్తుల కోర్కెలను తీర్చి, కష్టాలను దూరం చేస్తుందని భక్తుల విశ్వాసమని పేర్కొన్నారు. ప్రతీ సంవత్సరం స్వస్తిశ్రీ చంద్రమాన, శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, మార్గశిర బహుళ నవమి నాడు ఈ ఆరాధన కార్యక్రమం నిర్వహిస్తామని నిర్వాహకులు మద్దికట్ల పెద్ద పుల్లయ్య తెలిపారు. భక్తుల సహకారంతో స్వామివారికి విశేష పూజలు నిర్వహించి, వేలాది మంది భక్తులకు అన్నదాన వితరణ చేశామని చెప్పారు. ఈ పూజా కార్యక్రమానికి ఉభయదాతలుగా మద్దికట్ల పెద్ద పుల్లయ్య, విజయలక్ష్మి, బాల బ్రహ్మాచారి, జయసుధ పాల్గొన్నారు. అర్చకులు పవన్ శర్మ నేతృత్వంలో పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించగా, కార్యక్రమానికి వేలాది మంది భక్తులు హాజరై ఆధ్యాత్మిక వాతావరణంలో పాల్గొన్నారు.

## వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి రైతుల కష్టాలు తీరుస్తాం

### - ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



**మార్కాపురం, డిసెంబర్ 13, ప్రభాతవార్త**

త్వరలోనే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందిస్తామని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి హామీ ఇచ్చారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా శనివారం మార్కాపురం మండలంలోని నాయుడుపల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత వైసీపీ పాలకులు నూతన జిల్లాల పునర్విభజనలో ప్రకాశం పశ్చిమ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. మార్కాపురం జిల్లాకోసం అప్పట్లో 63 రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు, నిరాహార దీక్షలు నిర్వహించామని, చివరకు పోలీసులను అడ్డుపెట్టి తమను అరెస్టు చేశారని గుర్తు చేశారు. అయితే, మార్కాపురంలో తన పుట్టినరోజు వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు నూతన మార్కాపురం జిల్లాను ప్రకటించారని, ఇందుకు ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేశామని అబద్ధాలు చెబుతూ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. వచ్చే ఏడాదిలోపు మార్కాపురం ప్రాంతానికి వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేసి సాగునీరు అందిస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా కొనకనమిట్ల మండలంలో సుమారు రూ.3వేల కోట్ల వ్యయంతో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం జరుగుతుందని, దీని ద్వారా వందలాది మందికి ఉపాధి లభించనుందని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం కింద నియోజకవర్గంలో 32,965 మంది రైతులకు సుమారు రూ.65.95 కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. ఇటీవల సంభవించిన తుఫాన్ సమయంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా కాపాడగలిగామని అన్నారు. అయితే వైసీపీ నాయకులు ప్రజలు తుఫాన్‌తో ఇబ్బందులు పడుతున్న సమయంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పేరుతో సంతకాల సేకరణ చేపట్టడం దురదృష్టకరమని విమర్శించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో భాగంగా రూ.9.75 లక్షల కోట్ల పెట్టుబడులతో సుమారు 4.70 లక్షల ఉద్యోగాలు ఇప్పటికే కల్పించినట్లు తెలిపారు. రైతులు పంట మార్పిడి విధానాలు అనుసరించి వ్యవసాయం చేయాలని, తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించాలని సూచించారు. అనంతరం మార్కాపురం జిల్లా ప్రకటించినందుకు కృతజ్ఞతగా తెలుగుదేశం పార్టీ నాయకులు, రైతులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

## జార్జ్ ఫార్మసీ కళాశాలలో ముగిసిన ఫార్మా క్వెస్ట్ 2025 కార్యక్రమం



**మార్కాపురం, డిసెంబరు 13, ప్రభాతవార్త**

జార్జ్ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన ఫార్మా క్వెస్ట్ 2025 కార్యక్రమం రెండవ రోజు శనివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన వాలెడిక్టరీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డా అడిమలపు సతీష్, డా స్టెల్లా సెలినా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ సాంకేతిక పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథులు బహుమతులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇలాంటి సాంకేతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, ఆత్మవిశ్వాసం, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా డి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ ఫార్మా క్వెస్ట్ వంటి కార్యక్రమాలు విద్యతో పాటు విద్యార్థుల్లో సృజనాత్మకత,నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉత్తమ ఫార్మసీ నిపుణులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, కళా ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసినట్లు సభికులు ప్రశంసించారు. ఈ విధంగా ఫార్మా క్వెస్ట్ 2025 కార్యక్రమం విద్యా, సాంకేతిక, సాంస్కృతిక కార్యక్రమాల సమ్మేళనంగా విజయవంతంగా ముగిసింది.

## నేడు దీక్షదారుల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొననున్న ఎమ్మెల్యే ముత్తుముల

**రాచర్ల, డిసెంబర్ 13, ప్రభాతవార్త**

అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమంలో నేడు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొననున్నారని, అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ శనివారం తెలిపింది. అయ్యప్ప స్వాములు వారి కుటుంబ సభ్యులు మండల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు. ఇరుముడి అనంతరం అనుమలవీడు తెలుగుదేశం పార్టీ నాయకుడు అంబవరం శ్రీనివాస్ రెడ్డి సహకారంతో స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. 40 రోజుల దీక్ష సహకరించిన దాతలు అందరికీ కమిటీ సభ్యులు పి సుధీర్ కుమార్ రెడ్డి, కె కృష్ణ వై రంగస్వామి, ఎం బాలకృష్ణ, ఎన్ సింగయ్య, వి వీరాచారి, కనకాచారి, టి శ్రీరాములు, ఆర్ కొండయ్య, సిహెచ్ రమణలు కృతజ్ఞతలు తెలిపారు.

## అన్నా రాంబాబును మర్యాదపూర్వకంగా కలిసిన షంషేర్ అలీ బేగ్



**మార్కాపురం, డిసెంబరు 13, ప్రభాతవార్త**

రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సెక్రటరీగా షంషేర్ అలీ బేగ్ నియమితులైన సందర్భంగా, ఆయన మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్‌ఛార్జ్ అన్నా రాంబాబు ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి అన్నా రాంబాబు చేసిన సేవలను గుర్తిస్తూ ఆయన నాయకత్వం, నిరంతర కృషి, కార్యకర్తల పట్ల చూపే నిబద్ధత ప్రతి ఒక్కరికీ ఆదర్శమని షంషేర్ అలీ బేగ్ ప్రశంసించారు. అలాగే తనపై చూపిన నమ్మకం, ప్రోత్సాహానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అన్నా రాంబాబు మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేసి పార్టీ లక్ష్యాలను సాధించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**రాచర్ల, డిసెంబర్ 13, ప్రభాతవార్త**

విద్యుత్ మరమ్మతుల కారణంగా మండలంలోని జెపి చెరువు 33/ 11 విద్యుత్ సబ్ స్టేషన్‌లోని గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని రాచర్ల విద్యుత్ శాఖ ఏఈ బాల గురువయ్య తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల కారణంగా ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు సరఫరా ఆపివేస్తున్నామని వినియోగదారులు ప్రజలు సహకరించాలని ఆయన తెలిపారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**వెలిగండ్ల, డిసెంబర్ 13, ప్రభాతవార్త**

మండలంలోని మొగళ్లూరులో షేక్ సుభాని కుమారుడు మొగుళ్లూరు 58వ బూత్ కన్వీనర్ షేక్ సంధాని భాష తమ్ముడు షేక్ షరీఫ్ రేగులచిలక వీఆర్వో వివాహ వేడుకల్లో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, మాజీ మండల తెలుగు యువత అధ్యక్షులు కర్నాటి భాస్కర్‌రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యులు షేక్ షరీఫ్, షేక్ మౌలానా ఆజాద్, మండల మైనార్టీ సెల్ షేక్ మజహార్, నాయుడు నాయకులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష



**మార్కాపురం, డిసెంబరు 13, ప్రభాతవార్త**

జవహర్ నవోదయ విద్యాలయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష మార్కాపురం కేంద్రంగా మొత్తం 5 పరీక్ష కేంద్రాల్లో చక్కటి వసతులు, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించబడింది. పరీక్ష కేంద్రాల వారీగా విద్యార్థుల హాజరు వివరాలు ఈ విధంగా ఉన్నాయి: జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాల : 240 మందికి గాను 143 మంది, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల 240 మందికి గాను 129 మంది, రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 240 మందికి గాను 130 మంది, ఏపీ సోషల్ వెల్ఫేర్ పాఠశాల 240 మందికి గాను 133 మంది, సెయింట్ ఆన్స్ పాఠశాల 196 మందికి గాను 111 మంది హాజరయ్యారు. ఆయా పరీక్ష కేంద్రాలకు చీఫ్‌లుగా మునగాల చంద్రశేఖర్ రెడ్డి, వి శ్రీదేవి, టి రామకృష్ణ, పివి రమణ, ఎస్ నాగేశ్వరరావు వ్యవహరించారు. సెంటర్ లెవెల్ ఆఫీసర్లుగా ఎస్ వేణు, స్వాతి, డి రామారావు, జె నాగయ్య, ఏ ప్రభాకర్ రెడ్డి విధులు నిర్వర్తించారు.

## యడవల్లి బాలుర వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపిడిఓ వెంకటరామిరెడ్డి

**రాచర్ల, డిసెంబర్ 13 ,ప్రభాతవార్త**

మండలంలోని యడవల్లి బిసి బాలుర వసతి గృహాన్ని శుక్రవారం రాత్రి మండల ఎంపిడిఓ ఎస్ వెంకట రామిరెడ్డి, రాచర్ల ఎస్సై పి కోటేశ్వరరావుతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు వసతిగృహ సంక్షేమాధికారి కొండయ్యతో మాట్లాడుతూ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులపై హాస్టల్ సంక్షేమ అధికారుల పర్యవేక్షణ నిత్యం ఉండాలని సూచించారు. వసతి గృహంలో ఉన్న విద్యార్థుల వివరాలు వారికి అందించే భోజనం మౌలిక వసతులు తదితర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ గదులు, పరిసరాలు, లెట్రిన్, బాత్రూములు పరిశీలించి తగు సూచనలు చేశారు. విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణ కల్పిస్తున్న వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డికి జగనన్న పరామర్శ

**గిద్దలూరు, డిసెంబరు 13, ప్రభాతవార్త**

గిద్దలూరు వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పరామర్శించారు. ప్రవీణ్ కుమార్ రెడ్డి తండ్రి మాజీ ఎమ్మెల్యే పిడతల రామాభూపాల్ రెడ్డి అనారోగ్యంతో ఈనెల 11వ తేదీన మృతి చెందారు. రామ భూపాల్ రెడ్డి మృతిపై విచారం వ్యక్తం చేస్తూ పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డిని వారి కుటుంబ సభ్యులను ఫోను ద్వారా మాజీ సీఎం జగనన్న పరామర్శించి సానుభూతి తెలిపారు.

## ప్రశాంతంగా ముగిసిన నవోదయ ప్రవేశ పరీక్ష



**కంభం, డిసెంబరు 13, ప్రభాతవార్త**

జవహర్ నవోదయ విద్యాలయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష విజయవంతంగా నిర్వహించబడింది. కంభంలో శనివారం జరిగిన నవోదయ పరీక్షలకు మొత్తం 638 మంది విద్యార్థులకుగాను 282మంది గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి అబ్దుల్ సత్తార్ తెలిపారు.కంభంలో జరిగిన పరీక్షలకు కంభం ప్రభుత్వం ఉన్నత పాఠశాల,కంభం బాలికోన్నత పాఠశాల, బాలికల గురుకుల పాఠశాలల్లో సెంటర్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ మూడు సెంటర్లలో 638 మంది విద్యార్థులకు గాను 356 మంది విద్యార్థులు హాజరయ్యారని, 282 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షా సెంటర్ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కంభం ఎస్ఐ నరసింహారావు బందోబస్తు నిర్వహించారు.

## మండల అభివృద్ధికి సహకరించండి అధికారులు సమన్వయంతో పని చేయాలి

### - ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు



**తాళ్లూరు,డిసెంబర్ 13,ప్రభాతవార్త**

తాళ్లూరు మండల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు కోరారు.శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షతన ఎంపీడీవో పి.అజిత ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో మండల,గ్రామాలాభివృద్ధికి కృషి చేయాలన్నారు. గ్రామాలాభివృద్ధికి అధికారులు పని చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, దర్శి నియోజకవర్గం టీడీపీ ఇన్ ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ కి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రజా ప్రతినిధులు సభలో ప్రస్తావించిన సమస్యలను మరలా జరగబోయే సమావేశం నాటికి పరిష్కరించాలన్నారు.తూర్పు గంగవరంలో కోతుల సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.జడ్పీటీసీ మారం వెంకట రెడ్డి మాట్లాడుతూ సభ దృష్టికి వచ్చిన సమస్యలను మళ్లీ జరిగే సభ నాటికి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు అప్పటికప్పుడు కాకుండా ముందుగా సమాచారం ఇవ్వాలన్నారు.వైస్ ఎంపీపీ ఐ వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య సమస్యలు లేకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు. ఎంపీడీఓ అజిత మాట్లాడుతూ సభలో ప్రజా ప్రతినిధులు మాత్రమే సభకు హాజరవ్వడంపై హర్షవ్యక్తం చేశారు.అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రోటోకాల్ పాటించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలని పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్ లను ఆదేశించారు. మన్నేపల్లిసొసైటీ చైర్మన్ గొంది రమణారెడ్డి మాట్లాడుతూ మన్నే పల్లి గ్రామం లో టీడీపీ సానుభూతిపరులు ఉన్న కాలనీలలో విద్యుత్ లైట్లు వేయడం లేదని సభ లో ప్రస్తావించారు.అలాగే యూరియా కొరత లేకుండా నిరంతరాయంగా రైతులకు అందిస్తున్నామన్నారు.లింగాలపాడు నుంచి తురకపాలెం వరకు రోడ్డు మంజూరు చేయించాలన్నారు. నాగంబొట్ల పాలెం సొసైటీ చైర్మన్ సుబ్బయ్య మాట్లాడుతూ తూర్పు గంగవరంలో కోతుల సమస్య అధికంగా ఉందని అధికారులు పట్టించుకోవడంలేదని సభ లో ప్రస్తావించారు. రాష్ట్ర నాటక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిరెడ్డి ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ తురకపాలెంలో పంచాయతీరాజ్ శాఖ చెందిన సిమెంట్ బస్తాలను ఎందుకు రెక్కువరి చేయలేదని అధికారులను ప్రశ్నించారు.వితలాపురం సర్పంచ్ ఇంద్రసేనారెడ్డి యూరియాను ఒకరికి ఎక్కువ మరొకరు తక్కువ కాకుండా అందరికీ సమానంగా పంపిణీ చేయాలని కోరారు.పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదిక చదివి వినిపించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఫణీంద్ర, మండల అధికారులు, సర్పంచ్ లు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## పెద్దదోర్నాలలో భక్తిశ్రద్ధలతో ఘనంగా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధనోత్సవం



**పెద్దదోర్నాల, డిసెంబర్ 13, ప్రభాతవార్త**

పెద్దదోర్నాలమండలకేంద్రంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి, జగన్మాత శ్రీ ఈశ్వరిదేవి 236 వ ఆరాధన మహోత్సవం శనివారం శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవాలయంలో అర్చకులు మునగంటి మల్లిఖార్జున చార్యులు మంత్రోచ్చరణల మధ్య భక్తిశ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు ,అభిషేకాలు నిర్వహించి స్వామివార్లను పూలమాలతో అలంకరించి సుప్రభాతము,గణపతి పూజ,పుణ్య హవచనం, మండపారాధన, అమ్మవారి కుంకుమార్చనలు మంత్ర పుష్ప నీరాజనాలు అర్పించారు ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి సమాజానికి మార్గదర్శకమని, సద్గుణాలు అలవర్చుకోవాలని సూచిస్తున్నాయన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## రామగోపాలపురంలో గోకులం షెడ్డుకు శంకుస్థాపన చేసిన నాయకులు



**వెలిగండ్ల, డిసెంబర్ 13, ప్రభాతవార్త**

వెలిగండ్ల మండలం రామగోపాలపురం గ్రామంలో గోకులం షెడ్ శంకుస్థాపన కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ బీరం వెంకటేశ్వరరెడ్డి మండల టీడీపీ అధ్యక్షుడు ఇంద్రభూపాల్‌రెడ్డి మాజీ మండల టీడీపీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, మండల టీడీపీ తెలుగు యువత అధ్యక్షులు బొబ్బా రమణారెడ్డి,మండల క్లస్టర్ ఇన్‌చార్జి మినిగా కాశయ్య, గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## గోవింద స్వాములు ఆధ్వర్యంలో వైభవంగా అభిషేకం, పుష్పయాగం కార్యక్రమాలు



**కనిగిరి, డిసెంబర్ 13, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలో కొలువైయున్న శ్రీదేవి- భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం శనివారం గోవింద స్వాములు కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామి వారికి నిర్వహించిన అభిషేక కార్యక్రమాన్ని ఉభయ దాతలు తాళ్లూరి మహేష్, అరుణ దంపతులు వైభవంగా జరిపించారు. అనంతరం పుష్పయాగాన్ని గోనుగుంట పవన్ కుమార్,లక్ష్మీ కుమారి దంపతులు భక్తితో నిర్వహించారు. ఈ కార్యక్రమాలు గోవింద స్వాముల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా సాగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## వైభవంగా శ్రీ రంగనాయక స్వామివారి కల్యాణం



**రాచర్ల, డిసెంబర్ 13 ,ప్రభాతవార్త**

మండలంలోని జేపీ చెరువు అటవీ ప్రాంతంలో వెలసియున్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి వారి మాస కల్యాణం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణంలో ఉభయ దాతలుగా 6 మంది జంటలు పాల్గొన్నారు. వందలాది మంది భక్తులు వీక్షిస్తుండగా ఆలయ పూజారులు శ్రీ స్వామి వారి కళ్యాణాన్ని వేదమంత్రాల నడుమ జరిపించారు. ప్రత్యేక పూజలు సందర్భంగా మార్కాపురం తహసిల్దార్ చిరంజీవి, కాణిపాకం ఏఈఓ బాల రంగయ్యలు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ప్రత్యేక పూజలు, మాస కళ్యాణం సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు ఆలయ ఈవో మల్లవరపు నాగయ్య భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఆలయంలోని కాపు బలిజ, గోపాలకృష్ణ యాదవ సత్రాల్లో భక్తులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆయా సత్రాల నిర్వాహకులు తెలిపారు.

## రాజరాజేశ్వరి దేవి చండీ హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు, డిసెంబరు 13, ప్రభాతవార్త**

గిద్దలూరు పట్టణంలోని రేడియో బావి సెంటర్ వద్ద ఉన్న శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి నిర్వహించిన చండీహోమంలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. భవానీ దీక్షదారుల ఇరుముడి సందర్భంగా డిసెంబర్ 15వ తేదీ సోమవారం నుంచి మూడు రోజులపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి చండీహోమంలో పూర్ణాహుతిని సమర్పించారు. అనంతరం శ్రీ అభయ ఆంజనేయస్వామి వారి దర్శనం చేసుకుని ఆశీర్వాదాలు పొందారు. కార్యక్రమంలో పాల్గొన్న వేద పండితులు ఎమ్మెల్యేను ఆశీర్వదించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## అధ్వాన్నంగా స్టేషన్‌పల్లి పోలేరమ్మ గుడి రహదారి



**కొనకనమిట్ల, డిసెంబర్ 13, ప్రభాతవార్త**

కొనకనమిట్ల స్టేషన్ పల్లి పోలేరమ్మ ఆలయం ముందు సిమెంట్ రహదారికి ఇరువైపులా సైడు కాలువలు లేకపోవడంతో ఎక్కడ వృధా నీరు అక్కడే నిల్వ ఉండి అధ్వాన్నంగా మారింది. ఆలయ సమీపంలో వృధా నీరు నిల్వ ఉండి మురికి కూపంగా తయారైంది. దీంతో దోమలు వ్యాప్తి పెరిగిందని సమీప నివాస ప్రాంతాల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిమెంట్ రోడ్డు అయితే ఏర్పాటు చేశారే తప్ప సైడు కాలువలు లేకపోవడంతో కొద్దిపాటి వర్షం కురిసిన పారెందుకు వీలు లేక ఎక్కడి నీరు అక్కడే ఉండి పోతుందని అంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మురుగు, వృధా నీరు పోయే వీలుగా సైడు కాలువలు ఏర్పాటు చేయాలని అభ్యర్థిస్తున్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### - ఏఐటీయుసీ నాయకులు కాశీం పీరా



**కొనకనమిట్ల, డిసెంబర్ 13, ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కనిగిరి పట్టణ ఏఐటీయుసీ కార్యదర్శి కాశీం పీరా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక గుజ్జుల యల్లమందారెడ్డి స్మారక భవనంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు పుల్లమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. నెల నెల జీతాలు అందించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు.త్వరలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలు జరుగుతాయన్నారు.సభ్యత్వ నమోదును పూర్తి చేయాలన్నారు. సీపీఐ మండల కార్యదర్శి కే.కోటేశ్వరరావు మాట్లాడుతూ లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొన్నారు.

## రఫీని అభినందించిన పామూరు పట్టణ ప్రముఖులు

### - షేక్ షంషూర్, కోడిగుంపల నాయబ్ రసూల్, తడికమల్ల సుబ్బారావు






**పామూరు, డిసెంబర్ 13, ప్రభాతవార్త**

పామూరు ప్రతిభ స్కూల్ నందు శనివారం నిర్వహించిన సన్మాన సభ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పామూరు పట్టణ ప్రముఖ పారిశ్రామికవేత్త షేక్ షంషూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో రఫీ చేసిన సేవలను గుర్తించి దక్షిణ భారతదేశ హ్యూమన్ రైట్స్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా వారికి ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ప్రతి విద్యార్థి వారిని ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో చదువులో ప్రతిభావంతులుగా క్రీడల్లో రాణిస్తూ సేవలో ఒక మదర్ థెరిసా ను ఆదర్శంగా తీసుకుని మనం కూడా సేవా కార్యక్రమాలు చేస్తూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షేక్ షంషూర్, కోడిగుంపల నాయబ్ రసూల్, తడికమల్ల సుబ్బారావు, మోబిన మౌలాలి, ఆర్‌ఆర్ రఫీ, బత్తుల సత్యం, షేక్ షాకీబ్, పత్తు మస్తాన్, హజరత్, అధ్యాపక బృందం వారిని దుశ్శాలువాతో పూలమాలతో ఘనంగా సన్మానం చేసి అభినందించారు.

## ఘనంగా భారతీయ భాషా ఉత్సవ్ కార్యక్రమం



**హనుమంతునిపాడు, డిసెంబర్ 13, ప్రభాతవార్త**

హనుమంతునిపాడు మండలంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మహమ్మదాపురం నందు శనివారం భారతీయ భాషా ఉత్సవ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ కవి, స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త, సుబ్రహ్మణ్య భారతి జన్మదినోత్సవం సందర్భంగా పాఠశాలలో భాషా మేళ ఉత్సవం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ సుబ్రహ్మణ్య భారతి జీవిత చరిత్రను స్వాతంత్ర్య పోరాటంను, సంఘసేవను విద్యార్థులకు వివరించి చెప్పారు. పాఠశాలలో వకృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం వంటి పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, భారతీయ సంస్కృతి వస్త్రధారణ చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను పొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కనిగిరి సబ్ జైలు నిర్మాణం పూర్తి చేయాలి

**- జైళ్ల శాఖ డీఐజీకి లేఖ రాసిన మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్**



**కనిగిరి, డిసెంబర్ 13,ప్రభాతవార్త**

కనిగిరి సబ్ జైలు నిర్మాణ పనులు తక్షణమే పూర్తి చేయుటకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ జైళ్ల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. శనివారం అసంపూర్ణంగా నిర్మించబడిన సబ్ జైలును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరిలోని సబ్ జైలు అత్యంత పురాతన భవనంగా ఉండి శిధిలావస్థకు చేరుకోవడంతో అప్పటి ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని తెలిపారు. అయితే నిధుల కొరత కారణంగా కొంత వరకే నిర్మాణం పూర్తయ్యి మిగిలిన పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. కనిగిరి కోర్టు చారిత్రక ప్రాధాన్యత కలిగి ఉన్నప్పటికి, సబ్ జైలు వినియోగంలో లేకపోవడం వల్ల కక్షిదారులు, పోలీసు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రస్తుతం రిమాండ్ ఖైదీలను దర్శి, ఒంగోలు జైలుకు తరలించాల్సి వస్తోందని, బెయిల్ మంజూరైన విడుదల ఆలస్యం కావడంతో ఖైదీలు ఒక రోజు అదనంగా జైల్లో ఉండాల్సి ఉందని వివరించారు. సబ్ జైలు నిర్మాణం పూర్తై వినియోగంలోకి వస్తే పోలీసు శాఖతో పాటు రిమాండ్ ఖైదీలకు ఎంతో ఉపశమనంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమస్యను గతంలో పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నిధులు మంజూరు చేసి సబ్ జైలును పూర్తి చేయాలని తెలిపారు.

## అటల్ బిహారి వాజ్‌పేయి విగ్రహ ఆవిష్కరణకు ఎమ్మెల్యే ఉగ్రకు ఆహ్వానం

**- కనిగిరిలో గోడపత్రిక ఆవిష్కరణలో కూటమి నేతలు**



**కనిగిరి, డిసెంబర్ 13, ప్రభాతవార్త**

భారతరత్న, మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి విగ్రహ ఆవిష్కరణ ఈ నెల 15వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు ఒంగోలులో నిర్వహించనున్న కార్యక్రమానికి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి బీజేపీ నాయకులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనంతరం అమరావతి మైదానంలో కూటమి నాయకులతో కలిసి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు ఫిరోజ్, ఒంగోలు టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తమ్మినేని వెంకటరెడ్డి, టౌన్ యువత అధ్యక్షులు అచ్చాల రవి పాల్గొన్నారు. అలాగే బీజేపీ నాయకులు నరాల శ్రీనివాసులురెడ్డి, సీనియర్ నేతలు కొండిశెట్టి వెంకటరమణయ్య,మస్తానయ్య, నారాయణరెడ్డి, గొట్టిముక్కల నరసింహులు, మల్లెల గోమ్స్ తదితరులు హాజరయ్యారు.

## అంకయ్యను పరామర్శించిన వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దద్దాల



**కనిగిరి, డిసెంబర్ 13, ప్రభాతవార్త**

కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కనిగిరి మండలం గురవాజీపేట గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కుమ్మరికుంట రవి తండ్రి కుమ్మరికుంట అంకయ్యను కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా అంకయ్య ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న ఆయన, కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పాఉ. అంకయ్య త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మడతల కస్తూరిరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, చిలకల మాలకొండారెడ్డి, పలుకూరి భాస్కర్, పాపబత్తిన నాగేశ్వరరావు, బలసాని యోహోషువ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఆర్‌అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**చీరాల, డిసెంబర్ 13, ప్రభాతవార్త**

ఎన్‌ఆర్ అండ్ పీఎం హైస్కూల్ గ్రౌండ్ నందు 2026 సంవత్సరానికి ఎన్‌ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. పోలుదాసు రామకృష్ణ ప్రెసిడెంట్‌గా, వైస్ ప్రెసిడెంట్‌గా గొడవర్తి సుధాకరరావు, చుండూరి శ్రీనివాసరావు, సెక్రటరీగా చారగుళ్ళ గురుప్రసాద్, జాయింట్ సెక్రటరీలుగా శ్రీరాం చెంగలరాయుడు, గెల్లి తుకారాం, కోశాధికారిగా గ్రంధి నారాయణమూర్తి, జాలీ వాకర్‌గా గుర్రం బదిరినాథ్,15 మంది కార్యవర్గ సభ్యులుగా, గౌరవ సలహాదారులుగా ఏ.నాగవీరభద్రాచారి, శ్రీరాం రమేష్, వలివేటి మురళీకృష్ణ, దోగుపర్తి వెంకట సురేష్‌లను నియమించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీసీహెచ్ నాగేశ్వరరావు, శివాంజనేయప్రసాద్, కే.వీరాంజనేయులు, లయన్ మద్దు వెంకట సుబ్బారావు, వల్లెపు శ్రీనివాసరావు, మధు, వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు సెమీ క్రిస్మస్ వేడుకలలో పాల్గొననున్న మంత్రి



**అద్దంకి, డిసెంబరు 13, ప్రభాతవార్త**

రాష్ట్ర విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ అదివారం అద్దంకి పట్టణంలోని 18వ వార్డు కట్టకిందపాలెం సెంటనరీ తెలుగు బాప్టిష్టు చర్చిలో నిర్వహించే గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకకలో పాల్గొంటారని ఆయన కార్యాలయ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. ఈవేడుకలు ఉదయం 11.30గంటలకు జరుగుతాయి.

# బస్సుయాత్రను జయప్రదం చేయాలి



**అద్దంకి , డిసెంబరు 13,ప్రభాతవార్త**

భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పెయి శతజయంతి కార్యక్రమంలో భాగంగా అటల్-మోదీ సుపరిపాలన యాత్ర రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఈనెల 11న ప్రారంభించారు. ఈయాత్ర 25వ తేది వరకు జరగనున్నదని, ఈనెల 16న బస్సుయాత్ర బాపట్లకు చేరుకుంటుదని, పర్చూరు శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ సందర్భంగా బస్సుయాత్ర పోస్టర్‌ను బిజెపి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ యాత్రను జయప్రదం చేయాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు సూచించారు. పోస్టర్ అవిష్కరణలో జె.యలమందరావు, కాలేషాబాబు విరాట్, సుబ్రమణ్యం, కె.శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వర్లు,కె.నాగరాజు, యన్ గిరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

## కెఆర్‌కె డిగ్రీకళాశాల గెస్ట్ లెక్చరర్ల్ ధరఖాస్తులు ఆహ్వానం

**అద్దంకి, డిసెంబరు 13,ప్రభాతవార్త**

కెఆర్ డిగ్రీ కళాశాలలో గణితశాస్త్ర సబ్జక్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి.మోహనరావు ఒక ప్రకటనలో కోరారు. అర్హులైనవారు ఈనెల 17వ తేది కళాశాలలో ఉదయం 10.30గంటలకు జరిగే ఇంటర్వ్యుకు హజరు కావాలని కోరారు.

# మెగా లోక్ అదాలత్‌లో 1368 కేసులు పరిష్కారం



**అద్దంకి, డిసెంబరు 13,ప్రభాతవార్త**

అద్దంకి కోర్టు భవనాల సముదాయంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 1368 కేసులను పరిష్కరించారు. 1,12,09,706విలువ కలిగిన కేసులు పరిష్కారం అయ్యాయి. వీటిలో సివిల్ 24, క్రిమినల్ 108, చెక్ బౌన్స్ 10, గృహహింస 1, ఎక్స్‌యిజ్ 77, మనోవర్తి 3, పెట్టికేసులు 1145 కేసులు పరిష్కారం అయ్యాయి. ఈలోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి డి.నాగలక్ష్మి, ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి జె.శ్రీసీత, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి. అఖిల లు పాల్గొన్నారు. వీరితోపాటు బార్ ఆసోసియేషన్ అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, లోక్ అదాలత్ బెంచ్ సభ్యులు ఎన్. హరిబాబు, అనుషా, సంజీవబాబు, ఎన్‌ఎం సత్యవతి, హైగ్రీవచారి, ఎన్.వి.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాకాని అశోక్ పుట్టిన రోజు వేడుకలు

- బదిరుల పాఠశాలలో అన్నదానం
- కమరేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు
- కాకానిపాలెంలో కేక్ కటింగ్
- పెద్దఎత్తున పాల్గొన్న పార్టీ శ్రేణులు, మిత్రులు









**అద్దంకి, డిసెంబరు 13,ప్రభాతవార్త**

అద్దంకి పట్టణ క్లష్టర్ ఇన్‌చార్జి, టిడిపి సీనియర్ నాయకులు కాకాని అశోక్ పుట్టిన రోజు వేడుకలు శనివారం అద్దంకిలో ఘనంగా నిర్వహించారు.స్ధానిక బదిరుల పాఠశాలలో కాకాని అశోక్‌ను బదిరుల విద్యార్థులమధ్య పాఠశాల యాజమాన్యంఘనంగా సత్కరించింది. అనంతరం కేక్ కట్‌చేసి చిన్నారులకు పంపిణీచేశారు. బదిరులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కమరేశ్వరస్వామి ఆలయంలో టింబర్ అండ్ కార్పెంటర్స్,విశ్వబ్రహ్మణ సంఘంల ఆధ్వర్యంలోఅశోక్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలలో ఆయా సంఘాల నేతలుతోపాటు కాకాని అశోక్ పాల్గొనగా పూజారులు ఆయనను అశ్వీరచనాలు, శేషవస్త్రాలతో సత్కరించి, తీర్ధ ప్రసాదాలను అందజేశారు. కాకానిపాలెంలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద టిడిపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాకాని అశోక్‌చే కేక్ కట్‌చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణంలోని పలువురు టిడిపి నాయకులు,కార్యకర్తలు, అభిమానులు,మిత్రులు, పాల్గొన్ని అశోక్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

## అద్దంకిలో ఘనంగా ఈశ్వరీదేవి ఆరాధన మహోత్సవం





**అద్దంకి, డిసెంబరు 13, ప్రభాతవార్త**

కాకానిపాలెంలోని శ్రీ వీరబ్రహేంద్రస్వామి ఆలయంలో ఆయన మనుమరాలు ఈశ్వరీ మహాదేవి ఆరాధన మహోత్సవ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. 236వ ఆరాధన ఉత్సవాలుకు బాపట్ల జిల్లా బిజెపి ఓబిసి సెల్ అధ్యక్షులు గాలం ప్రభాకర్ ప్రసాదాలను సమకూర్చారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌ను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ డి.నాగేశ్వరరావు,ఎన్.నాగరాజు,చెన్నుపల్లిశ్రీనివాసాచారి,పొన్నపల్లి బ్రహ్మనందం,ఏలూరి వీరబ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

## అద్దంకిలో జిల్లా స్ధాయి బాల్‌బ్యాట్మింటన్ పోటీలు ప్రారంభం



**అద్దంకి, డిసెంబరు 13, ప్రభాతవార్త**

క్రిస్మస్ సందర్భంగా స్ధానిక ఎన్‌ఎస్‌పి కాలనీలో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్ధాయిలో బాల్‌బ్యాట్మింటన్ పోటీలు శనివారం ప్రారంభమైయ్యాయి. ఈ పోటీలను ఎన్‌ఎస్‌పి ఈఈ సతీష్ ప్రారంభించారు. గద్దల్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. అదివారం బహుమతి ప్రధానం వుంటుందని ఆ ప్రకటనలో తెలిపారు.

# ఘనంగా విక్టరీ వెంకటేష్ జన్మదిన వేడుకలు



**చీరాల టౌన్, డిసెంబర్ 13, ప్రభాతవార్త**

చీరాల సురేష్ మహల్‌లో హీరో విక్టరీ వెంకటేష్ జన్మదిన వేడుకలను చీరాల వెంకటేష్ అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ వెంకటేశ్వరావుతో కలిసి అభిమానులు కేక్ కట్ చేసి హీరో వెంకటేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటరావు, మూర్తి, భాను, కోటి, అనిల్, లాజర్‌తో పాటు సురేష్ మహల్ సిబ్బంది పాల్గొన్నాఉ. అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై నినాదాలతో సంబరాలతో కార్యక్రమాన్ని మరింత ఉత్సాహంగా మార్చారు. అభిమానుల అభిమానాన్ని చాటేలా నిర్వహించిన ఈ వేడుకలు సురేష్ మహల్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# నిరుపేదల ఆరోగ్యానికి అండగా నేనున్నా

**- ఎమ్మెల్యే మద్దులూరి**



**వేటపాలెం, డిసెంబర్ 13, ప్రభాతవార్త**

చీరాల నియోజకవర్గ శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య నిరుపేద ప్రజలను గుర్తించి వారి ఆరోగ్య విషయాల్లో తలెత్తుతున్న సమస్యలకు పరిష్కార దిశగా ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సహాయ సహకారాలతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా తన వంతు బాధ్యతగా తీసుకొని ఎంతో మందికి సహాయ సహకారాలు అందిస్తున్న నేపధ్యంలో వేటపాలెం మండలం దేశాయిపేట గ్రామ పంచాయతీ శాంతి నగర్‌కు చెందిన దేశాయిపేట మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు నిమ్మని వెంకట పిచ్చయ్యకి ఎల్ఓసీ రూపాన రూ.6లక్షలను అందించి వారి అనారోగ్య విషయంలో తోడ్పాటు అందించడం జరిగింది. ఆపరేషన్ అనంతరం ఇంటికి వచ్చిన పిచ్చయ్యని నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దులూరి స్వయంగా వెళ్లి పరామర్శించారు. పిచ్చయ్య యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పేదలకు తమ సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# ప్రసన్నాంజనేయస్వామి ఆలయానికి దాతల విరాళాలు









**అద్దంకి, డిసెంబరు 13,ప్రభాతవార్త**

ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయానికి ఒంగోలుకు చెందిన ఆలా వెంకటరావు ధర్మపత్ని కల్పన కుమార్ హరిచందనలు 70వేలు విలువకలిగిన ఇత్తడి హుండీని పాలకమండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకర్‌రావుకు అందజేశారు. అరిగ వెంకటేశ్వర్లు జ్ఞాపార్ధం కుమార్ శ్రీదేవి నిత్య అన్నదాన పధకానికి 10,116 చెక్కును అందజేశారు. రిటైర్డు టీచర్ నగర్ల వెంకట రామయ్య ధర్మపత్ని విజయలక్ష్మి స్వామివారికి 50వేల విలువ కలిగిన వెండి గిన్నె, ప్లేటు, స్పూన్, గంటతోపాటు, నిత్య అన్నదానికి 10,116లను కూడ అందజేశారు. ఎస్ వెంకట సుధాకర్‌రావు,ధర్మపత్ని శర్వాణి స్వామి వారి నిత్యఅన్నదానికి 10,116లు అందజేశారు. దాతలు వీటిని పాలకమండలి అధ్యక్షులు చుండూరి మురళీ సుధాకరరావుకు అందజేశారు. ఆయా కార్యక్రమాలలో పాలకమండలి సభ్యులు గోపి, ఆకుల కోటేశ్వరరావు, ధూళిపాళ్ల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## శక్తి యాప్ వినియోగం, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం



**వేటపాలెం, డిసెంబర్ 13, ప్రభాతవార్త**

బాల బాలికలు, యువత భద్రతను పెంపొందించేందుకు శక్తి యాప్ వినియోగం, మాదక ద్రవ్యాల ప్రమాదాలపై డ్రగ్స్ వద్దు బ్రో ప్రచారం, అలాగే ఫోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని ఎస్పీ ఆదేశాల మేరకు శక్తి టీం ఎస్సై హరిబాబు రామన్నపేటలోని హోరిజాన్ పబ్లిక్ స్కూల్ నందు నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాబుతూ అకస్మాత్తుగా జరిగే ప్రమాదాల్లో వేదింపుల్లో, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సహాయం కోసం శక్తి యాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. డ్రగ్స్ వద్ద బ్రో పేరిట మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను చైతన్య పరిచారు. నేటి యువతలో పెరుగుతున్న డ్రగ్స్ వినియోగం వల్ల చదువు, ఆరోగ్యం, భవిష్యత్తును నాశనం చేస్తుందని, మండలంలో డ్రగ్స్ పై నిఘ మరింత బలోపేతం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ పి.రవికుమార్, ప్రెసిడెంట్ డాక్టర్ హరిని, హెడ్ మాస్టర్ టీచర్స్, విద్యార్ధులు పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళనం ఆహ్వాన పత్రిక ఎమ్మెల్యేకు అందజేత



**చీరాల, డిసెంబర్ 13, ప్రభాతవార్త**

ఈనెల 21వ తేదీన చీరాల బాయ్స్ హైస్కూల్‌లో నిర్వహించనున్న హిందూ సమ్మేళనంకు సంబంధించిన ఆహ్వాన పత్రికను నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్‌కు నిర్వాహకులు టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా అందజేశారు. ఈ సందర్భంగా సభ నిర్వహణ ఉద్దేశం, కార్యక్రమ వివరాలు, ముఖ్య అతిధులు, వక్తలు గురించి ఆయనకు వివరించారు. హిందూ సమాజంలో ఐక్యత, సాంస్కృతిక విలువల పరిరక్షణ లక్ష్యంగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి పూర్తి సహకారం అందిస్తామని మద్దులూరి మహేంద్రనాథ్ హామీ ఇచ్చారు.

# చీరాలలో టీడీపీ విస్తృత స్ధాయి సమావేశం

**- ఎమ్మెల్యే కొండయ్య**



**చీరాల, డిసెంబర్ 13, ప్రభాతవార్త**

చీరాల టీడీపీ కార్యాలయంలో శనివారం ఘనంగా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించబడింది. ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య యాదవ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఇప్పుడు నుంచే ప్రతి గ్రామం, ప్రతి వార్డు స్థాయిలో పార్టీని బలోపేతం చేయాల్సి ఉంది. ప్రతి కమిటీ, ప్రతి బూత్ స్థాయిలో కార్యకర్తలు సక్రియంగా పని చేయాలి. ప్రజల సమస్యలను సమర్ధవంతంగా పరిష్కరించడం ముఖ్య లక్ష్యం. పార్టీ కార్యక్రమాలు ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి చేరేలా క్షేత్రస్థాయిలో చురుకుగా ముందుకు రావాలి అని పేర్కొన్నారు. ఇకపై పార్టీ క్రమశిక్షణ, ఐక్యతను పాటిస్తూ అంతర్గత విభేధాలకు తావివ్వకుండా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. యువత, మహిళల పాత్రను మరింత పెంచి పార్టీ కార్యక్రమాల్లో చురుకైన భాగస్వామ్యాన్ని రూపొందించాలి. చీరాల అభివృద్ధి, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి కార్యకర్త బాధ్యత అని అన్నారు.

## ఒక్క రోజే ధాన్యం కొనుగోళ్లలో రికార్డు సృష్టించిన కూటమి సర్కార్

**- 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు.. ఆలస్యం లేని చెల్లింపులు**

**- వైసీపీ హయాంలో పెండింగ్‌లో పెట్టిన రూ.1,674 కోట్ల బకాయిలు పూర్తిగా చెల్లింపు**

**- టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**



**మార్టూరు, డిసెంబర్ 13, ప్రభాతవార్త**

గత ఐదేళ్లలో వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి రైతును దగా చేశాడు. ధాన్యం కొనుగోళ్లలో అవకతలు సృష్టించి వైసీపీదళారులదే రాజ్యం అన్నట్లుగా వ్యవస్థలను తలకిందులు చేశాడు. అక్రమాలకు, దోపిడీలకు అండగా నిలబడి రైతును కుంగదీశారు జగన్‌రెడ్డి. కానీ కూటమి ప్రభుత్వంలో అలాంటి ఇబ్బందులు రైతులకు కలగకుండా దళారుల చేతిలో మోసపోకుండా ఉండేందుకు ముందస్తు ప్రణాళికతో ధాన్యం కొనుగోళ్లను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నాం. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రూ.12,200 కోట్ల విలువతో కొనుగోలు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం. అలాగే ధాన్యం అమ్మదలచిన రైతులు 73373-59375 నెంబర్‌కు హాయ్ అని సందేశం పంపగానే, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారిత వాయిస్ మార్గదర్శకం ద్వారా సేవలపై పూర్తి సమాచారం అందేలా ప్రభుత్వం సౌకర్యం కల్పిద్దాం. ఒక్క రోజే 1.46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకు 3.24 లక్షల మంది లక్షల మంది రైతుల నుంచి 20.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకణ చేసి రూ.4,609 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశాం. ధాన్యం అమ్మిన రైతులకు 24 గంటల్లోనే నగదు జమయ్యే విధానాన్ని అమలు చేస్తున్నాం. వైసీపీ పాలనలో రైతులను ఇబ్బందులకు గురి చేసి, ఆర్ధిక సంక్షోభంలోకి నెట్టేయడంతో ఏమి చేయలేక నిస్సాహయ స్థితిలో ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. రూ.1,674 కోట్లకు పైగా బకాయిలు చెల్లించకుండా ఎగొట్టాడు. చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2024-25 ఖరీఫ్, రబీ సీజన్లలో కూటమి ప్రభుత్వం రైతుల కోసం రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేశాం. రైతులను ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో మొత్తం 55.79 లక్షల టన్నుల ధాన్యాన్ని రూ.13 వేల కోట్ల విలువతో రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేశాం. పండ్లు, చేపల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్నామన్నారు. వైసీపీ పాలనలో రైతులు పండించిన పంటలకు తగిన మద్దతు ధరలు లేక మార్కెట్లో తీవ్ర నష్టాలు చవి చూశారు. ఉత్పత్తి హామీలే తప్ప ఉత్పత్తికి గిట్టుబాటు ధరలు లేక రైతులు రోడ్డుపైకి రావాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు. మామిడి, పొగాకు, మిర్చి, కాఫీ, ఉల్లి, టమాటా తదితర పంటలకు మద్దతు ధరలు ప్రకటించి మొత్తం రూ.850 కోట్లను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసి గట్టి భరోసా కల్పించాం. రైతు సంక్షేమమే లక్ష్యంగా, ఉత్పత్తి నుంచి మద్దతు ధర, ఆర్ధిక భరోసా వరకు బలోపేతం చేస్తూ రైతుకు అండగా నిలబడుతూ భరోసా కల్పించడమే మా లక్ష్యం అన్నారు.

# మెస్సీ రాకతో కోల్‌కతాలో హడావుడి

### సాల్ట్‌లేక్ స్టేడియంలో కట్టలు తెంచుకున్న అభిమానుల ఆగ్రహం

### పది నిమిషాల్లోనే మెస్సీ వెళ్లిపోవడంపై నిరాశ

### అభిమానులకు, మెస్సీకి క్షమాపణలు చెప్పిన బెంగాల్ సీఎం మమత





**కోల్‌కతా,డిసెంబరు 13:** కోల్‌కతాలో ఫుట్‌బాల్ ప్లేయర్ మెస్సీ ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఆడకపోవడంతో సాల్ట్ లేక్ స్టేడియంలో అభిమానులు విధ్వంసం సృష్టించారు. గోట్‌టూర్ ఆఫ్ ఇండియాలో పాల్గొనేందుకు వచ్చిన మెస్సీని సమీపంనుంచి చూడాలని, ఆతడి ఆటను చూడాలని అభిమానులు ఎంతో ఆశతో వచ్చారు. ఈసమయంలో ఇలా వచ్చి అలా స్టేడియంనుంచి వెళ్లిపోవడంపై అభిమానులు తట్టుకోలేక పోయారు. పట్టమని పదినిమిషాలుకూడా ఉండలేదని ఆగ్రహం వ్యక్తంచేసారు. స్టేడియంలో ఫ్లెక్సీలు చించి గ్రౌండ్‌లోకి కుర్చీలు, బాటిళ్లు విసిరేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బారికేడ్లు దాటి స్టేడియంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడ గందరగోళం నెలకొంది. ఈవెంట్ చూసేందుకుగాను రాజకీయ నాయకులు, ఫుట్‌బాల్ మాజీ క్రీడాకారులు కోచ్‌లు అందరూ వచ్చారు. స్టాండ్స్ చుట్టూ వీరే ఉండటంతో మెస్సీ ఫ్యాన్స్‌కు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ గందరగోళం వల్లనే ముందుగా నిర్ణయించిన రెండు ఈవెంట్లను నిర్వహించలేక పోయారు. పదినిమిషాల్లోనే ఆతడిని స్టేడియం నుంచి తీసుకెళ్లిపోవడంపై ఆగ్రహావేశాలతో అభిమానులు ఊగిపోయారు. సాల్ట్‌లేక్‌లోకి దూసుకొచ్చారు. టెంట్లు, ఇతర టెంపరరీ ఆకృతులన్నింటినీ ధ్వంసంచేసారు. భద్రతా సిబ్బంది నియంత్రించలేనిస్థితి నెలకొంది. ఒక్కొక్కరూ రూ.4500 నుంచి రూ.10వేల వరకూ వెచ్చించారని ఇందుకోసమా మేం వచ్చింది అంటూ నిలదీసారు. ఫిర్యాదులు వెల్లువలా రావడంతో గవర్నర్ కూడా ప్రభుత్వం సంబంధిత అధికారులనుంచి నివేదిక కోరారు.

**నిర్వాహకుడు అరెస్టు:** ఉద్రిక్తపరిస్థితులు నెలకొనడంతో పోలీసులు భారీ ఎత్తున మొహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అలాగే కోల్‌కతా పోలీసులు శనివారం ఆ ఈవెంట్ ఆర్గనైజర్ శతాద్రు దత్తను అరెస్టు చేశారు. ఆకస్మికంగా మెస్సీని స్టేడియం నుంచి తీసుకెళ్లడంతో ప్రేక్షకులు వీరంగం సృష్టించారు. ఎయిర్‌పోర్టులో శతాద్రు దత్తను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు చెప్పారు. సాల్ట్ లేక్ స్టేడియంలో తీవ్ర స్థాయిలో ప్రాపర్టీ నష్టం జరిగింది. పలు రకాల సెక్షన్ల కింద నిర్వాహకుడిపై కేసు పెట్టనున్నారు. త్వరలో ఎఫ్ఐఆర్ నమోదు చేయనున్నట్లు కోల్‌కతా పోలీసులు వెల్లడించారు. లీగల్ చర్యలు తీసుకుంటామని శాంతిభద్రతల అదనపు డీజీ జావెద్ షామిమ్ తెలిపారు. అభిమానుల్ని విస్మరించడం పట్ల ఆరా తీస్తామని, ఎక్కడ లోపం జరిగిందో తెలుసుకుని చర్యలు తీసుకుంటామన్నారు. కోల్‌కతా ఘటనను సుమోటోగా స్వీకరించిన కేసును నమోదు చేయనున్నట్లు కోల్‌కతా పోలీసులు తెలిపారు. ప్రేక్షకుల టికెట్ డబ్బును రిఫండ్ చేయాలని నిర్వాహకులకు పోలీసులు ఆదేశాలు ఇచ్చారు. ఇలాంటి మేనేజ్మెంట్‌ను సహించబోమని కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ ప్లేయర్ లియోనెల్ మెస్సీ భారత పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కోల్‌కతాలో ఇవాళ ఉదయం ల్యాండ్ అయ్యారు. అనంతరం స్థానిక సాల్ట్ లేక్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక మెస్సీని చూసేందుకు కోల్‌కతా సహా పలు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున ఫ్యాన్స్ తరలివచ్చారు. అక్కడ అభిమానులకు నిరాశే ఎదురైంది. ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో మెస్సీ ఆడాల్సి ఉండగా ఆడకుండానే స్టేడియం నుంచి వెళ్లిపోయారు. దీంతో ఫ్యాన్స్ ఆగ్రహంతో ఊగిపోయారు. అప్రమత్తమైన అధికారులు వారిని అదుపుచేస్తున్నారు. స్టేడియం వద్ద భద్రతను పెంచారు.

**మెస్సీకి మమతా బెనర్జీ క్షమాపణలు:** సాల్ట్‌లేక్ స్టేడియంలో జరిగిన ఉద్రిక్తతలపై పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. జరిగిన సంఘటనలు దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రపంచ దిగ్గజ ఆటగాడు లియోనెల్ మెస్సీకి, మెస్సీ అభిమానులకు క్షమాపణలు చెప్పారు. స్టేడియంలో నిర్వహణ లోపం పట్ల దిగ్భ్రాంతి కలిగిందని, మెస్సీని చూసేందుకు వచ్చిన వేలాదిమంది క్రీడాభిమానులతోకలిసి నేనుకూడా చూద్దామని స్టేడియానికి బయలుదేరానని, అక్కడి పరిస్థితిని తెలిసి వెనుదిరిగినట్లు చెప్పారు. స్టేడియంలోజరిగిన ఘటనకు మెస్సీకి, ఆయన అభిమానులకు క్షమాపణలు చెప్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై జస్టిస్ ఆషిమ్ కుమార్ అధ్యక్షతన విచారణ కమిటీని ఏర్పాటు చేస్తున్నానని, దర్యాప్తు అనంతరం నిర్వహణ వైఫల్యానికి కారకులపై చర్యలు తీసుకుంటామని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

# ట్రంప్ సుంకాలతో అమెరికాకే నష్టం



### ముగ్గురు రిపబ్లికన్ల సభలో తీర్మానం

**వాషింగ్టన్, డిసెంబరు 13:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ దిగుమతులపై విధించిన 50 శాతం సుంకాలను రద్దు చేయాలని కోరుతూ ముగ్గురు అమెరికా చట్టసభ సభ్యులు నిన్న ప్రతినిధుల సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ టారిఫ్‌లు చట్టవిరుద్ధమని, అమెరికా కార్మికులకు, వినియోగదారులకు, ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని వారు ఆరోపించారు. కాంగ్రెస్ సభ్యులు డెబోరా రాస్, మార్క్ వీసే, రాజా కృష్ణమూర్తి ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆగస్టు 27, 2025న అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద భారత్‌పై అదనంగా విధించిన 25 సుంకాలను రద్దు చేయాలని ఈ తీర్మానం లక్ష్యంగా పెట్టుకుంది. అంతకుముందు విధించిన సుంకాలను కలుపుకొని భారత ఉత్పత్తులపై మొత్తం టారిఫ్‌లు 50 శాతానికి చేరిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కాంగ్రెస్ సభ్యురాలు డెబోరా రాస్ మాట్లాడుతూ, భారత కంపెనీలు మా రాష్ట్రమైన నార్త్ కరోలినాలో బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయి. వేలాది ఉద్యోగాలు సృష్టించాయి. ఈ టారిఫ్‌లు మా ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగిస్తున్నాయని అన్నారు. మరో సభ్యుడు మార్క్ వీసీ స్పందిస్తూ, భారత్ మాకు ముఖ్యమైన భాగస్వామి. ఈ చట్టవిరుద్ధ సుంకాలు ఇప్పటికే అధిక ధరలతో ఇబ్బంది పడుతున్న సామాన్యులపై మరింత భారం మోపుతాయని తెలిపారు. భారత సంతతికి చెందిన కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ సుంకాల వల్ల అమెరికా ప్రయోజనాలకు బదులు నష్టమే ఎక్కువ. ఇవి సరఫరా గొలుసులను దెబ్బతీసి, కార్మికులకు నష్టం కలిగించి, వినియోగదారులపై భారం పెంచుతాయి. వీటిని రద్దు చేయడం ద్వారా అమెరికా-భారత్ ఆర్థిక, భద్రతా సహకారాన్ని బలోపేతం చేసుకోవచ్చని వివరించారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలును కొనసాగిస్తోందన్న కారణంతో ట్రంప్ ఆగస్టులో భారత్‌పై దశలవారీగా 50 సుంకాలు విధించారు. ట్రంప్ ఏకపక్ష వాణిజ్య విధానాలను వ్యతిరేకించడంలో భాగంగా కాంగ్రెస్‌లోని డెమొక్రాట్లు ఈ ప్రయత్నాలు చేస్తున్నారు. గత అక్టోబర్‌లో కూడా ఈ ముగ్గురు సభ్యులతో పాటు మరో 19 మంది కాంగ్రెస్ సభ్యులు ట్రంప్‌కు లేఖ రాసి, టారిఫ్ విధానాలను మార్చుకోవాలని కోరారు.

# కనుమరుగవుతున్న ద్వీపకల్పదేశం 'తువాలు'

### వాతావరణ మార్పులే కారణం

### దేశ పౌరులకు ఆస్ట్రేలియా ఆహ్వానం



**ఫునాఫుటి(తువాలు), డిసెంబరు 13:** వాతావరణ మార్పుల కారణంగా ఒక దేశం నెమ్మదిగా కనుమరుగైపోతుంటే, మరో దేశం ఆ ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇస్తూ అండగా నిలుస్తోంది. సముద్ర మట్టాలు పెరిగి అస్తిత్వాన్ని కోల్పోతున్న పసిఫిక్ ద్వీప దేశం 'తువాలు' పౌరులకు ఆస్ట్రేలియా ఆశ్రయం కల్పిస్తోంది. ఈ చరిత్రాత్మక ఒప్పందం కింద, తువాలు నుంచి తొలి వలసదారుల బృందం ఈ వారం ఆస్ట్రేలియాలో అడుగుపెట్టింది. వాతావరణ మార్పుల వల్ల ముంపునకు గురవుతున్న తమ పౌరులకు 'గౌరవప్రదమైన వలస'అవకాశం కల్పించాలని తువాలు చేసిన విజ్ఞప్తి మేరకు 2023లో ఆస్ట్రేలియాతో ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం, తువాలు పౌరులకు ప్రత్యేక వీసాలు జారీ చేస్తున్నారు. ఈ వీసా ద్వారా వారు ఆస్ట్రేలియాలో నివసించవచ్చు, చదువుకోవచ్చు, పని చేసుకోవచ్చు. అర్హత సాధించిన వారికి ఆస్ట్రేలియా పౌరసత్వం కూడా లభిస్తుంది. ఇక్కడికి వచ్చిన వెంటనే వారికి విద్య, వైద్య బీమా (మెడికేర్), ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుబాటులోకి వస్తాయి. సుమారు 11,000 జనాభా మాత్రమే ఉన్న తువాలు దేశం నుంచి, ఈ ఏడాది జూన్‌లో వీసా దరఖాస్తులు ప్రారంభం కాగానే 3,000 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. అయితే, తువాలులో మేధోవలసను నివారించేందుకు ఏటా కేవలం 280 మందికి మాత్రమే వీసాలు జారీ చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్ మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రమవుతున్న వేళ, తువాలు పౌరులకు ఆస్ట్రేలియాలో కొత్త జీవితం ప్రారంభించే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. మరోవైపు, తమ దేశ సంస్కృతి, సంప్రదాయాలను ఎప్పటికీ మర్చిపోవద్దని వలస వెళుతున్న పౌరులకు తువాలు ప్రధాని ఫెలెటి టియో సూచించారు. ప్రపంచంలోనే ఈ తరహా ఒప్పందం ఇదే మొదటిది కావడం గమనార్హం.


# పార్లమెంటుపై ఉగ్రదాడికి 24 యేళ్లు: నివాళులర్పించిన ప్రముఖనేతలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచే భారత పార్లమెంటుపై ఉగ్రదాడికి నేటితో 24 ఏళ్లు పూర్తి. 2001 డిసెంబర్ 13వ తేదీన ఢిల్లీలోని పార్లమెంటు భవనంపై ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఆ దాడిలో మరణించిన జవాన్లకు పలువురు నేతలు నివాళులర్పించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రులు కిరెన్ రిజుజు, జితేంద్ర సింగ్, అర్జున్ రామ్ మేఘ్వాల్, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు ఎంపీలు, సీనియర్ లీడర్లు జవాన్లకు నివాళులర్పించారు.

2001, డిసెంబర్ 13న పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరుగుతున్న సమయంలో ఉగ్రమూక పథకం ప్రకారం పార్లమెంటు ప్రాంగణంలోకి చొరబడింది. హోం శాఖ అనుమతి ఉన్న స్టిక్కర్‌తో ఎరుపు రంగు అంబాసిడర్ బుగ్గకారులో లోపలికి ప్రవేశించింది. అక్కడ నిలిపిఉన్న ఉపరాష్ట్రపతి కారును ఢీ కొట్టింది. అనంతరం కిందకు దిగిన ముష్కరులు కాల్పులతో బీభత్సం సృష్టించారు. అడ్డువచ్చిన వారిని కాల్చుకుంటూ పోయారు.

# హెచ్1బి వీసా ఫీజు పెంపుపై యుఎస్‌లో ఆగ్రహం


### కోర్టుకెక్కిన 20 కీలక రాష్ట్రాలు



**కాలిఫోర్నియా, డిసెంబరు 13:** అధ్యక్షుడు ట్రంప్ 2025 సెప్టెంబర్ 19న జారీ చేసిన ఆదేశాల మేరకు హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం జారీచేసిన హెచ్1బి వీసా లక్షడాలర్ల ఫీజులపై కాలిఫోర్నియాతో సహా 20 రాష్ట్రాలు అమెరికా కోర్టులో దావా దాఖలుచేసాయి. ట్రంప్ ఆదేశాలమేరకు హోంల్యాండ్ సెక్యూరిటీ ఈ కొత్త ఫీజును అమలులోకి తెచ్చింది. ఈ విధానం వల్ల ఆసుపత్రులు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు వంటి సంస్థలు తీవ్రంగా నష్టపోతాయని రాష్ట్రాలు వాదిస్తున్నాయి. ఈ దావాకు నాయకత్వం వహిస్తున్న కాలిఫోర్నియా అటార్నీ జనరల్ రాబ్ బొంటా మాట్లాడుతూ, ఈ అక్రమ ఫీజు వల్ల ప్రభుత్వ సంస్థలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుంది. కీలక రంగాల్లో ఇప్పటికే ఉన్న సిబ్బంది కొరత మరింత పెరుగుతుందని అన్నారు. ఈ ఫీజును విధించే అధికారం ప్రభుత్వానికి లేదని, ఇది అమెరికా రాజ్యాంగాన్ని, అడ్మినిస్ట్రేటివ్ ప్రొసీజర్ యాక్ట్‌ను ఉల్లంఘించడమేనని రాష్ట్రాలు తమ పిటిషన్‌లో పేర్కొన్నాయి. ప్రస్తుతం హెచ్1బీ పిటిషన్లకు 960 డాలర్ల నుంచి 7,595 డాలర్ల వరకు మాత్రమే ఫీజులు ఉన్నాయి. ఈ కొత్త నిర్ణయం వల్ల విద్య, వైద్య రంగాల్లో ఖాళీలను భర్తీ చేయడం మరింత కష్టమవుతుందని రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే దేశంలోని అనేక పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బంది పడుతున్నాయి. అలాగే 2036 నాటికి అమెరికాలో 86,000 మంది వైద్యుల కొరత ఏర్పడవచ్చని అంచనాలున్నాయి. భారత్ నుంచి వెళ్లే టెక్ నిపుణులు, వైద్యులకు హెచ్1బీ వీసా అత్యంత కీలకమైన మార్గంగా ఉన్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. కాలిఫోర్నియా, మసాచుసెట్స్ సహా న్యూయార్క్, న్యూజెర్సీ, అరిజోనా వంటి రాష్ట్రాలు ఈ దావాలో పాలుపంచుకున్నాయి. దీనివల్ల భవిష్యత్తులో ప్రతిభావంతులైన నిపుణులు అమెరికాకు రాకపోవచ్చని, ఇప్పటికే నిపుణుల కొరతను ఎదుర్కొంటున్నట్లు కాలిఫోర్నియా అటార్ని జనరల్ వెల్లడించారు. కీలక రాష్ట్రాల్లో భారీ ఎత్తున భారతీయ విదేశీ నిపుణులు పనిచేస్తున్నారని వీరి నిష్క్రమణం వల్ల ఇపుడు ఈ కంపెనీలకు నిపుణుల కొరత ఎదురవుతుందని, ఫలితంగా వీటిద్వారా లేఆఫ్‌లు కూడా పెరుగుతాయని ఆందోళన వ్యక్తంచేసారు. ఇప్పటికే ప్రతినిధుల సభలో ట్రంప్ సుంకాలు వ్యతిరేకిస్తూ ముగ్గురు ప్రతినిదులు తీర్మానం తెచ్చారు. డెబోరా రాస్, మార్క్ వీసీ, రాజాకృష్ణమూర్తిలు ఈ తీర్మానం ప్రవేశపెట్టారు. సుంకాలు చట్టవిరుద్ధం అని వీటివల్ల అమెరికన్లకే ఎక్కువ నష్టమని వారు తమ తీర్మానంలో వెల్లడించారు.

# సంక్షిప్తంగా..

## చమురు ట్యాంకర్‌ను సీజ్ చేసిన ఇరాన్



**టెహ్రాన్, డిసెంబరు 13:** భారీ పరిమాణంలో చమురును మోసుకెళ్తోన్న ఒక నౌకను ఇరాన్ సీజ్ చేసింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత ఈ ఘటన చోటుచేసుకొంది. అందులోని సిబ్బందిలో భారతీయులు కూడా ఉన్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ నౌకలో మొత్తం 18 మంది సిబ్బంది ఉండగా.. వారిలో బంగ్లాదేశ్, శ్రీలంక వాసులు కూడా ఉన్నారని పేర్కొన్నాయి. '60 లక్షల లీటర్ల చమురును ఒక నౌకలో అక్రమంగా తరలిస్తున్నారు. అందుకే నౌకలోని నావిగేషన్ వ్యవస్థలన్నింటినీ నిలిపివేశారు' అని ఇరాన్ మీడియా వెల్లడించింది. గల్ఫ్‌లో అక్రమంగా ఇంధనం రవాణా చేస్తోన్న నౌకలను అడ్డుకుంటున్నట్లు ఇరాన్ ఇప్పటికే పలుమార్లు వెల్లడించింది.

## పాక్ గూఢచర్యంపై అసోం రిటైర్డ్ ఎయిర్‌ఫోర్స్ అధికారి అరెస్టు



**గువాహతి, డిసెంబరు 13:** పాకిస్థాన్ గూఢచర్య నెట్‌వర్క్‌తో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై భారత వైమానిక దళానికి చెందిన ఒక రిటైర్డ్ అధికారిని అసోం పోలీసులు అరెస్ట్ చేశారు. తేజ్‌పూర్‌లోని పాటి యా ప్రాంతానికి చెందిన కులేంద్ర శర్మను నిన్న రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. కొంతకాలంగా కులేంద్ర శర్మపై నిఘా పెట్టిన పోలీసులు, ప్రాథమిక విచారణ అనంతరం అతడిని అరెస్ట్ చేశారు. నిందితుడు పాకిస్థాన్ గూఢచర్య సంస్థతో సంబం ధాలున్న వ్యక్తులతో టచ్‌లో ఉంటూ, వారికి దేశభద్రతకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అతని మొబైల్ ఫోన్, ల్యాప్ టాప్‌ను స్వాధీనం చేసుకోగా, అందులో కొన్ని అనుమానాస్పద ఆధారాలు లభించినట్లు తెలిసింది. అయితే, కొంత డేటాను నిందితుడు డిలీట్ చేసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

## నోయిడా ఎక్స్‌ప్రెస్‌వేపై ఢీకొన్న వాహనాలు



**నోయిడా, డిసెంబరు 13:** ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతాన్ని దట్టమైన పొగమంచు కమ్మేయడంతో శనివారం ఉదయం ఘోర ప్రమాదం జరిగింది. నొయిడా ఎక్స్‌ప్రెస్‌వేపై పొగమంచు కారణంగా దారి కనిపించక, 12కు పైగా వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కార్లు, ట్రక్కులు ధ్వంసం కాగా, పలువురు గాయపడ్డారు. ప్రమాదం కారణంగా ఎక్స్‌ప్రెస్‌వేపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈఘటన హర్యానా, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల మీదుగా వెళ్లే 135 కిలోమీటర్ల పొడవైన ఈస్టర్న్ పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్‌వే (కుండ్లిఘజియాబాద్‌పాల్వాల్ ఎక్స్‌ప్రెస్‌వే)పైచోటుచేసుకుంది. ప్రమాద స్థలంలో కనిపించిన దృశ్యాలు తీవ్రతను తెలియజేస్తున్నాయి. ఒక కారు ముందు భాగం నుజ్జునుజ్జై డివైడర్‌పైకి ఎక్కగా, మరో కారు ట్రక్కు కింద ఇరుక్కుపోయి కనిపించింది. ఈ ప్రమాదంపై గౌతమ్ బుద్ధ నగర్ (నొయిడా) పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ఎక్స్ (ట్విట్టర్) ద్వారా స్పందించింది.

## యుపి బిజెపి చీఫ్‌గా కేంద్ర సహాయమంత్రి పంకజ్ చౌదరి



**లక్నో, డిసెంబరు 13:** కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరీని ఉత్తరప్రదేశ్ బీజేపీ పార్టీ చీఫ్‌గా హైకమాండ్ నియమించనున్నది. ఆదివారం లక్నోలో గ్రాండ్ ఆ సెర్మనీ జరిగే ఛాన్సు ఉన్నట్లు తెలు స్తోంది. ఇవాళ ఆయన తన నామినేషన్ పేపర్స్ దాఖలు చేసే అవకాశం ఉన్నది. నామినేషన్ దాఖలు కార్యక్రమానికి కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ హాజరుకానున్నారు. జాతీయ కార్యదర్శి వినోద్ తవడే కూడా హాజరవుతారు. మహారాజ్‌గంజ్ నియోజకవర్గం నుంచి పంకజ్ చౌదరీ ఏడుసార్లు ఎంపీగా గెలిచారు.

## నోబెల్ పురస్కార గ్రహీతను అరెస్టు చేసిన ఇరాన్



**టెహ్రాన్, డిసెంబరు 13:** నోబెల్ శాంతి పురస్కార గ్రహీత, ఇరాన్‌కు చెందిన మానవ హక్కుల కార్యకర్త నర్గెస్ మొహమ్మదిని స్థానిక పోలీసులు మరోసారి అరెస్టు చేశారు. ఇటీవల మరణించిన ఓ మానవ హక్కుల న్యాయవాది స్మారక చిహ్నాం వద్ద నివాళులర్పిస్తుండగా ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు ఆమె మద్దతుదారులు, సంబంధిత స్వచ్ఛంద సంస్థలు వెల్లడించాయి. అయితే, ఆమె అరెస్టుపై ఇరాన్ ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. మహిళల హక్కుల కోసం, ఇరాన్ ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా నర్గెస్ మొహమ్మది మూడు దశాబ్దాలకు పైగా పోరాడుతున్నారు. ఆమె అలుపెరగని పోరాటానికి గుర్తింపుగా 2023లో నోబెల్ శాంతి బహుమతి లభించింది. ఆ పురస్కారం ప్రకటించే సమయానికి కూడా ఆమె జైల్లోనే ఉండటం గమనార్హం.

# మహిళల కోసం 'వయాగ్రా' క్రీమ్..

### డేర్ బయోసైన్సెస్ ప్రత్యేక ఆవిష్కరణ

**శాన్‌ఫ్రాన్సిస్కో, డిసెంబరు 13:** పురుషుల లైంగిక సామర్థ్యాన్ని పెంచే వయాగ్రా అందుబాటులోకి వచ్చి మూడు దశాబ్దాలు దాటింది. ఇపుడు మహిళల కోసం కూడా ప్రత్యామ్నాయంగా ఒక కొత్త ఉత్పత్తిని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. అమెరికాకు చెందిన డేర్ బయోసైన్స్ అనే సంస్థ మహిళల్లో లైంగిక ప్రేరేపణను పెంచే ఒక ప్రత్యేకమైన క్రీమ్‌ను తయారు చేసింది. డేర్ టు ప్లే పేరుతో వస్తున్న ఈ క్రీమ్ కేవలం 10 నిమిషాల్లోనే ప్రభావం చూపుతుందని సంస్థ చెబుతోంది. ఈ క్రీమ్‌లో వయాగ్రాలో ఉపయోగించే ఖిసిల్డెనాఫిల్ఖి అనే రసాయనాన్నే వాడారు. దీన్ని ప్రైవేట్ భాగాల్లో రాసుకోవడం ద్వారా రక్త ప్రసరణ పెరిగి, స్పర్శ జ్ఞానం, లైంగిక వాంఛ మెరుగుపడతాయని తయారీదారులు చెబుతున్నారు. "మహిళల శరీరాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా రూపొందిస్తే సిల్డెనాఫిల్ అద్భుతంగా పనిచేస్తుందని శాస్త్రీయంగా నిరూపించాం. 1998లో వయాగ్రా పురుషుల లైంగిక వైద్యంలో విప్లవం సృష్టించింది. కానీ మహిళల విషయంలో దాదాపు 30 ఏళ్లుగా ఎలాంటి పురోగతి లేదు" అని డేర్ బయోసైన్స్ సీఈఓ సబ్రినా మార్టుక్కీ జాన్సన్ తెలిపారు. ఈ ఉత్పత్తి భద్రత, సామర్థ్యాన్ని పలు క్లినికల్ ట్రయల్స్ ద్వారా నిర్ధారించామని, అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నామని కంపెనీ పేర్కొంది. సుమారు 200 మంది మహిళలపై జరిపిన ప్రయోగాల్లో ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండానే వారిలో లైంగిక ఆసక్తి, కోరికలు, భావప్రాప్తి వంటివి గణనీయంగా పెరిగినట్లు తేలింది. పురుషులకు ఉన్నట్లుగా మహిళలకు పిల్ ఎందుకు తయారు చేయలేదన్న ప్రశ్నకు, దానికి చాలా ఎక్కువ మోతాదులో సిల్డెనాఫిల్ అవసరమవుతుందని, అది ఆచరణ సాధ్యం కాదని జాన్సన్ వివరించారు. ప్రస్తుతం అమెరికాలోని 10 రాష్ట్రాల్లో ఈ క్రీమ్ కోసం ప్రీఆర్డర్లు స్వీకరిస్తుండగా, 2026 ప్రారంభం నాటికి దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# ఎలాన్ మస్క్‌కు ఇమ్రాన్‌ఖాన్ మాజీ భార్య బహిరంగ లేఖ



**ఇస్లామాబాద్, డిసెంబరు 13:** ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్‌కు పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మాజీ భార్య జెమీమా గోల్డ్‌స్మిత్ బహిరంగ లేఖ రాశారు. తన ఎక్స్ ఖాతాలో విజిబిలిటీ ఫిల్టరింగ్‌ను సరిచేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. జైలులో ఉన్న ఇమ్రాన్‌ఖాన్ పరిస్థితి గురించి తాను పెడుతున్న పోస్టులు ప్రజలకు చేరడం లేదని వెల్లడించారు. ఈ మేరకు జెమీమా తన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. దీనికి మస్క్‌ను ట్యాగ్ చేశారు. ఆ పోస్టులో 'ఎలాన్‌మస్క్‌కు ఓ వ్యక్తిగత విజ్ఞప్తి. చట్టవిరుద్ధంగా ఏకాంత నిర్బంధంలో నా భర్త ఇమ్రాన్‌ను చూసేందుకు, మాట్లాడేందుకు నా ఇద్దరు కుమారులకు అనుమతి ఇవ్వడం లేదు. కేవలం 'ఎక్స్' ద్వారా మాత్రమే ఇమ్రాన్ ఖాన్ గురించి మా ఆవేదనను ప్రపంచానికి చెప్పగులుతున్నాం' అని రాసుకొచ్చారు. పాక్ అధికారులు ఇమ్రాన్‌పై వ్యవహరిస్తున్న తీరు గురించి తాను పెడుతున్న పోస్టులు బయటకు రావడం లేదని జెమీమా ఆరోపించారు. అవి ప్రజలకు చేరడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తన ఎక్స్ ఖాతాలో విజిబిలిటీ ఫిల్టరింగ్‌ను సరిచేయాలని ఆమె మస్క్‌కు విజ్ఞప్తి చేశారు. 2023 నుంచి ఇమ్రాన్‌ఖాన్ అడియాలా జైలులోనే ఉన్నారు. ఇటీవల ఆయన మృతి చెందినట్లు సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున ప్రచారం జరిగింది. ఈ క్రమంలో ఆయన మద్దతుదారులు ఇమ్రాన్‌ను కలిసేందుకు అవకాశమివ్వాలని నిరసనలు వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఇమ్రాన్ సోదరి ఉజ్మా ఖానుమ్‌కు మాత్రమే ఆయనను కలిసే అవకాశం కల్పించారు. జైలులో ఇమ్రాన్ సురక్షితంగానే ఉన్నారని ఆ తర్వాత ఖానుమ్ ప్రకటించారు.

# కాంగ్రెస్ పునరుజ్జీవం ఒక జాతీయ బాధ్యత



కేంద్ర మాజీ మంత్రి అశ్వినీకుమార్

**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** దేశంలో కాంగ్రెస్ పార్టీ లేకుండా సమర్థవంతమైన ప్రతిపక్షాన్ని ఊహించలేమని, అయితే ఆ పార్టీ తన ప్రాభవాన్ని ఎక్కడో కోల్పోయిందని మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత అశ్వనీ కుమార్ అభిప్రాయపడ్డారు. పార్టీ పునరుజ్జీవం పొందడం ఒక జాతీయ బాధ్యత అని ఆయన వ్యాఖ్యానించారు. తన కొత్త పుస్తకం గార్డియన్స్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష పార్టీలలో తప్పులు వెతకడం కంటే, కాంగ్రెస్ తనలోని బలహీనతలను గుర్తించేందుకు ఆత్మపరిశీలన చేసుకోవాలని ఆయన సూచించారు. రాహుల్ గాంధీ హృదయం సరైనదే, ఆయన పేదల పక్షాన మాట్లాడతారు. కానీ ఎక్కడో పార్టీ సందేశం ప్రజల్లోకి బలంగా వెళ్లడం లేదు. ఈ విషయాన్ని వారే గుర్తించాలని కుమార్ అన్నారు. ఈవీఎంల ద్వారా ఎన్నికల్లో మోసాలు జరుగుతున్నాయని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపైనా ఆయన స్పందించారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో గెలిచినప్పుడు ప్రభుత్వాలను ఏర్పాటు చేసి, ఓడిపోయినప్పుడు మాత్రమే ఈవీఎంలను నిందించడం వల్ల నైతిక విశ్వసనీయతను కోల్పోతారు. ఈ ద్వంద్వ వైఖరి సరికాదని ఆయన హితవు పలికారు. తాను పార్టీని వీడినప్పటికీ, సోనియాగాంధీ పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని అశ్వనీ కుమార్ తెలిపారు. ప్రజా జీవితంలో ఆమె చూపిన హుందాతనాన్ని, ఎందరో ప్రధాని అభ్యర్థులు ఉన్నప్పటికీ తన నాగరికత, గౌరవం కారణంగా మన్మోహన్ సింగ్‌ను ఎంపిక చేయడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రస్తుత ప్రభుత్వం, ప్రధాని ప్రతిదీ తప్పు చేస్తున్నారనే భావన కూడా సరైంది కాదని ఆయన పేర్కొన్నారు.

# పేరు మార్చడం కాదు..ప్రయోజనం పెరగాలి: ప్రియాంక



**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా మార్చి నిర్ణయంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ స్పందించారు. ఉపాధి హామీ పథకం పేరును మార్చడంవల్ల ప్రజలకు చేకూరే ప్రయోజనం ఏమిటని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలతో డబ్బు ఖర్చు తప్ప మరే ఉపయోగం లేదని విమర్శించారు. వంద రోజులు ఉపాధి కల్పించడం ద్వారా పల్లెప్రాంత పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం కోసం ఎన్నో ఏళ్లుగా అమలు చేస్తున్న ఈ పథకానికి ఇప్పుడు పేరు మార్చాల్సిన అవసరం ఏమిటో తనకు అర్థం కావడం లేదని అన్నారు. పథకం పేరు మార్చితే దానికి సంబంధించిన అన్ని కార్యాలయాలు, వస్తువులపై ఇప్పటికే ముద్రించిన పేర్లను మార్చాల్సి వస్తుందని ప్రియాంకాగాంధీ అన్నారు. ఇది ఖరీదైన ప్రక్రియ అని, చాలా డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుందని ఆమె చెప్పారు. కాగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా మారుస్తూ శుక్రవారం కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే పనిదినాల సంఖ్యను 100 నుంచి 125కి పెంచింది. ఒక రోజుకు ఇచ్చే కనీస వేతనాన్ని రూ.240కి సవరించింది.

14-12Pg6exHMNWJQE 10_14-12Pg6exHMNWJQE.qxd 13/Dec/25 11:14 PM Page 1





:కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాల జారీ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న అనిత

# కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాలు 16న జారీ: హోంమంత్రి అనిత

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాల 16వ తేదీన జారీచేస్తున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు.కానిస్టేబుళ్ళ ఎంపిక పరీక్షలను సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు.ఎంపికైన అభ్యర్థులకు వెంటనే పోస్టింగ్ పత్రాలు ఇస్తారని వివరించారుకూటమి ప్రభుత్వం మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. డీఎస్సీ లో ఉద్యోగాలు సాధించిన వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా ఆఫర్ లెటర్స్ ఇచ్చారు. ఇదే పంథాను మరోసారి కొనసాగిం చనున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలీసు శాఖలో సుమారు 6 వేల కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేసింది. వీరికి ఈనెల 16న ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయం గా నియామక పత్రాలు ఇవ్వను న్నారు.అందుకోసం గుంటూరు జిల్లా మంగళగిరి ఆరో బెటాలియన్ పరేడ్ గ్రౌండ్‌లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 18 వేల మంది హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకుం టున్నారు మంగళగిరి లోని 6వ బెటాలియన్‌ను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సందర్శిం చారు. ఈ నెల 16వ తేదీన జరగనున్న కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాల జారీ కార్యక్ర మానికి సంబంధించిన ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి అనిత పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ, సభా వేదిక నిర్మాణం, వేదికకు చేరుకునే మార్గాలు, పార్కింగ్ సౌకర్యాలు, వీవీఐపీ మరియు వీఐపీలకు ఏర్పాటు చేసే వసతులు, ఇతర జిల్లాల నుండి హాజరయ్యే అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యు లు, బందోబస్తుకు వచ్చే పోలీస్ అధికారులు., సిబ్బందికి కల్పించాల్సి న సౌకర్యాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. అనంతరం, ఎక్కడ ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని, కార్యక్రమాన్ని సజావుగా మరియు విజయవ ంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని, తగినంత పోలీస్ బలగాలతో సమర్థవంతమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని హోం మంత్రి పోలీస్ ఉన్నతాధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమం లో డీఐజీ సత్య యేసు బాబు, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఐపీఎస్, బెటాలియన్ కమాండెంట్ నగేష్ ఐపీఎస్, జిల్లా అదనపు ఎస్పీ ఏటీవీ రవికుమార్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



# నైపుణ్య విద్యలో అగ్రగామి సెంచూరియన్ వర్సిటీ!

**- వికసిత్ భారత్ నిర్మాణంలో యువత పాత్ర కీలకం**
**- ఘనంగా 5వ స్నాతకోత్సవం**
**- విశిష్ట అతిధులు డాక్టర్ ఎస్.ఎన్.సాబత్, శంకరన్ నరేన్**

**నెల్లిమర్ల (విజయనగరం జిల్లా), డిసెంబర్ 13 ప్రభాతవార్త :** ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ నివ్వడంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం (సియుటిఎం) ఒక ప్రత్యేకతను సంతరించుకొని అగ్రగామిగా నిలిచిందని ఉత్తరప్రదేశ్ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు చైర్మన్ డాక్టర్ ఎస్.ఎన్.సాబత్ అన్నారు. శనివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయ 5వ స్నాతకోత్సవ వేడుకలకు ఆయన విశిష్ట అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.ఎన్.సాబత్ మాట్లాడుతూ నాణ్యమైన విద్య, ఆచరణాత్మక జ్ఞానం, అభ్యాస ఆధారిత విద్యకు సెంచూరియన్ నిదర్శనమన్నారు. యువత నిజాయితీ, నైతిక విలువలతో ముందడుగు వేయాలన్నారు. వికసిత్ భారత్ నిర్మాణంలో కూడా యువత భాగస్వాములు కావాలన్నారు. మరో విశిష్ట అతిథి ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ ఎఎంసి సిఐఒ శంకరన్ నరేన్ మాట్లాడుతూ రాబోయే కాలంలో కృత్రిమ మేధస్సు, జన్యు చికిత్స, బయో టెక్నాలజీ వంటి ఆవిష్కరణలతో కొత్త కొత్త మార్పులు రాబోతున్నాయన్నారు. ఎవరైతే సాంకేతిక మార్పుతో వేగం పెంచుకోలేకపోయారో వారు వెనుకబడినట్టు చరిత్ర ద్వారా నిరూపితమవుతుందన్నారు. అందువల్లనే యువత మార్పును స్వాగతించాలన్నారు. ఈ వేడుకలకు అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ సెంచూరియన్ యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్ మెంట్ అనేది నైపుణ్య సమీకృత ఉన్నత విద్యా కేంద్రమని కొనియాడారు. ఈ విశ్వవిద్యాలయాన్ని స్థాపించిన ప్రొఫెసర్ ముక్తికాంత్ మిశ్రా, ప్రొఫెసర్ డి.ఎన్.రావు గొప్ప నాయకత్వ లక్షణాలు కలిగిన విద్యావేత్తలని శ్లాఘించారు. విద్యార్థులు తమ జీవితంలో ఎదురయ్యే అనేక సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ప్రతి ఒకరు ఉన్నతంగా ఎదగడానికి కావాల్సి న లక్షణాల గురించి వివరించారు. అనంతరం ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజు, విశిష్ట అతిధులు డాక్టర్ ఎస్.ఎన్.సాబత్, శంకర్ నరేన్, ప్రొఫెసర్ ముక్తికాంత్ మిశ్రా, ప్రొఫెసర్ డి.ఎన్.రావు అతిధుల చేతుల మీదుగా ఆరు పిహెచ్ డిలతోపాటు 409 మందికి డిగ్రీలను ప్రధానం చేశారు. అలాగే ఉత్తరప్రదేశ్ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు చైర్మన్ డాక్టర్ ఎస్.ఎన్.సాబత్, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ ఎఎంసి సిఐఒ శంకరన్ నరేన్‌లకు గౌరవ డాక్టరేట్లను ప్రధానం చేశారు. అలాగే వివిధ విభాగాలలో టాపర్లకు 14 బంగారు పతకాలను, 8 మందికి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. అనంతరం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి మాట్లాడుతూ విద్య నాణ్యత, పరిశోధనలను పెంపొం దిం చేందుకు సెంచూ రియన్ తీసు కుంటున్న చర్యల గురించి వివ రించారు.

# ఇండియా జట్టులో రెడ్డిచర్ల దేవీప్రియ



**తిరుపతి క్రీడ, డిసెంబర్ 13, ప్రభాతవార్త** తిరుపతి జిల్లాకు చెందిన నెరబైలు రెడ్డిచర్ల దేవి ప్రియ ఇటీవల పంజాబ్ రాష్ట్రంలో గత నవంబర్‌లో జరిగిన గోల్ షాట్ బాల్ ఇండియా జట్టు ఎంపికలకు హాజరై ప్రతిభ కనబరిచి ఇండియా జట్టులో స్థానం సంపాదించారు. దేవీప్రియ డిసెంబర్ నెలలో 5వ తేదీ నుండి 13వ తేదీ వరకు ఇండియా జట్టులో ప్రాక్టీస్ క్యాంప్‌లో మహారాష్ట్ర పుణె లో పాల్గొని డిసెంబర్ 15 నుండి 19వ తేదీ వరకు జరిగే సౌత్ ఆసియా అంతర్జాతీయ ఛాంపియన్షిప్ నేపాల్ దేశం ఖాట్మండులో జరగనున్న పోటీలలో పాల్గొననున్నారని గోల్ షాట్ బాల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్ రెడ్డి తెలిపారు. తండ్రి రామకృష్ణ కుటుంబ పోషణకై కువైట్‌లో పనిచేస్తారు. తల్లి సుబ్బమ్మ వ్యవసాయం చేస్తారు. దేవి ప్రియ మెరిటస్ అకాడమీ జూనియర్ ప్రైవేట్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. దేవీ ప్రియ క్రీడాప్రస్థానం తన చిన్ననాటి నుండి మొదలు 2010 నుండి 2025 వరకు హాకీ, ఫుడ్బాల్, వాలీబాల్, షూటింగ్ బాల్ మొదలగు వాటిల్లో రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో రాణించింది.

# 'సరస్వతిపవర్' ఒప్పందాలు అందుకే రద్దు

## షర్మిలకు చట్టబద్ధ హక్కులు లేవు: ఎన్‌పిఎస్‌టిలో జగన్

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** సరస్వతి పవర్ లిమిటెడ్‌తో పాటు కొన్ని ఆస్థులను ప్రేమతో చెల్లి షర్మిలకు ఇవ్వాలని నిర్ణయించి 2019 ఆగస్టు 31న అవగాహన ఒప్పందం,వాటాల బదిలీల ఒప్పందం కుదుర్చుకున్నామని, అయితే షర్మిళ రాజకీయంగా వ్యక్తిగతంగానూ తన ప్రతిష్టను దెబ్బతీయంతో ఈ ఒప్పందాలను అమలు చేయకూడదని నిర్ణయించుకున్నట్లు ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చెన్నై లోని జాతీయ కంపెనీ అప్పీలెట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ)కి నివేదించారు. సరస్వతి పవర్ లిమిటెడ్ ఆస్థుల జప్తునకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తెలంగాణ హైకోర్టులో అప్పీలు దాఖలు చేసిందని, ఈ కేసులన్నీ పూర్తయ్యాక ఆస్థులు వాటాల బదలాయింపు అమలు చేయాలని గతంలో నిర్ణయించుకున్నట్లు తెలిపారు. చెల్లిపై ప్రేమతో భవిష్యత్తులో ఆస్థులు బదలాయించడానికే గతంలో ఒప్పందం కుదిరిందన్నారు. ఈ ఆస్థులన్నీ తన స్వార్జితమని,షర్మిళకు ఎలాంటి పట్టబద్దమైన హక్కులూ లేవన్నారు. ఎలాంటి చట్టబద్ధమైన పత్రాలు లేకుండా విజయమ్మ,చాగరి జనార్ధనరెడ్డిల తేఖల ఆధారంగా తమ పేర్లతో ఉన్న వాటాలను బదలాయిస్తూ సరస్వతి కంపెనీ బోర్డు ఏకపక్షంగా తీర్మానం చేసిందని, ఈ తీర్మానాన్ని సవాలు చేస్తూ,తాను హైదరాబాద్ జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో పిటీషన్ వేసినట్లు తెలిపారు. దీనిపై విచారించిన ఎన్‌సీఎల్‌టీ సరస్వతి కంపెనీ బోర్డు తీర్మానాన్ని రద్దు చేసి వాటాలను పునరుద్దరించాలని ఆదేశించిందన్నారు.ఈ ఆదేశాల అనంతరం తన వాటా 29.88 భారతిరెడ్డి 16.30 క్లాసిక్ రియాలిటీ వాటా 4.83,విజయమ్మ వాటా 48.99 శాతం చొప్పున పునరుద్దరించాల్సి ఉందన్నారు. దీనికి విరుద్దంగా ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సరస్వతి పవర్ లిమిటెడ్ ఇక్కడ అప్పీలు దాఖలు చేసిందన్నారు. ఇలా అప్పీలు దాఖలు చేసే అర్హత సరస్వతి పవర్ లిమిటెడ్‌కు లేదని తెలిపారు. ఎన్‌సీఎల్‌టీ ఉత్తర్వుల వల్ల కంపెనీకి ఎలాంటి నష్టం వాటిల్లలేదన్నారు. తటస్థంగా ఉండాల్సి న సరస్వతి పవర్ కంపెనీ వైఎస్ విజయమ్మ,చాగరి జనార్థన్‌రెడ్డిల తరపున వకాల్తా పుచ్చుకునేందుకు వీల్లేదన్నారు. బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ చట్ట విరుద్దంగా వ్యవహరించినపుపడు వారిని సమర్థిస్తూ కంపెనీ అప్పీఊలు చేయడానికి వీల్లేదన్నారు. తల్లి విజయమ్మ ట్రస్టీగా చెల్లికి వాటాలతో సహా కొన్ని ఆస్థులు ఇవ్వడానికి అవగాహన ఒప్పందం కుదిరిందన్నారు. కోర్టు కేసులు తేలిన తర్వాత బదలాయింపు నిమిత్తం వాటాల సర్టిఫికెట్లు కూడా ఇవ్వలేదన్నారు. వాటాల బదలాయింపును సమర్ధించుకునేందుకు సరస్వతి కంపెనీ ప్రయత్నిస్తోందన్నారు. తనతో పాటు భారతిరెడ్డి,క్లాసిక్ రియాలిటీలు విజయమ్మకు గిఫ్ట్‌డీడ్‌లు ఇచ్చామని, ఇందులో సరస్వతి కంపెనీ ప్రమేయం లేకపోయినా వారి తరపున వాదనలు వినిపించిందన్నారు. వాటాల బదలాయింపు ఒప్పందం జరిగిన మూడేళ్ళు మౌనంగా ఉండి తర్వాత బదలాయించడాన్ని సమర్ధించుకోవడానికి సరైన కారణం లేదన్నారు. ఎన్‌సిఎల్‌టీ తీర్పుపై ఇచ్చిన స్టే ఉత్తర్వులు తొలగించాలని అభ్యర్థించారు.

# చినగొలుగువలసలో అగ్ని ప్రమాదం

## వృద్ధురాలు మృతి.. 12 పూరిళ్లు దగ్ధం.. ఆరు లక్షల ఆస్తి నష్టం



**తెర్లాం (విజయనగరం జిల్లా) డిసెంబర్ 13 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా తెర్లాం మండలంలో కొరటాం గ్రామపంచాయతీ మధుర గ్రామం సీతారాంపురం (చిన గొలుగువలస) గ్రామంలో శుక్రవారం రాత్రి 11 గంటలకు అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కోస్ట్ పాపమ్మ (70) అగ్నికి ఆహుతయ్యింది. ఈ ప్రమాదంలో 12 ఇళ్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాద బాధితులంతా కూలీలు, గీత కార్మికులు. రాత్రి ఒక్కసారి మంటలు రావడంతో, అనంతరం పెద్ద శబ్దం రావడంతో ప్రజలు భయాందోళనతో పరుగులు తీశారు. సంఘటన స్థలానికి స్థానిక ఎస్సై జి.సాగర్‌బాబు, తహసిల్దార్, సిబ్బంది హాజరయ్యారు. రాజాం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే తహసిల్దార్ జి.హేమంత్ కుమార్ రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. బాధితులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సహాయక చర్యలు చేపట్టారు. శనివారం బాధితులకు ఐదు రోజులకు సరిపడ వంటసామగ్రిని అందజేశారు. బొబ్బిలి రెవెన్యూ డివిజనల్ అధికారి రామ్మోహన్‌రావు సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితులకు తక్షణ సహాయం కింద 13 వేల రూపాయలు వంట సామాగ్రి కలిపి అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రూరల్ సీఐ కే.నారాయణరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాద సంఘటనలో హెచ్‌డిటి జి. సత్యనారాయణ, ఆర్ఐ కృష్ణమూర్తి, విఆర్వోలు గణపతి, రాము, రవికుమార్, సుధాకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ ప్రమాదంలో రెండున్నర తులాల బంగారం, 80 వేల రూపాయలు నగదు, 50 తులాలు వెండి కాలి బూడిద అయిందని, అదేవిధంగా కోస్ట్ అప్పడుకు చెందిన అర తులం బంగారం, లక్ష రూపాయలు నగదు కాలిపోయాయి.

# లింగాలవలస ఎయిర్‌పోర్ట్ కాలనీలో దారుణ హత్య

**భోగాపురం (విజయనగరం జిల్లా), డిసెంబర్ 13 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా భోగాపురం మండలం లింగాలవలస ఎయిర్‌పోర్ట్ కాలనీలో దారుణ హత్య చోటుచేసుకుంది. ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు ముడసల అప్పయ్యమ్మను గుర్తు తెలియని దుండగులు హతమార్చి, ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. అదే విధముగా మృతురాలు ఇంటి పక్కనే ఉన్న వాటర్ ట్యాంక్ సమీపంలో మృతదేహం ఉండటం గమనార్హంగావుంది. కుటుంబ సభ్యులు తీరదయాత్రకు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగినట్టు తెలిపారు. అప్పయ్యమ్మ మృతదేహం సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్ద పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అలాగే పోలీసులకు సమాచారం అందించడముతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దుండగులను గుర్తించి త్వరలో అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు.ఈ ఘటనతో లింగాలవలస ఎయిర్‌పోర్ట్ కాలనీలో భయాందోళనలు నెలకొన్నాయి.

# ఇన్ సర్వీస్ వైద్యులకు డిఎన్‌బి సీట్ల కేటాయింపు

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** సర్వీసులో ఉన్న వైద్యుల కోసం (ఇన్ సర్వీస్) 2025-26 సంవత్సరానికి సంబంధించి డీఎన్‌బీ (డిప్లొమేట్ ఆఫ్ నేషనల్ బోర్డు) సీట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్ళ కాలపరిమితితో కూడిన పోస్ట్ ఎంబీబీఎస్ డీఎన్‌బీ కోర్సుకు సంబంధించి విజయనగరంలోని వైద్యకళాశాలలకు ఆర్థోపెడిక్, నంద్యాల వైద్య కళాశాలకు ఎమర్జెన్సీ మెడిసిన్,అనకాపల్లిలో ఎబీజీ విభాగాల్లో ఒక్క సీటు కేటాయించింది. పోస్టు ఎంబీబీఎస్ రెండేళ్ళ డీఎన్‌బీ కోర్సుకు సంబంధించి రాష్ట్రం లోని 18 భోధనాస్పత్రుల్లో అనస్థీషియా-6,ఎబీజీ-5, పీడియాట్రిక్స్- 3,ఈఎన్‌టీ-2, ఆర్థోపెడిక్-5,మెడిసిన్-5,రేడియోలజీ-5 సీట్లు చొప్పున మొత్తం 27 సీట్లు కేటాయించింది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మెడికల్ కౌన్సిల్ ఎన్నికల నిర్వహణకు ఆర్వో నియామకం ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఎన్నికల నిర్వహణకు సెకండరీ హెల్త్ డైరెక్టర్‌ను రిటర్నింగ్ అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఏపీ హైకోర్టు గత నెల 11న ఇచ్చిన ఆదేశాలకనుగుణంగా త్వరగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

# ఎన్టీఆర్ జిల్లాలో సమసిపోని టిడిపి వర్గపోరు

**- ఎంపి కేశినేని నానిపై తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఆరోపణలు - అధిష్ఠానం చెప్పినా బేఖాతర్**



**విజయవాడ, డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:**ఎన్టీఆర్ జిల్లాలో టీడీపీ వర్గపోరు సమసి పోలేదు.స్వయంగా టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాలతో తిరువూరు ఎంఎల్ఏ కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) నడుమ దాదాపు 18 నెలలుగా సాగుతుంది. రెండు వర్గాలు మీడియా సమావేశాల్లోను, సామాజిక మాధ్యమాల్లో నేరుగా ఆరోపణలకు దిగాయి.ఎప్పటికప్పుడు ఇరు వర్గాల మధ్య సఖ్యత కుదిరించేందుకు టీడీపీ అధిష్టానం ప్రయత్నం చేస్తుంది.విషయం పరిష్కారమయినట్లే అవుతుంది.మళ్ళీ రాజుకుంటుంది.ఎంపీ చిన్నికి కొలికలపూడికి మధ్య జరగుతున్న వర్గపోరులో పరోక్షంగా ఉన్నత సామాజిక వర్గ అహంభావం స్పష్టం ఉందని ఎంఎల్ఏ అనుచరులు బహిరంగంగా ఆరోపణలు సాగించాయి.ఈ వివాద పరిష్కారానికి వెసిన కమిటీలోను అవే వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడం తనకు అన్యాయం జరుగుతుందని కొలికలపూడి వ్యాఖ్యానించినట్లు చెబుతున్నారు.అయితే ఈ వివాదంలో ఎంపీ కేశినేని చిన్ని వర్గీయులు తప్ప,ఆయన పెద్ద స్పందించి ప్రకటనలు చేసిన సందర్భాలు లేవు. ఈ క్రమంలో "నువ్వు దేనికి అధ్యక్షుడివి? పేకాట క్లబ్‌కా ? పేకాట కోసం ఆఫీస్ పెట్టావంటే నువ్వు నిజంగా రాయల్వే" అంటూ ఎన్టిఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తన వాట్సప్ స్టేటస్‌లో పోస్టు పెట్టడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. "కొండపర్వ గట్టు దగ్గర డే అండ్ నైట్ పేకాట మ్యాచ్ ఆడిస్తున్నావ్వు అంటూ స్టేటస్‌లో వ్యాఖ్యలు పెట్టారు. ఈ పోస్టులు ఎవరినుద్దేశించో పెట్టారో అర్థంగాక టిడిపి శ్రేణులు జుట్టు పీక్కుంటున్నాయి. దీంతో తిరువూరు నియోజకవర్గ టిడిపిలో రచ్చ మరోసారి తారాస్థాయికి చేరినట్లయింది. విజయవాడ ఎంపి, టిడిపి నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని) గ్రూపునకు చెందిన వారు ఇటీవల ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య వద్దకు వెళ్లి ఎంఎల్ఏ కొలికపూడి వ్యవహారశైలిపైనా, తిరువూరు నియోజకవర్గంలో పార్టీ దుస్థితిపైనా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే ఎంఎల్ఏ కొలికపూడి పైవిధంగా ఎంపి గ్రూపునకు చెందిన వారిపై స్పందించినట్లు ప్రచారం జరుగుతోంది. వర్ల రామయ్య వద్దకు వెళ్లిన వారిలో టిడిపి విస్సన్నపేట మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు కూడా ఉన్నారు. ఎంఎల్ఏ పెట్టిన పోస్టుపై రాయల సుబ్బారావు స్పందించి మీడియా ముందుకు వచ్చారు. తననుద్దేశించే ఎంఎల్ఏ పోస్టు పెట్టారని భావించిన ఆయన విస్సన్నపేటలో మీడియా సమావేశం పెట్టి కొలికపూడిపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. బెల్ట్ షాపులు లేకుండా చేస్తానని చెప్పి వైన్‌షాపు డీలర్ల నుండి ఎంఎల్ఏ డబ్బులు తీసుకున్నారని, గత ఏడాది సంక్రాంతి పండుగ సమయంలో కోడిపందేల బరుల వద్దకు వెళ్లి పందెందారుల నుండి ఎన్ని డబ్బులు తీసుకున్నారో అందరికీ తెలుసునని విమర్శిం చారు. గోపాలపురం క్వారీలో అక్రమంగా గ్రావెల్ తోలించారని ఆరోపించారు.

# ఏ రాష్ట్రంలో లేని విధంగా నూతన పారిశ్రామిక విధానం ఏపిలో ఉంది: మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయవాడ, డిసెంబరు 13,ప్ర భాత వార్తప్రతినిధి:** దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నూతన పారిశ్రామిక విధా నాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఏపీ చాంబర్స్ బిజినెస్ ఎక్స్ పోలో మంత్రి మాట్లాడుతూ.. పాతికేళ్ళ క్రితం చంద్రబాబు ఎలా ఆలోచించారో చూశామని.. ఐటీకి భవిష్యత్తు ఉంటుందని, నాటి యువతను ప్రోత్సహించారని గుర్తుచేశారు. అవసరమైన మౌళిక సదుపాయాలను ఆ నాడు ఏర్పాటు చేశారని తెలిపారు. తాను ఐటీ రంగంలో 16 ఏళ్ళు రాణించానంటే చంద్రబాబు నాయుడు ఆనాడు ఏర్పాటు చేసిన విధానాలే కారణమని చెప్పుకొచ్చారు. ప్రతీ ప్రొడక్ట్ కూడా భారత సమాజంలో విక్రయించే అవకాశం ఉంటుందని.. ప్రపంచంలో వాడే ప్రతీ వస్తువు భారత్‌లో వినియోగిస్తారని తెలిపారు. భారత్ వైపు ప్రపంచం చూస్తోందన్నారు. భారత్‌లో పెట్టుబడులు ఎలా పెట్టాలని.. భారత్ మార్కెట్‌లో ఎలా అడుగు పెట్టాలనే దానిపై ప్రపంచ దేశాలు చూస్తున్నాయని వెల్లడించారు. ఈ మేరకు ఎన్డీఏ ప్రభుత్వం, ప్రధాని పని చేస్తున్నారని అన్నారు. డ్రోన్ టెక్నాలజీ, ఏరో స్పేస్, బయో టెక్నాలజీ ఇలా అనేక రంగాల్లో క్లస్టర్లను ఏర్పాటు చేశారని మంత్రి తెలిపారు. చంద్రబాబు నాయుడు పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా పని చేస్తున్నారన్నారు. చిన్న తరహా పరిశ్రమలు అన్నీ ఆ దిశగా అడుగులు వేయాలని.. పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని సూచనలు చేశారు.పెద్ద పరిశ్రమలు వచ్చే దగ్గర చిన్న తరహా పరిశ్రమలకు అవకాశాలు ఉన్నాయని.. వాటిని చిన్న తరహా పరిశ్రమల పారిశ్రామిక వేత్తలు వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తులకు భారత్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు.

# జరీబు భూముల సమస్యలను నెల రోజుల్లో పరిష్కరిస్తాం : కేంద్ర మంత్రి పెమ్మసాని

**విజయవాడ,డిసెంబరు 13. ప్రభాతవార్తప్రతినిధి:** జరీబు భూముల సమస్యల పరిష్కారానికి నెల రోజుల సమయం పడుతుందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. నెల స్వభావంపై పరీక్షలు నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సీఆర్డీఏ కార్యకలాపాలపై ఆయన సమీక్ష నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సీఆర్డీఏ కార్యకలాపాలపై ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు.ఉండవల్లి లేఅవుట్ అభివృద్ధి ప్రారంభమైదని పేర్కొన్నారు. లంక జభూముల సమస్య కూడా పరిష్కారమైందని చెప్పారు. 7 వేల ప్లాట్ల రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉందని వివరించారు. 'భూ సమీకరణ చేయని భూముల్లో ప్లాట్లు పొందిన వారి సమస్య పెండింగ్‌లో ఉంది. అక్కడ రైతులతో ఎంఎల్ఏ మంత్రి మాట్లాడాక భూసేకరణకు వెళ్తాం.వేరే చోట్ల ప్లాట్లు కావాలని అడిగిన వారికి లాటరీ ద్వారా కేటాయించే చర్యలు తీసుకుంటాం.పెద్ద ప్లాట్లు పొందేవారు కొంత సమయం వేచి ఉండాలి. కమర్షియల్ ప్లాట్లలో వాస్తు ప్రకారం ఉండాలని కొందరు అడిటారు. 7 ఎకరాల మేర ప్లాట్లు మార్చాల్సి ఉంటుంది. రైతులు మళ్ళీ వాస్తు పేరిట రావొద్దని కోరుతున్నాం. 26 గ్రామాల్లో అభివృద్ధి పనుల డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్నాం.వారంలో డీపీఆర్‌లు సిద్ధం చేసి నెలాఖరులోగా పనులు ప్రారంభిస్తాం. సామాజిక అభివృద్ధిలో భాగంగా కమ్యూనిటీ హాళ్ళు,శ మ్శానాలు నిర్మిస్తాం.వీటికి భూమి, నిధులు సమకూరుస్తున్నాం.

# ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరులో కిడ్నీ వ్యాధుల నియంత్రణకు చర్యలు

- ఎ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని నాలుగు పడకల డయాలసిస్ కేంద్రం ద్వారా సేవలు : జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఎం.సుహాసిని

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎ.కొండూరులో కిడ్నీ వ్యాధుల నియంత్రణకు విస్తృత, నిరంతర ఆరోగ్య చర్యలు చేపడుతున్నామని ఆ శాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎం. సుహాసిని తెలిపారు.రోగుల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలుచేస్తున్నామన్నారు.ఈ చర్యల కారణంగానే సీకేడీ వ్యాధి తీవ్రత తగ్గిందని గ్రామస్థాయిలోనే వ్యాధికి జీవనాధార చికిత్సలు అందుబాటులో ఉన్నాయని.. ఎ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని నాలుగు పడకల డయాలసిస్ కేంద్రం ద్వారా సేవలు అందుతున్నాయన్నారు. ప్రస్తుతం ఇక్కడ 26 మంది రోగులు ఈ సేవలు పొందుతున్నారన్నారు. విజయవాడకు వెళ్లాల్సి న అవసరం లేకుండానే రోగులు ఇక్కడ సేవలు పొందుతున్నారన్నారు. ప్రతి డయాలసిస్ రోగికి ప్రభుత్వం ద్వారా నెలకు రూ. 10 వేల ఆర్థిక సహాయం అందుతోందన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు సమగ్ర వైద్య పర్యవేక్షణ అందించేందుకు నెఫ్రాలజిస్ట్ ఓపీ సేవలను విస్తరించినట్లు తెలిపారు. ఈ సేవల ద్వారా రోగులకు నేరుగా నిపుణుల సలహాలు, చికిత్స మార్గదర్శకాలు, మందుల సర్దుబాటు, అవసరమైన సూచనలు అందుతున్నాయని.. దీనివల్ల వ్యాధి తీవ్రతను తొలిదశలోనే గుర్తించి నియంత్రించే అవకాశం పెరిగిం దన్నారు. జిల్లా కలెక్టర్ వారి మార్గ నిర్దేశనంతో ఎ.కొండూరు ప్రాంతంలో వైద్య ఆరోగ్య శాఖతో పాటు సమన్వయ శాఖల అధికారుల బృందాలు నిరంతర పర్యవేక్షణలో ప్రత్యేక సర్వేలు నిర్వహిస్తు న్నట్లు డీఎంహె చ్వో తెలిపారు. మొదటి సర్వేలో 242 కేసులను గుర్తించగా.. ఇటీవలి సర్వే నాటికి ఈ సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. నిరంతర మందుల వినియోగం, జీవనశైలి మార్పులు, వైద్య పర్యవేక్షణ వల్ల కొందరు రోగులు పూర్తిగా కోలుకోగా, మరికొందరిలో వ్యాధి తీవ్రత తగ్గిందని వివరించారు. డయాలిసిస్ అవసరమైన రోగుల సంఖ్య స్థిరంగా ఉండటం చికిత్సల ప్రభావం ఇచ్చిన ఫలితాలకు నిదర్శనమన్నారు. మూత్రపిండ వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులు, పోషక సప్లిమెంట్లు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు నిర్వహిస్తూ రోగుల ఆరోగ్య స్థితిని సమగ్రంగా పరిశీలిస్తుమన్నారు. డయాలిసిస్, ఇతర చికిత్సల కోసం రోగులకు ప్రత్యేక రవాణా సౌకర్యం అందుబాటులో ఉంది.



కిడ్నీ వ్యాధిగ్రస్తులను పరామర్శిస్తున్న ఏన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఎం.సుహాసిని

# ఇడబ్ల్యుఎస్, కాపు వర్గాలకు క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీల ఏర్పాటు : మంత్రి ఎస్.సవిత



**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:**బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరహాలో అన్ని ఇడబ్ల్యుఎస్, కాపు వర్గాలకు క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీలను ఏర్పాటు చేయనున్నట్లు బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. ఇడబ్ల్యుఎస్, కాపు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లతో రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 201419ల మధ్య ఇడబ్ల్యుఎస్ సామాజిక వర్గాల కోసం అమలు చేసిన అన్ని పథకాలను తిరిగి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్యులు కోరిన విధంగా కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మర్పణ దినాన్ని అధికారిక కార్యక్రమంగా నిర్వహించామన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఇ పార్కుల్లో ఇడబ్ల్యుఎస్ సామాజిక వర్గాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు వెల్లడించారు. వివిధ పథకాల అమలులో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇడబ్ల్యుఎస్ కార్పొరేషన్‌లకు కూటమి ప్రభుత్వం రూ.10,608.61 కోట్లు కేటాయించిందన్నారు. వాటిలో ఇబిసిలకు రూ.915.28 కోట్లు, కమ్మ కార్పొరేషన్‌కు రూ.1,711.42 కోట్లు, క్షత్రియ కార్పొరేషన్‌కు రూ.1,946.36 కోట్లు, క్షత్రియ కార్పొరేషన్‌కు రూ.260.20 కోట్లు, కాపు కార్పొరేషన్‌కు రూ.4,884.83 కోట్లు, ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు రూ.545.05 కోట్లు, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.345.46 కోట్లు కేటాయించామని తెలిపారు. కాపుల అభ్యున్నతి కోసం సీఎం చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. 201419లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం రూ.172 కోట్లతో మంజూరు చేసిన 13 జిల్లా స్థాయి కాపు భవనాలను, 487 మినీ కాపు భవనాలు/కాపు కమ్యూనిటీ హాళ్లను గాలి కొదిలేసిందన్నారు.

## శేషవస్త్రం కొనుగోలు టెండరు రద్దు - నూతనంగా కొనుగోలుకు అనుమతి

**తిరుమల,డిసెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి దర్శనంలో భాగంగా ప్రముఖులు, దాతలు, ఆర్జితసేవల భక్తులకు కల్పించే వేదాశీర్వచనంకోసం పట్టుశేషవస్త్రాల సరఫరా టెండర్‌ను టిటిడి రద్దుచేసింది. ఆ స్థానంలో కొత్తవారికి అవకాశం ఇచ్చి అసలైన పట్టువస్త్రాల కొనుగోలుపై దృష్టి సారించింది. గత కొన్నేళ్ళుగా పట్టుదుప్పట శేషవస్త్రంకు బదులు పాలిస్టర్‌తో తయారైన వస్త్రం సరఫరాతో నగరి ఏకాంబరకుప్పానికి చెందిన విఆర్ఎస్ ఎక్స్‌పోర్ట్స్ టెండర్‌ను బోర్డు రద్దుచేసింది. ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న వస్త్రాలతోనే వేదాశీర్వచనం చేయాలని నిర్ణయించింది. అంతేగాక పలు సంస్థలతో టిటిడి అధికారులు సంప్రదింపులు చేస్తున్నారు. నకిలీ వస్త్రాలు సరఫరా చేయడంతోనే ఈ చర్యలు తీసుకుంది.

# మైనర్ బాలికను మాదక ద్రవ్యాల ఉచ్చులోకి లాగిన వారిపై కఠిన చర్యలు: ఈగల్ ఐజి ఎకె రవికృష్ణ



**గుంటూరు ఈస్ట్ క్రైమ్, డిసెంబర్ 13, ప్రభాతవార్త:** మైనర్ బాలికకు, ఆమె కుటుంబానికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా సమగ్ర దర్యాప్తు చేపట్టి, నిందితులకు సత్వర శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ వెల్లడించారు. లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నబజార్ ప్రాంత నివాసితులైన ఒక దంపతుల కుమార్తె (మైనర్) ఇంటర్మీడియట్ చదువుచుండగా, ఆమెకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన ఇద్దరు యువకులు ప్రేమ పేరుతో ఆమెను నమ్మించి, మాదక ద్రవ్యాల మత్తుకు అలవాటు చేసి, వాటికి బానిసగా మార్చినట్లు ప్రాథమిక విచారణలో వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనతో తీవ్ర మానసిక ఆవేదనకు గురైన బాలిక తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఈగల్ ఐజీ శ్రీ ఏ.కే. రవికృష్ణ, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించి, డ్యూటీలో ఉన్న వైద్యుల నుంచి బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై వివరాలు తెలుసుకుని, బాధ్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. అదేవిధంగా డ్రగ్స్‌కు బానిసైన మైనర్ బాలికకు అవసరమైన కౌన్సెలింగ్ నిర్వహించి, డీఅడిక్షన్ కేంద్రం ద్వారా చికిత్స అందించి ఆమె సాధారణ స్థితికి చేరుకునేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈగల్ ఏ.కే. రవికృష్ణ మాట్లాడుతూసోషల్ మీడియా ద్వారా మైనర్ విద్యార్థినిని మాదక ద్రవ్యాల ఉచ్చులోకి లాగిన ఘటన అత్యంత తీవ్రమైనదని, ఈ కేసులో బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ తన మాట వినడం లేదని బాలికను ఆమె తల్లి వారించే సరికి బాలిక ఆమెపై తిరగబడిందని, అదే విధంగా ఆమె కొంతకాలంగా డ్రగ్స్ తీసుకుంటుందని తెలుసుకుని ఆ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం జరిగింది.ఆ బాలికకు డ్రగ్స్ ఎక్కడ నుండి వస్తున్నాయి?, ఎవరు ఇస్తున్నారు? అనే కోణంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విచారించడం జరుగుతుందన్నారు. గడిచిన మూడు నెలల్లో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు సేవిస్తున్న సుమారు 150 మందిని గుర్తించి, వారిపై కేసులు నమోదు చేయడం జరిగింది.ఈ కేసుల్లో మాదక ద్రవ్యాలు ఎక్కడ నుండి వస్తున్నాయి?, ఎవరు తెస్తున్నారు?, ఎవరు విక్రయిస్తున్నారు? అనే కోణంలో దర్యాప్తులు జరుపుతూ బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయడం జరుగుతుంది కొన్ని కాలేజీల్లోని విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని మాకు సమాచారం ఉంది.

# వైభవంగా భవానీ దీక్షల విరమణ ఉత్సవాలు



**ఇంద్రకీలాద్రి, డిసెంబర్ 13, ప్రభాత వార్త :** మూడోరోజు భవానీ దీక్షలు విరమణ ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. శనివారం దీక్షధారులు భక్తుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. వారికి సరైన వసతులు, సౌకర్యాలు అందేలా ఇఓ, ఛైర్మన్ పాలకమండలి , అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. భక్తిశ్రద్ధలతో దీక్షాధారులు ఇరుముడులను శిరస్సున ధరించి దుర్గమ్మవారి ఆలయానికి జై దుర్గా... జైజై దుర్గా నామస్మరణతో చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి ఇరుముడులు భక్తితో సమర్పించుకున్నారు. శ్రీ అమ్మవారు దీక్షల సందర్భంగా అమ్మవారి ప్రత్యేక పూల అలంకరణతో భక్తులను అనుగ్రహించారు.

– మూడోరోజు ఆదాయం: దుర్గమ్మవారి ఆలయంలో శ్రీ భవానీ దీక్షల విరమణల సందర్భంగా ప్రసాదాల అమ్మకాలు, కేశఖండన తదితరాల ద్వారా మొత్తం రు,62,09,425ల ఆదాయం లభించిందని ఇఓ తెలిపారు. అదేవిధంగా రెండోరోజైన శుక్రవారం రు.72,16,431ల ఆదాయం లబించిందన్నారు.

# వికసిత్ భారత్ 2047 సాధనకు విద్యారంగంలో ఉపాధ్యాయుల పాత్ర గురుతరం:సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ





ఆంధ్రప్రదేశ్ ప్రాంత అభ్యాస వర్గ (స్టేట్ ఫ్యాకల్టీ ట్రైనింగ్) కార్యక్రమంలో మాట్లాడుతున్న వీవీ లక్ష్మీ నారాయణ

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** వికసిత భారత 2047 సాధనకు విద్యారంగంలో ఉపాధ్యాయుల పాత్ర గురుతరమని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్, వీవీ లక్ష్మీ నారాయణ అన్నారు. తాడేపల్లి, వడ్డేశ్వరం లోని కే ఎల్ విశ్వవిద్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం), ఆంధ్రప్రదేశ్ ప్రాంత అభ్యాస వర్గ (స్టేట్ ఫ్యాకల్టీ ట్రైనింగ్) కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థులను తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర తరగతి నుండి మొదలవుతుందని ప్రాచీన గురు శిష్య విధానం ఎప్పటికీ అనుసరణీయమని, విశేషమైందని అన్నారు. భారత్ అంటేనే సూర్య కాంతి, జ్ఞాన కాంతిల సమ్మేళనం అన్నారు. వేదాల స్ఫూర్తితో విద్యార్థులను జ్ఞాన సముపార్జన దిశగా ప్రోత్సహిచాలన్నారు. గురు శిష్య పరంపర విశేషమైందని విద్యార్థులలో ప్రశ్నించే అలవాటును కలగ చేయాలన్నారు. తర్కం, మీమాంస, భారతీయతత్వం లో ఇమిడి ఉన్నాయన్నారు. విద్యా ర్థులను చైతన్యవంతులుగా మార్చుతూ ధర్మబద్ధమైన జీవనం ఎలా ఉంటుందో చెప్పాలన్నారు. ఆలోచనా పరిధిని విస్తృతం చేయాలన్నారు. మాతృ భాషను వాడుక భాషనుఅలవరు చుకోవడం అత్యవసరమన్నారు.. పిల్లల్లో సృజనాత్మక శక్తి పెంపొందించాలి, కొత్తగా ఆలోచించడం అవసరం, విలువలు, నైతికత జీవనసాఫల్యతకు ఎంత అవసరమో మార్గదర్శనం చేయవలసిన అవసరం ఉంది అని లక్ష్మీ నారాయణ అన్నారు. కే ఎల్ యు వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్ రావు మాట్లాడుతూ దేశానికి ఉపాధ్యాయులు అందరూ జాతీయ స్ఫూర్తితో పాటు తమ సబ్జెక్టులో అద్భుతమైన నైపుణ్యాలు కలిగి ఉండి విద్యార్థులు తమ సబ్జెక్టులలో ప్రతిభ కనబరచే విధంగా పనిచేయాలని కోరారు. ఏబీఆర్ఎస్ఎం జాతీయ కార్యదర్శి, ప్రధాన వక్త గుంత లక్ష్మణ్ జీ మాట్లాడుతూ దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అగ్రగామి ఉపాధ్యాయ సంస్థ అని, భారతదేశంలో ప్రాథమిక దశ నుండి ఉన్నత విద్యా సంస్థల వరకు 15 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని తెలియజేశారు. దేశ సంస్కృతి, సాంప్రదాయాలు,ఆచారాలు ,విలువలు, మానవీయత ఆధారంగా విద్యా విధానము ముందుకు వెళ్లాలని తద్వారా మాత్రమే భారత విశ్వ గురువుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ కే. మధుమూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 2047 నాటికి భారతదేశాన్ని విశ్వ గురువు గా మార్చడములో ముఖ్యంగా విద్యా వ్యవస్థ, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. పరిశ్రమ, వ్యవసాయం, గృహనిర్మాణం, ఆరోగ్యం వంటి రంగాలలో దేశాభివృద్ధికి, సమాజ అవసరాలకు సరిపోయేలా భారతీయ విద్యా వ్యవస్థను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం జాతీయ విద్యా విధానం 2020 తీసుకువచ్చిందని మరియు మరిన్ని ఉద్యోగాలను సృష్టించడం, దేశంలో పేదరికాన్ని నిర్మూలించడం లక్ష్యంగా పని చేస్తుందన్నారు. భారతీయ విద్యా వ్యవస్థను ఆధునీకరించడం లో ప్రాచీన భారతీయ విజ్ఞాన వ్యవస్థ మరియు భారతీయ వారసత్వాన్ని గుర్తించాలన్నారు. వికసిత్ భారత్ ,స్వర్ణాంధ్ర సాధన లో నూతన జాతీయ విద్యా విధానం ప్రముఖమైన పాత్ర పోషిస్తుందని తెలియజేశారు. డిగ్రీ ,ఇంజనీరింగ్ , ఇంటర్మీడియట్ కళాశాలలు, రాష్ట్ర, మరియు కేంద్రీయ విశ్వవిద్యాలయాలు. ఇతర ఉన్నత విద్యా సంస్థల నుండి 200 మంది ప్రతినిధులు రాష్ట్ర అభ్యాస వర్గకు హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎబిఆర్ ఎస్ఎం ప్రొఫెసర్ డిఎస్వవిఎస్ బాల సుబ్రమణ్యం, డాక్టర్ సంధ్య అధూరి, రాష్ట్ర మహిళా ప్రముఖలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఇంధన సంరక్షణలో ఎపికి నాలుగోసారి పురస్కారం

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ వెల్లడి

## అవార్డు అందుకోనున్న ఎపి ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్



**విజయవాడ, డిసెంబర్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం మరోసారి ఎనర్జీ ఎఫిషెన్సీ రంగంలో దేశవ్యాప్తంగా తన ప్రతిభను చాటి చెబుతూ వరుసగా నాలుగో ఏడాది ప్రతిష్ఠాత్మక జాతీయ ఇంధన సంరక్షణ అవార్డుని సాధించిందని, ఇది రాష్ట్రం ఇంధన సంరక్షణ, ఇంధన సామర్థ్య అభివృద్ధి రంగాలలో స్థిరంగా ముందుకు సాగుతున్న పురోగతిని ప్రతిబింబించే అసాధారణమైన మైలురాయి అని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ పేర్కొన్నారు. జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డుల ప్రకటనలో భాగంగా, ఏపీకి జాతీయ స్థాయిలో ప్రథమ అవార్డు లభించిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఈ అరుదైన విజయంతో ఆంధ్ర ప్రదేశ్ దేశంలోనే అత్యంత సృజనాత్మకంగా, అన్ని రాష్ట్రాలకు రోల్ మోడల్ గా ఇంధన సామర్థ్యాన్ని పెంపొందిస్తున్న రాష్ట్రంగా నిలిచిందని చెప్పారు. రాష్ట్రం లోని ప్రభుత్వ భవనాలు, పారిశ్రామిక, మునిసిపల్, వ్యవసాయ, డిస్కం, రవాణా వంటి అన్ని ప్రధాన రంగాలలో రాష్ట్రం ఇంధన సామర్థ్య కార్యక్రమాలలో పురోగతి కనబరచడంతోనే నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు–2025లో గ్రూప్॥ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి అవార్డు కైవసం చేసుకుందని కె విజయానంద్ వివరించారు. విద్యుత్ రంగం సాధిస్తున్న పురోగతి లోను, విద్యుత్ ఆదా లో రాష్ట్రం సాధించిన ఈ విజయం లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి దూరదృష్టి, గొట్టిపాటి రవికుమార్ గారి సహాయ సహకారాలు ఉన్నాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపారు. సమగ్ర, విస్తృత, ప్రభావవంతమైన విద్యుత్ ఆదా (ఎనర్జీ కన్జర్వేషన్) కార్యక్రమాలను రాష్ట్రంలో అమలు చేయడంలో దేశంలోనే అగ్రస్థానంలో ఏపీ ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పాటు ప్రజల పూర్తి సహకారం తోనే జాతీయ స్థాయిలో ఈ గుర్తింపు సాధ్యమయ్యిందని తెలిపారు.నాలుగేళ్ల వరుసగా ఈ ప్రతిష్టాత్మక అవార్డు సాధించడం ద్వారా రాష్ట్రం యొక్క ఇంధన సంరక్షణ సామర్థంలో ఉన్న సంస్థాగత బలం , నిరంతర కృషి కి నిదర్శనమని, ఈ సందర్భంగా ఏపీఎస్ఈసిఎం సిఈఓ ఎస్. నాగలక్ష్మి , ఎస్ఈసిఎం బృందాన్ని , సంబంధిత ప్రభుత్వ శాఖలను సిఎస్ అభినందించారు. జాతీయ ఇంధన సంరక్షణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 14 న న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏపీఎస్ఈసిఎం కు జాతీయ అవార్డును ప్రదానం చేయనున్నారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపారు . ఈ అవార్డు స్వీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీఎస్పీడీసిఎల్ సిఎండీ ఎల్. శివశంకర్ ని రాష్ట్ర ప్రతినిధిగా నామినేట్ చేసారు.

## 15న జరగాల్సిన జిల్లాస్థాయి పిజిఆర్ఎస్ రద్దు

**విజయవాడ (గన్నవరం), డిసెంబర్ 13, ప్రభాతవార్త :** ఈనెల 15వతేదీ సోమవారం విజయవాడలోని ఎన్‌టిఆర్ జిల్లాకలెక్టర్ కార్యాలయంలో జరగాల్సిన జిల్లాస్థాయి పిజిఆర్ఎస్‌ను రద్దు చేస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జికలెక్టర్ ఎస్.ఇలక్కియ తెలిపారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై భవానిదీక్షల విరమణ కార్యక్రమం సోమవారం వరకు కొనసాగనున్నందున జిల్లా అధికార యంత్రాంగం మొత్తం భవానిదీక్షల కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నందున ప్రజాసమస్యల పరిష్కారవేదిక( పిజిఆర్ఎస్)ను రద్దుచేస్తున్నట్లు చెప్పారు. తదుపరి సోమవారం నుండి యధావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని, అర్జీదారులు తమ అర్జీలను మీకోసం వెబ్‌సైట్‌లోనూ నమోదు చేయవచ్చని సూచించారు. నమోదైన అర్జీల స్థితి, సమాచారం కోసం 1100 నెంబర్‌కు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చని సూచించారు.

## ఎన్‌టిఆర్‌జిల్లాలో 79,503 మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు

**విజయవాడ (గన్నవరం), డిసెంబర్ 13, ప్రభాతవార్త :** ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎన్‌టిఆర్ జిల్లాలో రైతుల వద్దనుండి 79,503మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈఏడాది మొత్తం 1,50,000మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ధేశించగా జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన రైతుసేవాకేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 10,514మంది రైతుల నుండి 79,503 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసినట్లు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.160.62కోట్ల నగదును రైతులకు చెల్లించినట్లు వివరించారు. ధాన్యం కొనుగోలు చేసిన 24గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమచేస్తున్నట్లు చెప్పారు. జిల్లాపై తుఫాన్ ప్రభావం ఉండటంతో కల్లాలోని ధాన్యాన్ని నేరుగా కొనుగోలు చేయటంతోపాటు, 2,200 టార్పాలిన్‌లను రైతులకు ఉచితంగా అందించినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు అధికారులు వివరించారు.

## కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం



**రాపూరు (నెల్లూరు), డిసెంబర్ 13, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం, గోపూజ, పూలాంగి సేవ నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆధిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేదపండితులు,వేద మంత్రోచ్చరణలతో స్వామి వారి కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ,సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య, తదితరులు పర్యవేక్షించారు.స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.

# డిజిటల్ మోసగాళ్లు అరెస్ట్

**ఆకివీడు ( పశ్చిమ గోదావరి జిల్లా ప్రతినిధి )** గత కొంతకాలంగా డిజిటల్ అరెస్ట్ పేరిట సైబర్ మోసాలకు పాల్పడుతూ లక్షలు కాజేస్తున్న సైబర్ నేరగాళ్లను పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు పోలీసులు అరెస్టు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో సంచలనంగా మారిన ఈ సంఘటనను సవాలుగా తీసుకున్న పోలీసులు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఆధ్వర్యంలో ఆకివీడు సీఐ వి జగదీశ్వరరావు, భీమవరం వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఎం నాగరాజులు నాలుగు బృందాలుగా ఏర్పడి బ్యాంక్ లావాదేవీల విశ్లేషణ, సాంకేతిక ఆధారాలు, అంతర్ రాష్ట్ర దర్యాప్తుల ద్వారా ఈ కేసులో పురోగతి సాధించారు. ఈ మేరకు శనివారం నలుగురు నిందితులను అరెస్టు చేశారు. కేసు వివరాల్లోకెళితే ఆకివీడు పట్టణానికి చెందిన ఓ మహిళా రిటైర్డ్ హైస్కూల్ హెడ్ మాస్టర్ ను లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు తాము పోలీసు అధికారులమంటూ ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్లు అనధికారికంగా ఉపయోగించి అక్రమాలకు పాల్పడ్డారంటూ దీనికై మీ మీద అరెస్టు వారెంట్ విడుదలయిందని నకిలీ పత్రాలను పంపించి బెదిరింపులకు పాల్పడ్డారు. దీనికి డిజిటల్ అరెస్ట్ అనే నూతన పదాన్ని ఉపయోగించారు. దీంతో మానసికంగా భయపడిన మహిళ తనకు చెందిన మూడు ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లకు చెందిన తొమ్మిది ఖాతాలకు 93,25,000 బదిలీ చేశారు. చివర్లో అనుమానంతో డిజిటల్ అరెస్ట్ లేఖను విచారించగా తాను మోసపోయినట్లు గమనించారు. ఈ విషయమై ఆకివీడు పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేయగా శనివారం నలుగురు నిందితులను అరెస్టు చేశారు. అయితే ఇందులో మరికొంతమంది వ్యక్తులు ఉన్నట్లుగా ఆకివీడు సీఐ జగదీశ్వరరావు తెలిపారు. ఇంతవరకు వీరినుంచి 7,34, 240 రూపాయిలు రికవరీ చేశామని, మిగతా సొమ్ము కూడా రాబట్టే ప్రయత్నాల్లో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా సీఐ జగదీశ్వరరావు మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల నుంచి వచ్చే ఫేక్ కాల్స్ కోర్టు నోటీసులు డిజిటల్ అరెస్ట్ వారెంట్లో అంటూ వస్తే నమ్మవద్దని వాళ్ళు అడిగినట్లు డిపాజిట్ కోసం డబ్బు పంపవద్దని, వారి పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. ఈ కేసులో పురోగతి సాధించడానికి సహకరించిన ఎస్సైలు సిహెచ్ నాగరాజు, ఎండి నజీరుల్లా, ఎన్ శ్రీనివాసరావు, వంశీ, రెహమాన్, వీర్రాజులను పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి అభినందించారు.

## అమరావతిలో భూమిలేని పేదల పెన్షన్లపై కీలక నిర్ణయం - త్రిసభ్య కమిటీ పునరాలోచన

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాత వార్తప్రతినిది:..** అమరావతిలో భూమిలేని పేదల పెన్షన్లపై మంత్రుల త్రిసభ్య కమిటీ కీలక నిర్ణయం..4,929 మంది పెన్షన్లపై త్రిసభ్య కమిటీ పునరాలోచన చేసింది. రద్దు అయిన పెన్షన్లపై దరఖాస్తుల స్వీకరణకు దిళిదీతికు గ్రీన్‌సిగ్నల్.అర్హులైన వారికి నెలకు రూ.5 వేల పెన్షన్ ఇచ్చే యోచన.గ్రామసభల సమయంలో అర్జీలు సమర్పించవచ్చుభూమి లేని పేదలకు న్యాయం చేస్తామని ఏపీ త్రిసభ్యకమిటీ నిర్ణయించింది.

## సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డును రాష్ట్ర పాఠశాల ప్రమాణాల అథారిటీ (ఎస్ఎస్ఎస్ఏ)గా ప్రభుత్వ ఉత్తర్వులు

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవాక్తప్రతినిధి:** రాష్ట్రంలో పాఠశాలల నాణ్యత మదింపు, హామీ ఫ్రేమ్ వర్క్ అమలు కోసం సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డును రాష్ట్ర పాఠశాల ప్రమాణాల అథారిటీ (ఎస్ఎస్ఎస్ఏ)గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు అనుమతులు ఇవ్వడం, వాటి నాణ్యతపైన ఈ అథారిటీ దృష్టి సారిస్తుంది. ఆయా పాఠశాలల్లోని ప్రమాణాల ఆధారంగా ప్రగతి, జాగృతి, అభిలాష అనే గ్రేడ్లను ఇస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, నాణ్యత హామీని పెంపొందించడం, మాధ్యమిక పాఠశాలల్లో కనీస వృత్తిపరమైన నాణ్యతా ప్రమాణాలను పాటించేలా చూడటానికి ఎస్ఎస్ఎస్ఏను నియమించింది. ఇందులో పాఠశాల విద్య కార్యదర్శి ఛైర్మన్ గా, డైరెక్టర్ వైస్ ఛైర్మన్ గా, ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి, సమగ్ర శిక్షా ప్రాజెక్టు డైరెక్టర్, ఎస్సీ ఈఆర్టీ డైరె క్టర్ సభ్యులుగా ఉంటారు. ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ మెంబర్ కన్వీనర్ గా వ్యవహరిస్తారు.

# సురక్షితంగా గమ్యం చేరిన బస్సు ప్రమాద బాధితులు

## బాధితులకు అండగా నిలిచిన ఎపి ప్రభుత్వం

**చింతూరు డిశంబర్ 13 ప్రభాతవార్త** మన్యం ప్రాంతానికి అనుకోని అతిధులుగా వచ్చి ,వారు ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదానికి గురై ఆ బస్సులో ప్రయాణిస్తున్న యాత్రికులు 9 మంది మృతిచెందటం,మరో 21 మంది గాయపడటం చాలా భాధాకరం.ఈ ఘటన చింతూరు –మారేడుమిల్లి ఘాట్‌లో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన విషయం అందరికి తెలిసింది.ప్రమాదం జరిగిన వెంటనే ఎపి ప్రభుత్వం స్పందించి ,భాధితులకు అండగా నిలబడి వారిని ఆదుకోవటంలో ప్రభుత్వం,అధికారులు చేపట్టిన చర్యల పట్ల ప్రతి ఒక్కరు సంతృప్తి వ్యక్తం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమాద ఘటనపై దిగ్భ్రాంది వ్యక్తం చేస్తూ హూటా హూటిన హోమ్ మంత్రి అనిత,జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మడి సంధ్యారాణి,రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ,రంపచోడవరం యంయల్‌ఏ మిరియాల శిరీషదేవిని ఘటన స్ధలానికి పంపించి,క్షతగాత్రులను పరమర్శించి వారికి మెరుగైన వైద్యసేవలు అందేలా చేపట్టిన చర్యల పట్ల క్షతగాత్రులతో పాటు స్ధానికులు ప్రభుత్వ చర్యలను అభినందించారు.క్షతగాత్రులతో నిండిన చింతూరు ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి కోటి రెడ్డి,డిప్యూటి డియం అండ్ హెచ్ ఒ పుల్లయ,ఆసుపత్రి వైద్యులు ,సిబ్బంది సేవలను అధికారులు కొనియాడారు.బస్సు ప్రమాదం తెల్లవారుజామున 3గం॥జరిగింది.ఘాట్ రోడ్డులో ఆ సమయంలో పెద్దగా రకపోకలు ఉండవు.ఉదయం 5గం॥ల ప్రాంతంలో చింతూరు యస్.ఐ.రమేష్‌కు ఘాట్ రోడ్డులో బస్సు ప్రమాదం జరిగిందని,చాలా మంది ప్రయాణికులు మృతిచెందినట్టు సమాచారం అందింది.దాంతో వెంటనే స్పందిన ఆయన 108కు సమాచారం అందించి విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు.

చింతూరు సిఐ.గోపాల కృష్ణ,చింతూరు యస్.ఐ.రమేష్,మోతుగూడెం యస్.ఐ.సాధిక్ తమ సిబ్బందితో ఘటన స్ధలానికి చేరుకోని బస్సుఅద్దాలు పగలగొట్టి ప్రమాద బాధితులను బస్సు నుండి బయటకు తీసి చాలామంది ప్రాణాలను రక్షించారు.అప్పటికే 9మంది ప్రాణాలు కోల్పోవటం చాలా భాధకారం.విషయం తెలుసుకున్న చింతూరు ఐటిడిఎ పివో శుభం నోక్వాల్,చింతూరు ఎయస్‌పి హేమంత్ ఘటన స్ధలానికి చేరుకోని పోలీసులు,ఐదు 108ల సహాయంతో క్షతగాత్రులను,మృతదేహాలను చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## ఆధునిక విజ్ఞాన శాస్త్రాలకు న్యాయశాస్త్రమే అసలైన దిక్సూచి

## వైస్ ఛాన్సలర్ డాక్టర్ వెంకట్రావు

**తిరుపతి విద్య, డిసెంబర్ 13 ప్రభాతవార్త** సంప్రదాయ సామాజిక శాస్త్రాల నుంచి వర్తమాన సమాజంలో ప్రాధాన్యత పెరుగుతున్న కృత్రిమ మేధ (ఏ ఐ), సైబర్ క్రైమ్, డిజిటలైజేషన్ మొదలైన ఆధునిక విజ్ఞాన శాస్త్రాలకు న్యాయ శాస్త్రం దిక్సూచి వంటిదనే సత్యాన్ని న్యాయ శాస్త్రాన్ని అధ్యయనం చేసేవారందరూ గుర్తుంచుకోవాలని డాక్టర్ అంబెడ్కర్ గ్లోబల్ లా ఇన్స్టిట్యూట్ లో శనివారం మొదలైన జాతీయ సదస్సులో సంబంధిత రంగ నిపుణులు పిలుపునిచ్చారు. ఆవిష్కరణ, నైతికత, శ్రేష్ఠత లకు న్యాయశాస్త్రమే భావి దిక్సూచి అనే అంశం పై లా ఇన్స్టిట్యూట్ ఆవరణలో రెండురోజులజాతీయ సదస్సు మొదలైంది . ఇన్స్టిట్యూట్ అధినేత డాక్టర్ ఆర్ తిప్పారెడ్డి నేతృత్వంలో జరిగిన సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ అఫ్‌లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాంభట్ల వెంకట్రావు, రాష్ట్ర హై కోర్ట్‌విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ వి ఆర్ కె కృపాసాగర్, దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ (వైజాగ్) వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి సూర్యప్రకాశ రావు, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ టాటా నరసింగరావు ప్రధాన వక్తలుగాపాల్గొన్నారు. డాక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ ప్రపంచంలో సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మెడికల్ విద్యలప్రాధాన్యతాక్రమంలో న్యాయ శాస్త్రాన్నికూడా చేర్చాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఇటీవలిదశకాలలో భారత దేశానికిచెందిన ఐ టి నిపుణులకు ప్రపంచ దేశాల్లో ముఖ్యంగా అమెరికా లోని సిలికాన్ వ్యాలీ లో పెరుగుతున్న ప్రాధాన్యత ను ప్రస్తావిస్తూ వారి మేధో విజ్ఞానానికి సామాజిక న్యాయ కోణంలో మానసిక పరిపక్వత తోడు చేసే అవకాశం న్యాయశాస్త్రం లోనే ఉందన్నారు. ఆ కోణంలో ఆలోచించడానికి , డాక్టర్ అంబెడ్కర్‌రూపొందించిన భారత రాజ్యాంగం పై పూర్తి అవగాహన పెంచుకోడానికిన్యాయశాస్త్ర పరిజ్ఞానం ఎంతో ఉపకరిస్తుందన్నారు .

## వరాహస్వామి ఆలయ దర్శన వేళలు పొడిగింపు

**తిరుమల,డిసెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలక్షేత్రసాంప్రదాయంలో కీలకమైన భూవరాహస్వామి ఆలయం దర్శన వేళలను పొడిగిస్తూ టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అనుమతించారు. రోజురోజుకూ తిరుమలకు వస్తున్న భక్తుల రద్దీ పెరగడంతోబాటు వరాహస్వామి దర్శనానికి భక్తులు తొలుత ప్రాదాన్యతనిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ తిరుమలకు వచ్చినపుడు వరాహస్వామి ఆలయాన్ని రాత్రి 8గంటలకే మూసివేశారు. ఈ విషయాన్ని టిటిడి అధికారులకు, మీడియాకు తెలిపారు. వరాహస్వామి ఆలయ వేళలు పొడిగించి భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అదనపు ఇఒ వెంకయ్యచౌదరికి సూచించారు. ఇక ఆదివారం నుండి వరాహస్వామి ఆలయం రాత్రి 10గంటలవరకు భక్తులకు దర్శనం కల్పించేలా వేళల్లో మార్పులు చేయడంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

# తల్లి,కూతుళ్ల మధ్య డ్రగ్స్ వివాదం- తల్లి ఆత్మహత్యాయత్నం

**గుంటూరు, డిసెంబర్ 13, ప్రభాతవార్త ప్రతినిధి:** తల్లి, కూతుళ్ల మధ్యలో డ్రగ్స్ వివాదాన్ని రేపాయి. కూతురు చెప్పిన మాట వినటం లేదని తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడమే కాకుండా కూతురు డ్రగ్స్ బానిసైందని ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. కూతురు మాత్రం ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని ఆరోపిస్తుంది. దీంతో ఉన్నతాధికారులు రంగంలోకి దిగి కేసు దర్యాప్తు చేపట్టారు. గుంటూరు ఆర్టిసి కాలనీకి చెందిన స్వప్న,రాజేష్ దంపతులకి ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్న కుమార్తె ఉంది. స్వప్న హైదరాబాద్‌లో యాంకర్‌గా పనిచేస్తుంది. అయితే కొన్ని రోజులుగా కుమార్తె ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో ఆమెపై తల్లి దండ్రులు దృష్టి పెట్టారు. ఈ క్రమంలోనే కూతురికి కౌశిక్ అనే యువకుడితో పరిచయం ఉన్నట్లు తేలింది. ఇన్ స్టాలో పరిచయమైన కౌశిక్‌తో మైనర్ చనువుగా ఉన్నట్లు గుర్తించారు. ఈక్రమంలోనే తమ కుమార్తెకు పెళ్లి చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే తల్లిదండ్రుల పెళ్లి చేసుకునేందుకు భూమిక ఇష్టపడలేదు. దీంతో శుక్రవారం రాత్రి భూమిక ఫోన్ తీసుకున్న తల్లిదండ్రులు తమ కుమార్తె డ్రగ్స్‌కు బానిసైనట్లు గుర్తించారు. తప్పుడు మార్గంలో ప్రయాణిస్తుందని తనతో గొడవకు దిగారు. తల్లిదండ్రులను టీనేజర్ ఎదిరించి మాట్లాడటంతో తల్లి కుమార్తెను కొట్టింది. ఇద్దరి మధ్య వివాదం మధ్య వివాదం ముదరడంతో మనస్థాపానికి గురైన తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమార్తెను డ్రగ్స్ కు బానిస చేసి ఆమెతో చనువుగా ఉంటూ డ్రగ్స్ వినియోగిస్తున్న వీడియోస్ కూడా ఉన్నట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ క్రమంలోనే ఈ పిర్యాదుపై పోలీసు శాఖ అప్రమత్తమైంది. జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న తల్లి స్వప్నను ఈగిల్ చీఫ్ ఆకే రవికృష్ణ, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరామర్శించారు. ఇద్దరి స్టేట్ మెంట్స్ తీసుకున్నామని కేసును దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు. స్వప్న కుమార్తె డ్రగ్స్ తీసుకున్నట్లు ప్రాథమిక సమాచారం ఉన్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ చెప్పారు. కేసు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.


# గోదావరి పుష్కరాలు 2027 జూన్ 26నుంచి జూలై 7వరకు 12 రోజులు

**విజమవాడ,డిసెంబరు 13,ప్రభాత వార్తప్రతినిధి:** గోదావరి పుష్కరాలు 2027 జూన్ 26నుంచి జూలై 7వరకు (12రోజులు) జరుగుతాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రెవెన్యూ(ఎండోమెంట్స్) శాఖ జీఓ ఆర్‌టి నెంబరు 1575ను విడుదల చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆస్థాన సిద్ధాంతి తంగిరాల వెంకట కృష్ణ పూర్ణప్రసాద్ అభిప్రాయాలను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు. పుష్కరాల తేదీలను అన్ని శాఖలు, దేవస్థానాలు, జిల్లా యంత్రాంగం పరిగణలోకి తీసుకుని, అవసరమైన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఇప్పటికే ఏపీ ప్రభుత్వం గోదావరి పుష్కరాల ఏర్పాట్లు ప్రారంభించింది. పాత ఘాట్‌ల అభివృద్ధి,నూతన ఘాట్‌ల ఏర్పాటు,విశ్రాంతి గదులుతో

గోదావరి తీరంలో పర్యాటక సొగసులను కల్పించే దిశలో కార్యచరణ చేపట్టింది.ఎక్కడిక్కడ భద్రతా చర్యలు చేపట్టే దిశలో ముందుకు వెళ్తుంది.,దీంతో రహదారులు,వంతెనల నిర్మాణాలు చేపట్టింది.

ఆట


## జాతీయ రెజ్లింగ్ ఛాంపియన్‌గా పంగల్



**న్యూఢిల్లీ:** జాతీయ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2025, భారత్ రెజ్లర్ ఆంటిమ్ పంగల్ ఛాంపియన్‌గా నిలిచింది. అహ్మదాబాద్‌లో జరిగిన జాతీయ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆంటిమ్ మహిళల 55 కిలోల బంగారు పతక విజేత అయింది. తొలి రోజున పది మహిళల వెయిట్ కేటగిరీలకు సంబంధించిన పోటీలు జరిగాయి. ఆంటిమ్, మనీషా, మాన్సి, ప్రియా మాలిక్, నిషా దహియా, కిరణ్ వంటి అగ్రశ్రేణి రెజ్లర్లు పోటీలో పాల్గొన్నారు. ఆంటిమ్, మనీషా (57 కిలోలు), మరియు నిషా (68 కిలోలు) వారి వారి విభాగాలలో బంగారు పతకాలు సాధించారు. 76 కిలోల విభాగంలో ప్రియా మాలిక్ హర్యానాకు చెందిన జ్యోతి బెర్వాల్ చేతిలో ఓడిపోయి రజత పతకాన్ని గెలుచుకుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత మాన్సి, జాతీయ స్థాయిలో 62 కిలోల విభాగంలో కూడా కాంస్య పతకంతో సంతృప్తి చెందాల్సి వచ్చింది. కాగా హర్యానా 190 పాయింట్లతో మహిళల జట్టు టైటిల్‌ను కైవసం చేసుకుంది.

## స్క్వాష్ ప్రపంచ కప్ సెమీఫైనల్స్‌కు భారత్

### దక్షిణాఫ్రికాపై 3-0తో గెలుపు



**న్యూఢిల్లీ:** క్వార్టర్ ఫైనల్స్‌లో దక్షిణాఫ్రికాపై 3-0 తేడాతో విజయం సాధించిన భారత్ 2025 ఎస్‌డిఎటి స్క్వాష్ ప్రపంచ కప్ సెమీఫైనల్‌కు చేరుకుంది. సెమీఫైనల్లో భారత్ ప్రస్తుత ఛాంపియన్ ఈజిప్టుతో తలపడనుంది. అనుభవజ్ఞురాలైన జోష్నా చిన్నప్ప టీగన్ రస్సెల్‌పై సునాయాస విజయంతో ఆతిథ్య జట్టుకు తొలి ఆధిక్యాన్ని అందించింది. కామన్వెల్త్ గేమ్స్ పతక విజేతకు 3-0 (7-4, 7-4, 7-2) తేడాతో తొలి టైను ముగించడంతో ఆమె విజయం దాదాపుగా ఖరారైంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 29వ స్థానంలో ఉన్న భారత పురుషుల స్క్వాష్ ఆటగాడు అభయ్ సింగ్ కూడా రెండవ టైలో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. రెండవ గేమ్‌లో డెవాల్డ్ చేతిలో 2-4తో వెనుకబడినప్పటి దాని నుండి కోలుకుని రెండవ గేమ్‌ను 7-6తో గెలుచుకున్నాడు. చివరికి అతను దక్షిణాఫ్రికా ఆటగాడిని 3-0 (7-1, 7-6, 7-1)తో ఓడించాడు. టోర్నమెంట్‌లో అతి పిన్న వయస్కుడైన అనహత్ సింగ్, హేలీ వార్డ్‌ను 3-0 (7-3, 7-3, 7-4) తేడాతో ఓడించి సెమీఫైనల్‌కు చేరుకునేలా చేశాడు. అంతకుముందు పూల్ స్టేజ్ మ్యాచ్‌లలో, భారత్ తన మొదటి టైలో స్విట్జర్లాండ్‌ను 4-0 తేడాతో ఓడించింది. రెండవ పూల్ స్టేజ్ మ్యాచ్‌లో బ్రెజిల్‌ను 3-0 తేడాతో ఓడించింది.

### విశ్వ సముద్ర ఓపెన్‌లో

## యువరాజ్‌కు టైటిల్



**న్యూఢిల్లీ:** విశ్వ సముద్ర ఓపెన్ 2025లో 6 షాట్ల తేడాతో యువరాజ్ సంధు ఆరో సీజన్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. భారత్‌కు చెందిన 28 ఏళ్ల యువరాజ్ 2025 పిజిటిఐ ఆర్డర్ ఆఫ్ మెరిట్ ఛాంపియన్‌గా నిలిచాడు. అంతేకాకుండా వచ్చే ఏడాది డిపి వరల్డ్ టూర్‌లో తన స్థానాన్ని ఖరారు చేసుకున్నాడు. ఈ టోర్నీలో రన్నరప్ స్థానం నుండి తిరిగి వచ్చిన సంధు ప్రతిష్టాత్మక ఢిల్లీ గోల్ఫ్ క్లబ్ లో ఆరు అండర్ 66 చివరి రౌండ్‌తో ఎనిమిది షాట్‌లతో అద్భుతమైన విజయాన్ని నమోదు చేశాడు. ఒక షాట్ ఆధిక్యంతో రోజును ప్రారంభించిన సంధు మొదటి రెండు హోల్స్‌లో బర్డీలతో టైటిల్ వైపు తొలి అడుగులు వేశాడు. అక్కడ అతను బంకర్ నుండి పైకి క్రిందికి 12 అడుగుల కన్వర్షన్ చేశాడు. ఆ తర్వాత మరో నాలుగు బర్డీలను జోడించి తన కెరీర్‌లో 15వ టైటిల్‌ను సాధించాడు. భారత్‌కు చెందిన యువరాజ్ వరుసగా రెండోసారి బోగీ లేకుండా 66 పరుగులు చేసి, ఆ వారం మొత్తం 14అండర్ 274 పరుగులు చేశాడు. ఫలితంగా, సంధు రూ.30 లక్షల విలువైన విజేత చెక్కును అందుకుని పిజిటిఐ ర్యాంకింగ్‌లో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించాడు. 2021లో విరాజ్ మదప్ప నెలకొల్పిన డిజిసిలో అత్యల్ప విజయ స్కోరు (14అండర్ 274) రికార్డును కూడా యువరాజ్ సమం చేశాడు. శ్రీలంకకు చెందిన ఎన్. తంగరాజా తన చివరి రౌండ్ 68 తర్వాత సిక్స్ అండర్ 282తో రన్నరప్‌గా నిలిచాడు. పిజిటిఐ ర్యాంకింగ్‌లో రెండు స్థానాలు ఎగబాకి రెండవ స్థానానికి చేరుకున్నాడు. అలాగే అక్షయ్ శర్మ (ఐదుఅండర్ 283), మను గందాస్ (మూడుఅండర్ 285), రషీద్ ఖాన్ (రెండుఅండర్ 286) వరుసగా మూడు, నాలుగు మరియు ఐదవ స్థానాల్లో నిలిచారు.



### డబ్ల్యుటిసి పాయింట్స్:

## భారత్‌కు భారీ షాక్

### న్యూజిలాండ్ దెబ్బకు 6వ స్థానం

**న్యూఢిల్లీ:** వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ తాజా పాయింట్స్ టేబుల్‌లో భారత జట్టుకు భారీ నష్టం జరిగింది. న్యూజిలాండ్ తమ రెండవ టెస్ట్ మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను 9 వికెట్ల తేడాతో ఓడించి, పట్టికలో అనూహ్యంగా ముందుకు దూకింది. ఈ పరిణామాల కారణంగా భారత జట్టు మరింత వెనుకబడింది. ప్రస్తుతం పాయింట్స్ టేబుల్‌లో పాకిస్తాన్ కూడా భారత్ కంటే ముందు ఉండటం గమనార్హం. వెస్టిండీస్‌పై విజయం సాధించిన తరువాత న్యూజిలాండ్ ఆరో స్థానం నుంచి మూడవ స్థానానికి చేరుకుంది. 2023 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ విజేత ఆస్ట్రేలియా 100 పాయింట్స్ శాతంతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా యాషెస్ 2025-26 సిరీస్‌లో ఇంగ్లండ్‌పై 2-0 ఆధిక్యంలో ఉంది. ఇక ఇటీవల భారత్‌ను వారి సొంత గడ్డపై టెస్ట్ సిరీస్‌లో 2-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసిన సౌతాఫ్రికా 2వ స్థానంలో ఉంది. వెస్టిండీస్‌పై గెలుపుతో న్యూజిలాండ్ మూడవ స్థానాన్ని దక్కించుకుంది. ఈ మార్పుల కారణంగా శ్రీలంక కూడా ఒక స్థానం దిగజారి నాలుగో స్థానానికి పడిపోయింది. న్యూజిలాండ్ దూకుడు కారణంగా భారత్ ఆరో స్థానానికి పడిపోయింది. ప్రస్తుతం భారత్ కేవలం 48.15 పాయింట్స్ శాతంతో ఉంది. అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియా 100 పాయింట్స్ శాతంతో ఉండటం వల్ల టీమిండియా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకునే ఆశలు తగ్గుతున్నాయి. అంతేకాకుండా పాయింట్స్ టేబుల్‌లో పాకిస్తాన్ కూడా భారత్ కంటే ముందు ఐదవ స్థానంలో ఉంది. ఒకవేళ యాషెస్ సిరీస్‌లో మిగిలిన 3 మ్యాచ్‌లలో ఇంగ్లండ్ గనుక పుంజుకుంటే, భారత జట్టు ఏకంగా ఏడవ స్థానానికి కూడా పడిపోయే ప్రమాదం ఉంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ప్రస్తుత సైకిల్‌లో భారత్ ఇప్పటివరకు 9 టెస్టులు ఆడి కేవలం నాలుగు విజయాలు మాత్రమే నమోదు చేసింది. భారత జట్టు ఇప్పుడు దాదాపు 8 నెలల పాటు ఎలాంటి టెస్ట్ సిరీస్ ఆడదు. టీమిండియా తదుపరి టెస్ట్ సిరీస్ ఆగస్టు 2026 లో శ్రీలంకతో జరగనుంది. 2027 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే, భారత్ మిగిలిన మ్యాచ్‌లలో అత్యధికంగా గెలవాల్సిన అవసరం ఉంది.

### ఒడిశా మాస్టర్స్‌లో ఫైనల్‌కు

## ఉన్నతి, ఇషారాణి, కిరణ్

**న్యూఢిల్లీ:** ఒడిశా మాస్టర్స్-2025లో భారత్ షట్లర్లు ఉన్నతి హుడా, ఇషారాణి బారువా ఆల్ ఇండియన్ మహిళల సింగిల్స్ ఫైనల్‌కు, పురుషుల సింగిల్స్ విభాగంలో కిరణ్ జార్జ్ ఫైనల్‌కు చేరుకున్నారు. శనివారం జరిగిన ఒడిశా మాస్టర్స్ సూపర్ 100 టోర్నమెంట్‌లో ఇషారాణి, ఉన్నతి గెలుపొందారు. ఇషారాణి 18-21, 21-7, 21-7తో తాన్య హేమంత్‌ను ఓడించగా, టీనేజర్ ఉన్నతి 18-21, 21-16, 21



-16తో తస్నిమ్ మీర్‌ను ఓడించింది. జర్మనీలో జరిగిన సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ మరియు హైలో ఓపెన్‌లలో వరుసగా రెండు సెమీఫైనల్స్‌లో నిష్క్రమించిన తర్వాత ఉన్నతి ఈ సంవత్సరంలో తన తొలి ఫైనల్‌కు చేరుకుంది. అలాగే పురుషుల సింగిల్స్‌లో అనుభవజ్ఞుడైన కిరణ్ జార్జ్ సెమీస్‌లో 21-19, 8-21, 21-18 తేడాతో రౌనక్ చుహాన్‌ను ఓడించి టైటిల్ కోసం పోరాడనున్నాడు. ఆదివారం జరిగే ఫైనల్లో అతను ఇండోనేషియాకు చెందిన 19 ఏళ్ల ముహమ్మద్ యూసుఫ్‌తో తలపడనున్నాడు. తన తోటి ఇండోనేషియా ఆటగాడు బిస్మో ఒక్టోరాపై వరుస గేమ్‌లలో విజయం సాధించిన తర్వాత యూసుఫ్ ఫైనల్‌కు చేరుకున్నాడు. మరోవైపు, భారత యువ మిక్స్‌డ్ డబుల్స్ జోడీ సాత్విక్ కనపురం-రేషికా ఉతయసూరియన్ సెమీఫైనల్లో ఇండోనేషియా జంట చేతిలో ఓడిపోయింది.

వాణిజ్యం

## వడ్డీరేట్లు తగ్గించిన ఎస్‌బిఐ



**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తన కీలక రుణ రేట్లతో పాటు ఎంపిక చేసిన టర్మ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను స్వల్పంగా తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త రేట్లు ఈ నెల 15 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నిర్ణయంతో గృహ, వాహన, ఎంఎస్‌ఎంఈ రుణాల ఈఎంఐల భారం తగ్గనుంది. అన్ని కాలపరిమితులపై మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్)ను 5 బేసిస్ పాయింట్ల మేర ఎస్‌బీఐ తగ్గించింది. దీంతో ఏడాది కాలపరిమితి గల ఎంసీఎల్ఆర్ 8.70 శాతానికి చేరింది. అలాగే ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు (ఈబీఎల్ఆర్)ను 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 7.90 శాతంగా నిర్ణయించింది. పాత రుణ గ్రహీతలకు వర్తించే బేస్ రేటును కూడా 10.00 శాతం నుంచి 9.90 శాతానికి తగ్గించింది. మరోవైపు రూ.3 కోట్ల లోపు రిటైల్ టర్మ్ డిపాజిట్లపై కూడా వడ్డీ రేట్లను సవరించింది. 2 నుంచి 3 ఏళ్లలోపు డిపాజిట్లపై వడ్డీని 6.45 శాతం నుంచి 6.40 శాతానికి తగ్గించింది. సీనియర్ సిటిజన్లకు ఇదే కాలపరిమితిపై వడ్డీ రేటు 6.95 శాతం నుంచి 6.90 శాతానికి తగ్గింది. ప్రజాదరణ పొందిన అమృత్ వృష్టి 444రోజుల డిపాజిట్ పథకంపై వడ్డీ రేటును 6.60 శాతం నుంచి 6.45 శాతానికి తగ్గించింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల ఆర్థిక పనితీరు మెరుగుపడటంతో 2022-23 ఆర్థిక సంవత్సరం నుంచి వాటికి ప్రభుత్వం ఎలాంటి మూలధనం అందించలేదని ఇటీవలే కేంద్రం ప్రకటించింది.

### జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీకి

## రూ.330 కోట్లు జరిమానా



**కాలిఫోర్నియా, డిసెంబరు 13:** ప్రముఖ ఫార్మా దిగ్గజం జాన్సన్ అండ్ జాన్సన్‌కు అమెరికా కోర్టులో మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ సంస్థకు చెందిన బేబీ పౌడర్ వాడకం వల్ల తమకు ఒవేరియన్ క్యాన్సర్ వచ్చిందని ఇద్దరు మహిళలు దాఖలు చేసిన కేసులో వారికి అనుకూలంగా తీర్పు వెలువడింది. క్యాన్సర్ ముప్పు గురించి వినియోగదారులను హెచ్చరించడంలో కంపెనీ విఫలమైందని నిర్ధారించిన కాలిఫోర్నియా జ్యూరీ, బాధితులకు 40 మిలియన్ డాలర్లు (సుమారు రూ.330 కోట్లు) నష్టపరిహారంగా చెల్లించాలని ఆదేశించింది. ఈ తీర్పు ప్రకారం ఒక బాధితురాలికి 18 మిలియన్ డాలర్లు, మరో బాధితురాలికి 22 మిలియన్ డాలర్లు పరిహారంగా అందుతాయి. దశాబ్దాలుగా తాము జాన్సన్ అండ్ జాన్సన్ బేబీ పౌడర్‌ను వాడుతున్నామని, దానిలో ఉన్న ఆరోగ్య ప్రమాదాల గురించి తమకు తెలియదని బాధితులు తమ పిటిషన్‌లో ఆరోపించారు. వారి వాదనలతో ఏకీభవించిన జ్యూరీ ఈ మేరకు తీర్పు ఇచ్చింది. టాల్క్ ఆధారిత బేబీ పౌడర్ భద్రతకు సంబంధించి జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ న్యాయపరమైన చిక్కులను ఎదుర్కోవడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా ప్రపంచవ్యాప్తంగా వేలాది కేసులు దాఖలు కాగా, పలు తీర్పులు కంపెనీకి వ్యతిరేకంగా వచ్చాయి. తాజా తీర్పుతో సంస్థకు మరోసారి చట్టపరంగా ఇబ్బందులు తప్పలేదు.

## ఐపిఓల హవా!

### లిస్టింగ్‌తో మరికొన్ని మార్కెట్ ఎంట్రీ!

**ముంబయి, డిసెంబరు 13:** స్టాక్ మార్కెట్లలో ఐపిఒల హవా కొనసాగుతోంది. కొత్త ఐపిఒల కొనుగోళ్లు,మరోవైపు కంపెనీల లిస్టింగ్‌లతో వచ్చేవారం అంటే 15-19 తేదీలమధ్య సందడి వాతావరణం కనిపించనున్నది. మెయిన్‌బోర్డునుంచి ఒకే ఒక్క సంస్థ పబ్లిక్ ఇష్యూకు సిద్ధం అవుతుండగా కొరోనా రెమిడీస్, వేక్‌ఫిట్;ఐసిఐసిఐప్రుడెన్షియల్ ఎఎంసి వంటి సంస్థలు లిస్టింగ్‌కు రానున్నాయి. దీనితో కొత్త ఇష్యూలకంటే లిస్టింగ్‌లపైనే ఎక్కువ మందికి ఆసక్తి నెలకొంది. కెఎస్‌హాశ్రీచ్ ఇంటర్నేషనల్ ఒక్కటే వచ్చేవారం మెయిన్‌బోర్డు కేటగిరీలో కొనుగోళ్లకువస్తోంది. ఆఫర్‌ఫర్‌సేల్ కలిపి మొత్తం



రూ.700 కోట్లు సమీకరించాలనినిర్ణయించింది. ఇష్యూ ఈనెల 16రన ప్రారంభం అయి 18న ముగుస్తుంది. రూ.365 నంచి రూ. 384గా ధరలునిర్ణయించారు. బిఎస్‌ఇ ఎన్‌ఎస్‌ఇల్లో ఈషేర్లు లిస్ట్ అవుతాయి. ఎస్‌ఎంఇ సెగ్మెంట్‌లో మొత్తంమూడు కంపెనీలు వచ్చేవారం ఐపిఒకు వస్తున్నాయి. నప్ఫ్యూట్ లాజిటెక్ ఈనెల 15న ప్రారంభం అవుతుంది. మార్క్ టెక్నోక్రాట్స్, గ్లోబల్ ఓషన్ లాజిస్టిక్స్ కొనుగోళ్లు ఈనెల 17న ప్రారంభం అవుతాయి. ఇక మెయిన్‌బోర్డు కేటగిరీలో కొరోనా రెమిడీస్ ఫర్నిచర్ సంస్థ వేక్‌ఫిట్ ఇన్నొవేషన్ 15న స్టాక్ ఎక్ఛేంజిల్లో లిస్ట్ అవుతాయి. కొరోనా ఏకంగా 144 రెట్లు బిడ్డు అందుకుంది. వేక్‌ఫిట్ 2.52 రెట్లు కొనుగోలు అయింది. అదేరోజు రిద్ది డిస్‌ప్లే, ప్రొడాక్స్ సొల్యూషన్స్, కెవిటాయ్స్ షేర్లు ఎస్‌ఎంఇ కేటగిరీనుంచి ఎంట్రీ ఇస్తాయి. మెయిన్‌బోర్డులో నెఫ్రోకేర్ హెల్త్, పార్క్ మెడివరల్డ్ 17న లిస్టింగ్‌కు వస్తాయి. యునిసెమ్ అగ్రిటెక్, షిప్‌వేవ్స్ ఆన్‌లైన్ ఎస్‌ఎంఇ కేటగిరీలో మార్కెట్ ఎంట్రీ సిత్తాయి. పాజ్సన్ ఆగ్రో, హెచ్‌ఆర్‌ఎస్ అలుగ్లేజ్ ఎస్‌ఎంఇ కేటగిరీలోనే 18న లిస్ట్ అవుతాయి.

ఇక ఐసిఐసిఐప్రుడెన్షియల్ ఐపిఒ 19న లిస్టింగ్‌కు వస్తోంది. ఒకోషేరుధరల శ్రేణి 2061నుంచి 2165 రూపాయలుగా కంపెనీ నిర్ణయించింది. 19న లిస్టంగ్‌కు వస్తోంది. ఈ కంపెనీతోపాటే స్టాన్‌బిక్ ఆగ్రో, అశ్విని కంటెయినర్; ఎగ్జిమ్‌రూట్ కంపెనీలు ఎస్‌ఎంఇ సెగ్మెంట్‌లో మార్కెట్‌కు రానున్నాయి.




### గుర్తింపులేని క్లెయిమ్‌లపై

## ఐటిశాఖ నజర్

### పన్ను చెల్లింపుదారులకు సిబిడిటి హెచ్చరికలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** విరాళాలపేరిట చేసిన నకిలీ క్లెయిమ్‌లుచేసిన వారిపై ఇపుడు ఆదాయపు పన్నుశాఖ నిఘా పెంచింది. గుర్తింపులేని రాజకీయ పార్టీలు, ఛారిటీలకు విరాళాలపేరిట నకిలీ క్లెయిమ్‌లు ఎక్కువ వస్తున్నట్లు ఐటిశాఖ గుర్తించింది. ఇలాంటి వారిని గుర్తించి ఎస్‌ఎంఎస్‌లు, ఈమెయిల్స్ పంపిస్తున్నట్లు ఆశాఖ శనివారం ప్రకటించింది. పన్నుభారం తగ్గించుకోడానికి పెద్దసంఖ్యలో బోగస్ విరాళాలుచూపిస్తూ క్లెయిమ్‌లు నమోదయ్యాయని కొందరురిఫండ్లు కూడా క్లెయిమ్‌చేసినట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నులబోర్డు ప్రకటించింది. ఈ పన్నుచెల్లింపుదారుల రిజిస్టరు మొబైల్ నంబర్లకు ఈనెల 12వ తేదీనుంచి సందేశాలు పంపిస్తున్నట్లు ఆర్థికశాఖప్రకటించింది. బోగస్ క్లెయిమ్‌లు దాఖలుచేసిన పన్ను చెల్లింపరదారులు తప్పులు సరిదిద్దుకునే అవకాశం కల్పిస్తున్నటట్లు చెప్పిన మంత్రిత్వశాఖ ఆ క్లెయిమ్‌లు విత్‌డ్రాచేసుకుని ఐటిఆర్‌లు అప్‌డేట్‌చేసుకోవాలనిసూచించింది. రిజిస్టరు అయిన గుర్తింపులేని రాజకీయ పార్టీలో అంటే ఆర్‌యుపిపిలు చాలావరకూ పన్నులు ఫైల్‌చేయడంలేదని, రిజిస్టర్డు చిరునామాల్లో ఎలాంటి కార్యకలాపాలు లేవని, ఎలాంటి రాజకీయ కార్యకలాపాల్లోను పాల్గొనడంలేదని సిబిడిటి గుర్తించింది. ఈ పార్టీలు నిధులు అక్రమంగా తరలింపు హవాలా లావాదేవీలు, సీమాంతర చెల్లింపులు బోగస్‌రసీదులు జారీ వంటి వాటిలో నిమగ్నం అయినట్లు గుర్తించింది. ఇలాంటి పార్టీలు, ట్రస్టులపై సోదాలునిర్వహిస్తే వ్యక్తుల బోగస్ విరాళాలు, కంపెనీల బోగస్ సిఎస్‌ఆర్‌ల గుట్టు మొత్తం బయటపడింది.

## బిఎస్‌ఇ-ఇండియాపోస్ట్ ఒప్పందం

### మ్యూచువల్ ఫండ్స్‌పై ప్రజలకు అవగాహన

**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** బాంబేస్టాక్ ఎక్ఛేంజి, ఇండియాపోస్ట్‌లు మ్యూచువల్ ఫండ్స్ సేవలందించేందుకు అవగాహణ ఒప్పందంచేసుకున్నాయి. దేశవ్యాప్తంగా ఇండియాపోస్ట్ సేవలను అనుసరించి మూచువల్‌ఫండ్ సేవలు అందుకోవచ్చుని ఈ ఒప్పందం సారాంశం. ఆర్థిక సేవల ఉత్పత్తులు అందుబాటులో లేని మిలియన్లకొద్దీపౌరులకు ఈ సేవలు చేరువచేస్తాయని చెపుతున్నారు. ఎంపికచేసిన పోస్టల్ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి ఎంఎఫ్ పంపిణీదారులుగా వారిని రూపొందిస్తారు. పోస్టల్ సిబ్బంది కస్టమర్లకు తగు సూచనలు, సలహాలిస్తూ పెట్టుబడుల నిర్ణయాలపై వారికి చేదోడుగా ఉంటారు. వారి లావాదేవీల నిర్వహణలో సాయం చేస్తారు. బిఎస్‌ఇ స్టార్ ఎంఎఫ్ పేరిట దేశంలోనే అతిపెద్ద మూచువల్‌ఫండ్ ప్లాట్‌పామ్‌పై ఈ లావాదేవీలునిర్వహిస్తారు. రెండుసంస్థలు చేసుకున్న ఒప్పందం మూడేళ్ల పాటు అమలులో ఉంటుంది. 2025 డిసెంబరు 12నుంచి 2028




డిసెంబరు 11వ తేదీవరకూ ఈ ఒప్పందం లమలులో ఉంటుందని ఉన్నతాధికారులు తెలిపారు. అధీకృత సిబ్బంది ఎంప్లాయీ యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్స్ ఈయుఐ ఎన్‌లు కూడా అందచేస్తారు. ఈ ఒప్పందం అనుసరించి బిఎస్‌ఇ పోస్టల్ ఉద్యోగులకు ఎన్ఃఐఎస్‌ఎం మూచువల్‌ఫండ్ పంపిణీదారుడిగా సర్టిఫికేట్ కూడా జారకీచేస్తుంది. మొదటి విడతగా రెండు,మూడోశ్రేని పట్టణాలకు అందుతాయి. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈసేవలు అందిస్తాయి. శిక్షణపొందిన పోస్టల్ ఉద్యోగులే ఇందుకు మార్గదర్శకులుగా ఉంటారు.




### కొత్త సంవత్సరంలో

### బిఎస్‌ఇ, ఎన్‌ఎస్‌ఇలకు

## సెలవులు ఇవే!

**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** కొత్తకేలండర్ సంవత్సరానికి సంబంధించి స్టాక్ మార్కెట్ల సెలవుల జాబితా బిఎస్‌ఇ, ఎన్‌ఎస్‌ఇలు విడుదలచేసాయి. వారాంతాల్లోకాకుండా 2026 సంవత్సరం మొత్తంమీద పండుగలు,ఇతర ప్రధాన రోజులకారణంగా 15రోజులు సెలవులు ఉన్నాయి. ఈక్విటీట్రేడింగ్స్, డెరివేటివ్స్, సెక్యూరిటీస్ కార్యకలాపాలు నిలిచిపోతాయి. ఆయా తేదీలప్రకారం పెట్టుబడి, ట్రేడింగ్ వ్యూహాలనున సిద్ధంచేసుకోవాలని స్టాక్ ఎక్ఛేంజిలు సూచించాయి. జనవరి 26 రిపబ్లిక్‌డే సందర్భంగా బిఎస్‌ఇ ఎన్‌ఎస్‌ఇలకు సెలవు. మార్చి 3న హోలి మార్చి 25న శ్రీరామ నవమి, మార్చి 31న మహావీర్‌జయంతి సందర్భంగా మార్కెట్లు శెలవులో ఉంటాయి. ఇక ఏప్రిల్3న గుడ్‌ఫ్రైడే, 14న డా బిఆర్ అంబేద్కర్ జయంతి, మే 1న మహారాష్ట్రడే, మే 28న బక్రీద్, జూన్ 26న మొహర్రం సందర్భంగా ఆయారోజుల్లో స్టాక్ మార్కెట్లకు సెలవు.మళ్లీ సెప్టెంబరు 14న వినాయక చవితి, అక్టోబరు 2న మహాత్మాగాంధీజయంతి, అక్టోబరు 20న దసరా సందర్భంగా స్టాక్ మార్కెట్లు రెండింటికీ సెలవులుంటాయి. డిసెంబరు 25న క్రిస్మస్‌సందర్భంగా కార్యకలాపాలు కూడా నిలిచిపోతాయి. అయితే మహాశివరాత్రి ఫిబ్రవరి 15న,ఈత్ ఉల్‌ఫితర్ మార్చి 21వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15, నవంబరు 8 దీపావళి లక్ష్మీపూజ శని, ఆదివారాల్లో వస్తున్నాయి. ఆరోజుల్లో స్టాక్ మార్కెట్లకు ఎలాగూ సెలవు దినాలే. దీపావళి లక్ష్మీపూజ ఆదివారం కావడంతో అదేరోజు మూతర్‌ట్రేడింగ్ నిర్వహిస్తారు. ట్రేడింగ్ సమయాన్నికొద్దిరోజులముందు మాత్రమే ప్రకటిస్తారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps